# చైతన్యం

ఏప్రిల్ 2019
సం 20

సంకల్ప బలం



సామాజిక విలువల మాసపత్రిక

ఉగాది శుభాకాంక్షలు







# చైతన్యం

సంకల్ప బలం


సామాజిక విలువల మాస పత్రిక

సంపుటి -8 ఏప్రిల్ 2019 సంచిక -7



వ్యవస్థాపక సంపాదకురాలు

**తీగవరపు శాంతి**


## ఈ సంచికలో

### ధారావాహికములు:


| | |
|---|---|
| మానసరోవర యాత్ర | 6 |
| ప్రేమంటే ఇంతే | 13 |
| ముల్లా నస్రుద్దీన్ కథలు | 17 |
| కాశీ ఖండం | 23 |
| సంభాషణ సంస్కృతం | 29 |
| మా ఊరి నందుల కథ | 36 |
| ప్రహేళిక | 42 |
| రాశి ఫలాలు | 48 |


### ప్రత్యేక ఆకర్షణలు


| | |
|---|---|
| సంపాదకీయం | 4 |
| అభిప్రాయ వేదిక | 5 |
| ఒక అన్వేషణ | 10 |
| వింజమూరి అనసూయాదేవి | 18 |
| ఎన్నికల కందములు | 21 |
| తెలుగు పద్య రత్నాలు 1 | 24 |
| వట్టికోట ఆళ్వారు స్వామి | 26 |
| తడబాటు | 34 |
| ధన్వంతరి కారాగారం | 37 |
| చర్చ | 39 |
| తెలుగువారి అయోధ్య భద్రాచలం | 43 |
| వేసవిలో మలయమారుతం | 50 |



రచనలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే. పత్రిక యాజమాన్యానికి ఎటువంటి సంబంధమూ లేదు.

## వికారి నామ సంవత్సర శుభాకాంక్షలు

ప్రపంచంలోని ప్రజలందరూ వికారి నామ సంవత్సరంలో సుఖ సంతోషాలతో, ఆయురారోగ్య ఐశ్వర్యాలతో ఉండాలని శుభాకాంక్షలు తెలియజేస్తోంది మీ చైతన్యం సంకల్పబలం.
తెలుగువారంతా ఎంతో ఆత్రుతగా ఎదురుచూసే పండుగ ఉగాది. ఆ రోజు ఎంత ఆనందంగా గడిస్తే సంవత్సరమంతా అంత సంతోషంగాను ఉంటామనేది అందరి అభిలాష. వేప పువ్వుల పచ్చడి ఉగాదికి ఒక ప్రత్యేకత అయితే, పంచాంగ శ్రవణం వింటూ, తమ నక్షత్ర బలాన్ని బట్టి, సంవత్సరమంతా తమ జాతకం ఎలా ఉంటుంది? అని తెలుసు కోవాలని ఎంతో ఆత్రుతగా ఎదురు చూసి, ఆ రోజు పంచాంగ శ్రవణం లో పాల్గొనడం మరొక ప్రత్యేకత.

## తెలుగు తేజాలకు అభినందనలు

సివిల్స్ కి ఎంపికైన 40 మంది తెలుగు తేజాలకు అభినందనలు తెలుపుతోంది చైతన్యం సంకల్పబలం.

## ఎన్నికల వేడి - ఎండల వేడి.

ఈ సంవత్సరం ఉగాది హడావిడి కన్నా ప్రచారాల హడావిడే మన దేశంలో ఎక్కువగా ఉంది అని చెప్పచ్చు. మానిఫెస్టోల తాయిలాలతో సూర్యుడి వేడితో పాటు పార్టీలు కూడా ప్రజలను వేడెక్కించడం లో ఒకరికి మించి మరొకరు పోటీ పడుతున్నారు. ఓ పక్క మీటింగుల్లో కూర్చుని నానా అవస్థలు పడుతున్న ప్రజలారా ! మేల్కొనండి. మీ మెదడుకు పదును పెట్టండి ఓటు వేసేటప్పుడు. ప్రలోభాలకు లొంగి, నా ఒక్క ఓటే కదా! అనుకోకండి. పార్టీలన్నీ ఇప్పుడు వారికి మీ ఓటు అవసరం కాబట్టి రకరకాల తాయిలాల పేర్లతో అస్త్రాలు మీ మీద ప్రయోగించి, మీ ఓటు అనే ఆయుధాన్ని లాక్కోవాలనుకుంటున్నారు. మన ఓటు ఎవరికో ఒకరికి తప్పక వెయ్యాలి. కానీ వేసే ముందు బాగా అందరు కలిసి మెలిసి ఆలోచించుకోండి. మనం వేసే ఓటు మనకే కాక మన భవిష్యత్తు తరాలకి, దేశానికి ఎంత వరకు ఉపయోగపడుతుంది? అంతేకాదు, ఇప్పుడు మీ ఇళ్ళకి వచ్చి ఓటు అడుగుతున్నారు కదా! అధికారంలో ఉన్న పార్టీ వస్తే వాళ్ళు ఇంతవరకు ఏమి చేసారు? ఏమి చెయ్యలేదో ఏకరువు పెట్టండి. ఎన్నికలలో నెగ్గినా అదే తీరుగా మన కష్ట సుఖాలు పంచుకుంటారా? వాళ్ళు మన ఇంటికి రాకపోయినా ఫరవాలేదు. మనకి ఏదైనా అవసరం వస్తే, వారి గుమ్మం ముందు అయినా నిలబడనిస్తారా? ఇవన్నీ పాలకులు మీ దగ్గరకు వచ్చినపుడు నిలదీసి అడిగి, ఇంతవరకు వాళ్ళు ఏమి చెయ్యలేదో అవి కుడా అడగండి. ఇదే మీకు అవకాశం. వారి ఓటు కోసం వాళ్ళు ఎలా పాకులాడుతున్నారో, మీరు కూడా మీకు వాళ్ళు చేయవలసినవి ఎట్టి పరిస్థితులలోను వదులుకోవద్దు. అన్ని విషయాలు జాగ్రత్తగా ఆలోచించుకుని, మనం ఓటు వేసి నెగ్గించుకున్న వాళ్ళు మనకి అండగా నిలబడతారంటేనే మీ ఓటు వెయ్యండి. మన దేశ భవిష్యత్తు మన చేతిలోనే ఉందని మాత్రం మరచి పోకండి. ఓటు మీ హక్కు. ఓటు వెయ్యడం మీ బాధ్యత.

## ఓటు వేస్తే బాధ్యత అయిపోతుందా?

అలా అని ఓటు వేసేశాం మన బాధ్యత అయిపోయిందని, ఆ రాజకీయాలు మనకేం తెలుస్తాయిలే అని ఊరుకోకుండా ఎప్పటికప్పుడు ప్రభుత్వం తన బాధ్యతలు గుర్తెరిగి నిర్వహిస్తోందా? లేదా అనే విషయాన్ని ప్రజలందరూ ఎంతో అప్రమత్తంగా గమనించాలి. ఒక వేళ ప్రజలకు ఎక్కడైనా అన్యాయం జరుగుతుంటే, ప్రజలంతా కలిసి కట్టుగా ఎదురు తిరిగి పోరాడి, సాధించాలి. అదికూడా ప్రజల బాధ్యతే అని మరచిపోవద్దు. మన కుటుంబ బాధ్యత ఎలాగో అలాగే దేశ బాధ్యత కుడా మనదే అన్న విషయం ప్రతీ ఒక్కరు తెలుసుకుని మసలాలి. మన దేశాన్ని సస్యశ్యామల దేశంగా తీర్చి దిద్దుకోవడంలోను, మన దేశ అభివృద్ధికి పాటు పాడడంలోను మనమంతా ముందుండాలని, ప్రజలంతా దేనికీ లోటు లేకుండా జీవించాలని చైతన్యం సంకల్ప బలం కోరుకుంటోంది.

**సర్వేజనా సుఖినో భవంతు.**

తీగవరపు శాంతి

# అభిప్రాయ వేదిక

సమయోచితంగా అమరులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ టైటిల్ పేజీతో మార్చిలో మీరు విడుదల చేసిన పత్రిక చూసి నోటమాట రానంతగా ఉంది. అలాగే మానస సరోవరయాత్ర మీరు దగ్గరుండి చేయిస్తున్నట్లు ఉంది.
**శ్రీ రమణరావు,శ్రీ పోడూరి శ్రీనివాసరావు, శ్రీమతి శేషు, శ్రీ ప్రభాకరశాస్త్రి హైదరాబాదు**

వెంకటేశ్వర రావుగారు ప్రతీ నెల ఎంతో విలువైన సమాచారాన్ని అందిస్తున్నారు. వారికి మా ప్రత్యేక కృతజ్ఞతలు. మార్చి నెలలో ప్రచురించిన "అనిర్ధారిత సూత్రం" ఎంతో ఉపయోగకరంగా ఉంది. అలాగే "ప్రేమంటే ఇంతే" కథ చాలా బాగా ఉంటోంది. మన కుటుంబ విషయాలకు దగ్గరగా, మనకి దగ్గర వాళ్ల విషయాలా అన్నంత ఆసక్తి కరంగా సాగుతోంది.
శ్రీమతి సీత , శ్రీమతి సరోజ ---- ఏలూరు. శ్రీ కమలేష్, శ్రీమతి అను ----- కరీంనగర్..

పాలెపు బుచ్చిరాజు గారు వ్రాస్తున్న 'ముల్లా నస్రుద్దీన్' కథలు సామాజిక విషయాలను చర్చిస్తూనే కథను ఎంతో చక్కగా తీసుకు వస్తున్నారు. పోడూరి శ్రీనివాస రావు గారు మార్చి నెలలో ఎంతో సమయోచితంగా ఉమెన్స్ డే సందర్భంగా అందిచ్చిన శ్రీమతి సుధామూర్తి గారి గురించిన ఎంతో అద్భుత విషయాలు అందించారు. వారికి, ఆ ఆదర్శమూర్తి జోహార్లు .
శ్రీమతి రత్న , శ్రీమతి భారతి ---- కాకినాడ. శ్రీ రమేష్,

వేదుల సుబ్రహ్మణ్యం గారు వ్రాసిన ఎన్నికల మీద పద్యాలు యుక్తులు, కుయుక్తులు చాలా బావున్నాయి. ఏంటో ఓపెన్ గా వ్రాసారు. కాశీ ఖండం గురించి మురళీ కృష్ణ గారు చాలా ఆసక్తికరంగా వ్రాస్తున్నారు. కానీ చాలా కొద్దిగా మాత్రమే ఉండడంతో నిరుత్సాహ పడ్డాము.
శ్రీ రామానందం, శ్రీ సుధాకర్ ----- అనపర్తి .

తెలంగాణా మహానుభావులు లో భాగంగా తుమ్మూరి రామ మోహన్ రావు గారు " శ్రీ వాన మామలై జగన్నాధాచార్యులు గురించి తెలియని ఎన్నో విషయాలు తెలియజేసారు చాలా బావుంది. చిలకమర్తి దుర్గా ప్రసాద రావుగారు మాకు అందిస్తున్న "సంస్కృత సంభాషణ" ఎంతో విజ్ఞాన దాయకంగా ఉంటోంది. చక్కని పాఠాలు మాకు అందజేస్తున్నారు.
శ్రీ చైతన్య , శ్రీ మధు ---- హైదరాబాదు. శ్రీమతి సుశీల

"పసిడి మనసులు" పిల్లల గురించి ఎంతో అద్భుతమైన కథలు అందిస్తున్నారు "ఆదూరి హైమావతిగారు" శ్రీమతి భారతి గారు వ్రాసిన "కలికాలం ముచ్చట్లు" సరదాగా బావుంది. "నందుల ఆత్మీయ కథ" పల్లెటూళ్లలో పండుగల గురించి బాగా వ్రాస్తున్నారు.
శ్రీ సాయి, శ్రీ మురళి --- రావుల పాలెం.7. ఎలక్ట్రాన్ గారు వ్రాసిన " గమ్యం కథ బావుంది. సామాజిక సమస్యలకు పరిష్కారమార్గం గావుండే వీరి కథలు బావుంటున్నాయి.

8. "ప్రహేళిక" కొద్దిగా కష్టంగా ఉన్నా ఆలోచింప చేసే దిగా ఉంటోందనడంలో ఎటువంటి సందేహం లేదు. బుర్ర కి బాగా పదును పెట్టిస్తోంది. కొత్త రామా నందంగారు "ఫాల్గుణ మాసం" గురించి బాగా వ్రాసారు. మంచి విషయాలు అందిస్తున్నారు.
శ్రీ శర్మ, శ్రీ అరుణాచలం ----- విశాఖపట్నం . 9. భువన చంద్రగారు ఎంతో సమయోచితగా అందిచ్చిన "జైహింద్" అద్భుతం. యుద్ధం గురించిన విషయాలతోపాటు , ఎంతో గొప్ప సూచనలనిచ్చిన వారికి ధన్య వాదాలు. ఎంతో ఆశక్తి కరంగా చూసే రాశి ఫలాలు జనార్ధన కృష్ణ గారు బాగా వ్రాస్తున్నారు. ముందుగా మాదృష్టి అక్కడకే వెడుతుందనడంలో సందేహం లేదు. పత్రికలోని 4 కవర్ పేజీలు బావున్నాయి.
శ్రీ సూర్యనారాయణ, శ్రీ రేవంత్ , శ్రీమతి కల్పవల్లి ---- పూనా . శ్రీమతి శకుంతల , శ్రీమతి ప్రణవి, శ్రీమతి సుధ ---- బెంగుళూరు.

పత్రికలో వ్రాసున్న రచయితల కథలపై అనేకమంది దగ్గరనుండి అభిప్రాయాలు వస్తున్నాయి. కానీ పత్రికలో చోటు లేక వెయ్యలేక పోతున్నందుకు క్షమించాలి. అలాగే వీడియో గురించి కూడా అనేక మంది పంపుతున్నారు. మీ అభిప్రాయాలను దయుంచి యూ ట్యూబ్ లోనే వీడియో కింద వ్రాయ వలసిందిగా కోరుతున్నాను. పత్రికలో చోటు లేకపోవడం వల్ల వాటిని కూడా ప్రచురించ లేక పోతున్నాను . అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను.

- ఎడిటర్

# కల నిజమాయె - ముక్తినాథ్ మానస సరోవర యాత్ర

ఆ ముక్తినాథ్ దేవుణ్ణి మరొకసారి దర్శించుకుందామని మనసులో బాగా అనిపించింది. పొద్దున్నే త్వరగా లేచి తయారయ్యి మళ్ళీ కొండ ఎక్కటానికి బయలుదేరాము. ఈ కొండ సముద్ర మట్టానికి మూడు వేల ఏడు వందల యాభై మీటర్ల ఎత్తులో ఉంది.

దారిలో గుర్రం నడిపే అబ్బాయి 'అమ్మగారూ! గుర్రం ఎక్కండి. పొద్దున్నే బోణీ కొట్టండి' అంటూ వెంటబడ్డాడు. పోనీలే అనిపించి నేను ఒక్కదాన్నీ గుర్రం ఎక్కాను. నేను గుఱ్ఱం ఎక్కడానికి కారణం కుడా లేక పోలేదు. పైకి నడవాలంటే, ఆయాసం వస్తోంది. నేను కూడా ఎప్పుడూ ఎక్కలేదు. మానస సరోవరం వెళ్ళాలంటే, గుఱ్ఱం ఎక్కి, కూర్చో గలనో లేదో కుడా తెలుస్తుంది అని ఆలోచించి ఎక్కాను . మా టీమ్ లో మిగిలిన ముగ్గురు గుఱ్ఱం వెనకే నడవసాగారు. గుఱ్ఱం అబ్బాయి 300 రూపాయలు అడిగాడు పైకి తీసుకెళ్ళడానికి. మన మూడు వందల రూపాయలు నాలుగు వందల ఎనభై నేపాలీ రూపాయలకు సమానం. సరే అలాగే అన్నాను. కొంత దూరం వెళ్లిన తరవాత గుర్రం కాలు మడత బడి గుర్రం కాస్త కూలబడింది. నేను అప్రమత్తంగా ఉండటంతో, జాగ్రత్తగా మెల్లగా కిందకి జారి దిగాను. వెనుక నడుస్తున్న మావాళ్ళు పరిగెత్తుకుని వచ్చారు ఏమయిందా అని. ఏమీ అవలేదని తెలవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయం ఎందుకు చెపుతున్నానంటే ఎంత అనుభవం ఉన్న గుఱ్ఱం అన్నా ఎప్పుడైనా కింద పడే అవకాశం లేకపోలేదు. కాబట్టి గుఱ్ఱం మీద ఉన్నప్పుడు కొంచెం అప్రమత్తంగా ఉంటారని.

అలా గుఱ్ఱం దిగిపోయిన తర్వాత మళ్ళీ మెట్ల దారి పట్టుకుని గుడికి వెళ్ళాము. మళ్ళీ ఒకసారి వెళ్లి, 108 పైపుల ద్వారా వచ్చే నీళ్ళు జల్లుకుని, ముక్తినాథుడ్ని దర్శించుకుని, విష్ణు సహస్రనామం చదువుకుని, వెనక్కి బయలుదేరాము. అదే కొండ మీద ఉన్న ముక్తినాథుని యజ్ఞశాల లోపలికి వెళ్లాం. అక్కడ ఎన్ని సాలగ్రామాలు ఉన్నాయో చెప్పలేం. కళ్ళు చెదరిపోయాయి. అక్కడున్న పూజారి మాకు ఒక సాలిగ్రామం ఇచ్చారు. మహాప్రసాదంగా భావించి కళ్ళకద్దుకుని తీసుకున్నాం.

అలాగే నడచుకుంటూ వెళ్తుంటే పెద్ద బుద్ధ విగ్రహం కనపడింది. 'బుద్ధం శరణం గచ్ఛామి' అనుకుంటూ ఆ భగవానునికి



దణ్ణం పెట్టుకున్నాం. ఆ ధవళగిరి కొండలలో మేఘాల మధ్య ఆ బుద్ధ విగ్రహం చూస్తుంటే జన్మ ధన్యం అయ్యిందనిపించింది. అలా ముందుకు సాగి జ్వాలాముఖి (జ్వాలా మాయి) గుడికి వెళ్లాం. అక్కడ ఒక చిన్న గుహ నేలకిందుగా ఉంది. అక్కడ 'గుడు గుడు' మనే నీటి ప్రవాహం శబ్దం వినవచ్చు. అలాగే బాగా తీక్షణంగా చూస్తే ఆ చిమ్మ చీకటిలో చిన్న వెలుగు లాంటిది కనిపించింది. ఈ జ్వాల ఎప్పటినుంచి ఉందో ఎవరికీ తెలీదు. సృష్టి ఆది నుంచీ ఉందని ప్రజల విశ్వాసం. పంచ భూతాలలోని జల అగ్ని రూపాలలో భగవంతుని అక్కడ దర్శించుకున్నాం అన్న తృప్తితో అక్కడ నుంచి బయలుదేరాం. ముక్తినాధ్ భగవానుని దర్శనంతో జన్మజన్మాంతర పాపం నశించిపోతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. అక్కడ పూజారి మాకు చెప్పిన ముక్తిమంత్రం మీకూ చెప్తాను.

**'ఓం నమో భగవతే వాసుదేవాయ ముక్తినాధాయ నారాయణాయ".**

ఈ మంత్రం చదువుకుని మీరూ తరించండి.

ఆ ప్రదేశం వదిలి రాబుద్ధి కాలేదు. అయినా తప్పదుగా! మళ్ళీ ఫ్లైట్ పట్టుకుని పోఖరా చేరాలి కదా. కిందకి మెట్ల మీదుగా బయలుదేర బోతుంటే, అక్కడ ఉన్న పూజారి కృష్ణ ప్రసాద్ ద్వివేది గారు



జామ్ సోమ్ దాకా మాతో జీప్ లో వస్తానని, లిఫ్ట్ కావాలని మమ్మల్ని అడిగారు. అంతకన్నానా, మహద్భాగ్యం అనుకుంటూ తప్పకుండా రమ్మన్నాం. నిజంగా ఆయన మాతో రావటం మా అదృష్టం అనే చెప్పాలి. ఎందుకంటే మాకు జీప్ లో ముక్తినాధ్ విశేషాలు ఎన్నో చెప్పారు. అవన్నీ నేను మీతో పంచుకుంటాను.

గుడి నుంచి హోటల్ దాకా నడిచి వచ్చి, మా జీప్ అక్కడ మాకోసం ఎదురు చూస్తోంది. లగేజీ, ఆడవాళ్ళను మాత్రం గుఱ్ఱాల స్టాండ్ దాకా తీసుకెళ్తాను, మగవాళ్ళు మాత్రం నడిచిరండి అని జీప్ డ్రైవర్ మాతో అన్నాడు. సరేనని, నేను, విమల జీప్ లో కూర్చున్నాం, పూజారి గారు, మా మగవాళ్ళు నడిచి స్టాండ్ దాకా వచ్చారు. అక్కడ నుంచి అందరం జీప్ లో ఎక్కి జామ్ సోమ్ కి బయలుదేరాం.

ఏదైనా పుణ్య క్షేత్రానికి వెళ్ళినప్పుడు ఆ స్థల పురాణం తెలుసుకోవాలని నాకు ఎంతో ఆత్రంగా ఉంటుంది. మాతోపాటు వచ్చిన ముఖ్య పూజారి కృష్ణప్రసాద్ గారిని స్థల పురాణం గురించి మాకు చెప్పమని అడిగాను. ఆయన మాకు చాలా ఆసక్తికరమైన విషయాలు చెప్పారు. "సృష్టి ఆదిలో మహావిష్ణువు భూలోకంలోని ధవళగిరి పర్వతం మీదకు వచ్చి తపస్సు చేసుకోసాగాడు. ఆ తపోశక్తికి విశ్వం అంతా వేడెక్కిపోసాగింది. ఆ వేడిని భరించలేకపోయిన దేవతలు ఎక్కడ నుంచి ఇంత వేడి ఉత్పన్నమౌతోంది అని అంతా వెతికారు. కాని వాళ్లకు అంతు పట్టలేదు. వారంతా వెళ్లి బ్రహ్మతో మొరపెట్టుకున్నారు. నాకూ తెలియట్లేదు ఇంత వేడి ఎక్కడ నుంచి వస్తోందో, పదండి మనమంతా మహా శివుడ్ని ప్రార్థిద్దాం అని దేవతలను తీసుకుని కైలాస పర్వతం మీదకు తీసుకెళ్ళాడు. వారంతా శివుని ప్రార్థించగా వారితో పాటు శివుడు కూడా వెతకటానికి బయలుదేరాడు. కైలాసం నుంచి వారు మొట్టమొదటిగా ధవళగిరి పర్వతం మీదకు అడుగుపెట్టారు. వారికి అక్కడ మహావిష్ణువు ఘోర తపస్సు చేసుకుంటూ కనబడ్డాడు. నీ తపస్సుకు కారణం ఏమిటని బ్రహ్మ మహేశ్వరులు శివుని ప్రశ్నించగా 'ఈ లోకంలో మానవుల బాధలు చూడలేకపోతున్నాను, ఈ జనన మరణ కాల చక్రంలో మానవులు పడే బాధలకు విముక్తి కలిగించా-

లి' అని చెప్పాడు. అప్పుడు బ్రహ్మ మహేశ్వరులు 'ఈ ప్రదేశం ముక్తినాథ్ క్షేత్రంగా ప్రసిద్ధి చెందుతుంది. ఈ క్షేత్రంలో నిన్ను దర్శించినవారికి జన్మ రాహిత్యం లభించి, ముక్తి దొరుకుతుంది' అని వచించారు. అంతట శ్రీ మహావిష్ణువు అక్కడే స్వయంభువుగా ప్రకటితం అయ్యాడు. ఆనాటినుంచి శ్రీ మహావిష్ణువు ఈ క్షేత్రంలో ముక్తినాథుడిగా మానవులను తరింపజేసి ముక్తిని ప్రసాదిస్తున్నాడు" అని చెప్పి ఆయన ముగించారు. మాకు క్షేత్ర మహిమ తెలియజేసినందుకు ఆయనకు మేమంతా కృతజ్ఞతలు తెలిపాం. ఆయన సంభాషణ అంతా హిందీలో సాగటంతో, మాతో పాటు వచ్చిన తమిళియన్స్ కి అర్ధం కాలేదు. దాంతో మేము వారికి ఇంగ్లిష్ లో ఈ కథంతా తర్జుమా చేసి చెప్పాం.

ఈ పురాణ కాలక్షేపం జరుగుతుండగానే మళ్ళీ గండకి నది వచ్చింది. 'పొద్దున్నే అయితే ప్రవాహం ఎక్కువ వుండదు, తేలికగా నదిలోంచి దాటుకుని వెళ్లిపోవచ్చు' అని ముందే మాకు డ్రైవర్ చెప్పాడు. ఈ నది మీద త్వరలో బ్రిడ్జి కట్టబోతున్నారు అని కూడా డ్రైవర్ చెప్పాడు. ఈ గండకీ నది వెనుక ఏమైనా కథ ఉందా అని నేను కృష్ణప్రసాద్ గారిని అడిగాను. ఆయన ఇలా చెప్పసాగారు.

"పూర్వం జలంధరుడు అని ఒక రాక్షసుడు ఉండేవాడు. అతను అతి బలవంతుడు. అతని భార్య వృంద మహా పతివ్రత. గొప్ప విష్ణు భక్తురాలు. ఆమె పాతివ్రత్యం వల్ల అతని బలం మరింత పెరిగింది. ఆ బలాతిశయంతో అతను ముల్లోకాలను బాధించసాగాడు. దేవతలు అంతా శివ కేశవులను రక్షించమని ప్రార్ధించారు. వారి ప్రార్ధనను మన్నించి లోక కంటకుడైన జలంధరుడిని సంహరించటానికి శివుడు బయలుదేరాడు. ఘోర యుద్ధం మొదలయ్యింది. ఎంతకూ జలంధరుడు సంహరింపబడట్లేదు. జలంధరుని శక్తి ఎందుకు సన్నగిల్లట్లేదా అని ఆలోచించిన విష్ణువుకి విషయం అర్ధమయ్యింది. వృంద పాతివ్రత్యమే ఆమె భర్తకు రక్షణ కవచంగా నిలుస్తోందని అర్ధమయ్యింది. ఆమె పాతివ్రత్యం భంగం అయితే కానీ జలంధరుడు మృత్యువాత పడడు అని గ్రహించిన విష్ణువు, జలంధరుడి రూపం ధరించి వృంద దగ్గరకు వెళ్ళాడు. ఒక్క క్షణం తన భర్తే వచ్చాడని వృంద భ్రమించింది. ఆ విధంగా ఆమె పాతివ్రత్య భంగం కావటం తోనే మహాశివుడు జలంధరుడిని సంహరించాడు.

జరిగిన మోసం తెలిసిన వృంద ఆ వచ్చినది జలంధరుడు కాదు విష్ణువు అని గ్రహించింది. కోపావేశంతో విష్ణువును 'శిలగా మారిపో' అని శపించింది. కానీ మరుక్షణమే తన ఆరాధ్య దైవమైన విష్ణుమూర్తిని శపించినందుకు ఎంతో బాధపడింది. విష్ణుమూర్తిని మన్నించమని ప్రార్ధించింది. ప్రసన్నుడైన విష్ణుమూర్తి ఆమెను ఏదైనా వరం కోరుకోమన్నాడు. విష్ణువును తన సంతానంగా పుట్టమని ఆమె కోరింది. అప్పుడు విష్ణుమూర్తి 'వృందా! నువ్వు గండకి నదిగా పుడతావు. నీ శాపం వృధా పోకుండా నేను శిలగా మారి, నీ కోరిక ప్రకారం నీ గర్భంలో సాల గ్రామమై పుడతాను. ఎల్లప్పుడూ నీ ఒడిలోనే ఉంటాను. నీ శిరోజాలే పవిత్రమైన తులసి వృక్షాలుగా మారతాయి. తులసి దళాల పూజ నాకు ఎంతో ప్రీతికరమౌతుంది' అని వరమిచ్చాడు. ఆ గండకీ నదే మనం ఇప్పుడు దాటుతున్నది" అని చెప్పి కృష్ణప్రసాద్ ద్వివేది గారు తమ కథనం ముగించారు. ఎన్నో విశేషాలను మాకు చెప్పిన ఆయనకు మేమంతా మరోమారు ధన్యవాదాలు చెప్పాం.

అలా అలా చూసి కిందకి వచ్చి మరలా జీప్ ఎక్కి కిందకి వచ్చేసాము హోటల్ కి. మాకు విమానం దొరికే అవకాశం ఉంది అనడంతో .

పితృ దేవతలకు కొన్ని కార్య క్రమాలు అక్కడ చేయ వలసి ఉంది. మాతో వచ్చిన వాళ్ళు కంగారు పెట్టడం వల్ల కిందకి వచ్చేసాము. మళ్ళీ అంత దూరం వెళ్ళ లేము కదా! అసలైన కార్య

క్రమం చేయనందుకు ఇప్పటికీ ఆ బాధ కలుగుతూ ఉంటుంది.

ఇంతా వచ్చేసాము కానీ విమానం దొరకలేదు. ఆ రోజు అలాగే కాలక్షేపం చేసి, కింద నడుస్తూ వెడుతుంటే ఎయిర్ లైన్స్ వాళ్ళ బోర్డు కనిపిస్తే, రేపు మాకు విమానం వెడుతుందా! అని అడిగితే, పొద్దుటే తెలుస్తుంది అన్నాడు. మేము కంగారు పడి, మేము ఎలాగైనా వెళ్ళాలి హెలికాప్టర్ అయినా సరే అన్నాము.

ప్రొద్దుటే 6 గంటలకు చెయ్యండి మీరు కుడా రెడీగా ఉండండి. విమానాలు వెళ్లేది, లేనిది ప్రొద్దుట వాతావరణాన్ని బట్టి తెలుస్తుంది, వెళ్ళక పోతే హెలికాప్టర్ ఏమైనా వీలవుతుందా? చూడాలి పొద్దుట గాని చెప్పలేము అన్నాడు పైలెట్. సరే, మాకు ప్రిఫెరేన్సు ఇమ్మని రిక్వెస్ట్ చేసాము. సరే. మీరు ఉన్న హోటల్ అత ను మా బ్రదర్. చెప్తాను లెండి అన్నాడు. హమ్మయ్య అనుకుని, ప్రొద్దుటే రెడీ అయ్యాము. కానీ మబ్బుగా ఉండి కొద్దిగా చినుకులు పడుతున్నాయి. విమానాలు కాన్సిల్ అన్నారు. పైకి టెర్రస్ మీదకి వెళ్లి చూస్తే, నిజంగానే అక్కడ విమానాలు లేవు. అవతల మానస సరోవరం. పెద్ద ట్రిప్. ఎలాగా అర్ధం కాలేదు. మేము ఉన్న చోటికి ఒక అబ్బాయి వచ్చి, విమానాలు అన్నీ కాన్సిల్ అన్నాడు. రోడ్డు ద్వారా? అంటే అక్కడ కుడా క్లోస్ ట అన్నాడు. మాకు కంగారు మొదలైంది.




హెలికాప్టర్ అడిగితే అని ఫోన్ చేస్తే, ఇంకా డిసైడ్ అవ్వలేదు. నేనే చేస్తాను అన్నారు. 10 నిమిషాల్లో ఫోన్ చేసి హెలికాప్టర్ వెడుతుంది తొందరగా రండి అన్నాడు.

మేము వెళ్లేసరికి ఎయిర్ పోర్ట్ ఫుల్ గా జనం. విమానంలో వెళ్ళేవాళ్ళు కూడా ఉన్నారు. మమ్మల్ని విడిగా పిలిచి, 10 వేల రూపాయలు ఇక్కడ cash ఇవ్వండి. మిగిలినవి పోకరా వెళ్ళాక, కార్డ్ మీద కుడా ఇవ్వచ్చు ను అన్నాడు. మాతో వచ్చిన వాళ్ళు cash లేదంటే మా వారిని మీరు ఇచ్చెయ్యండి అన్నాను. వాళ్ళ డబ్బు, మాది కుడా మావారు ఇచ్చారు. కాని మనకి ఇబ్బంది అవుతుందేమో కాష్ అంతా ఇచ్చేస్తే, పెద్ద ట్రిప్ ఉంది కదా! అన్నారు. పోనీ లెద్దురూ అన్నాను. అయినా నాకు ఎందుకో అనుమానంగా ఉంది విమానాలు వెడతాయేమో! ఎక్కువ డబ్బులు పెట్టి వెడుతున్నాము కదా! అన్నాను. అమ్మో! వెళ్లి తీర వలిసిందే. మాకు అనుమానం లేదు అన్నారు మాతో వచ్చినవాళ్ళు. 'సరే, అందరం కలిసి వచ్చాము కదా! పోనీలే' అన్నారు మా వారు. ఇంకో కాస్సేపటికి మేము బుక్ చేసుకున్న విమానం మా హెలికాప్టర్ కన్నా ముందు వెళ్ళింది .

నాకైతే, డబ్బులకన్నా, మనము వాళ్ళ దగ్గర మోసపోయాము అనేదానికి చాలా బాధ కలిగింది. మా విమానం టిక్కట్ల డబ్బులు పోకరా వెళ్ళాక అక్కడ ఆఫీస్ కి వెళ్లి కలక్ట్ చేసుకుంటుంటే అక్కడ ఆఫీస్ లో అబ్బాయి అన్నాడు కదా! ఎందుకు డబ్బులు అనవసరంగా ఖర్చు పెట్టి, హెలికాప్టర్ ఎక్కారు? అన్నాడు. విమానాలు వెళ్ళవు అని చెప్పారు అంటే, అతను ఇది మామూలే. అలాగే హెలి కాప్టర్ వాళ్ళు చెబుతారు. డబ్బుల కోసం అన్నాడు. ఎందుకు ఇదంతా చెబుతున్నానంటే, మోసాలు అలా వుంటాయి. అక్కడ డబ్బు, టైం రెండూ వృథా.

తరువాత మేం హెలికాప్టర్ ఎక్కి, చాలా చాలా ఎంజాయ్ చేస్తూ పోకరా జేరాము. మీరు తిరుగు ప్రయాణం వీడియో కుడా చూడవచ్చు. మేము అందరం పైలెట్ తో సరదాగా ఫోటోలు తీయించుకున్నాం.

(మళ్ళీ వచ్చే నెల కలుద్దాం)

# వేమూరి వేంకటేశ్వరరావు



## ఒక అన్వేషణ

ఈ చరాచర జగత్తుని సృష్టించినది ఎవ్వరు? ఈ సృష్టి ఎప్పుడు మొదలయింది? ఎందుకు జరిగింది? సృష్టికర్త ఎవ్వరు? ఆ సృష్టికర్తనే "దేవుడు" అంటున్నామా? అలాగయితే ఎవ్వరా దేవుడు? ఎక్కడ ఉంటాడు? ఎలా ఉంటాడు? అసలు "దేవుడు" అన్న భావానికి నిర్వచనం ఏమిటి? సృష్టించినవాడా? రక్షించేవాడా? లయ కారకుడా? అన్నీనా?

ఈ రకం ప్రశ్నలు అనాది నుండీ మానవులు అడుగుతూనే ఉన్నారు. వివిధ కాలాలలో, వివిధ సంస్కృతులలో పెరిగిన విద్వాంసులు ఈ ప్రశ్నలని వివిధ దృక్పథాలతో కూలంకషంగా పరిశీలించి అనేకమైన సిద్ధాంతాలని ప్రతిపాదించేరు. వీటిలో ఎవరికి అనుకూలమైన మార్గాన్ని వారు అవలంబించి "బ్రహ్మసత్యం" కనుక్కున్న మహానుభావుల కథలు ఎన్నో మనం వింటూనే ఉంటాం.

అమెరికా సంయుక్త రాష్ట్రాల సంస్థాపకులలో ఒకడు, తరువాత అధ్యక్ష పదవి అలంకరించిన వాడైన థామస్ జెఫర్సన్ ని మహా మేధావులలో ఒకడుగా ప్రెసిడెంట్ కెన్నడీ ఒక సారి కొనియాడేడు. అటువంటి జెఫర్సన్, దేవుడు సృష్టికి కారకుడు తప్ప సృష్టి జరిగిన తరువాత ఈ విశ్వం యొక్క దైనందిన కార్యక్రమాల్లో దేవుని పాత్ర లేదనిన్నీ, సృష్టి జరిగిన తరువాత ప్రకృతి శక్తుల ప్రభావ పరిధిలో ఈ జగత్కార్యం జరుగుతోందనిన్నీ నమ్మేడు.

"దేవుడి మీద మీకు నమ్మకం ఉందా?" అని అయిన్‌స్టయిన్ ని అడిగితే "తాత్త్వికుడు స్పినోజా చెప్పిన దేవుడి లాంటి దేవుడిని అయితే నమ్ముతాను" అని సమాధానం చెప్పేడు. టూకీగా స్పినోజా ఏమన్నాడంటే, "ప్రకృతే దేవుడు. ప్రకృతి అంటే ఏమిటి? మనం మన చుట్టూ చూసే ఈ చరాచర జగత్తే ప్రకృతి. ఈ జగత్తుకి "బయట" ఎక్కడో ఉండి దేవుడు ఈ జగన్నాటకాన్ని తోలుబొమ్మలాటలా ఆడించటం లేదు. ఈ నాటకంలో దేవుడు కూడ ఒక నటుడే."

ఇటీవలి కాలం వాడు, అస్తిత్వ వాది అయిన విశ్వకవి రవీంద్రనాథ టాగూరుకి దేవుడంటే నమ్మకం ఉంది కాని అతని దేవుడు సగటు హైందవ దేవుడు కాడు. విశ్వకవికి దేవుడు ఒక చెలికాడు, మానవ హితాన్ని కోరే ఒక తండ్రి. అదే కాలపు వాడైన మహాత్మ గాంధి సంశయవాది (ఎగ్నాస్టిక్, agnostic); అంటే దేవుడున్నాడో, లేడో ఋజువు చెయ్యలేకపోయినా దేవుడు ఉన్నాడని నమ్మే వ్యక్తి. గాంధి కి "దేవుడు సత్యం" (గాడ్ ఈజ్ ట్రూత్, God is Truth) కాదు; అతనికి "సత్యమే దైవం" (ట్రూత్ ఈజ్ గాడ్, Truth is God). సత్యం ఒక వాస్తవం. అది తిరుగు లేనిది. సత్యానికి దేవుడికి ఉన్న లక్షణాలు ఉన్నాయని జీవితాంతం నమ్మిన వ్యక్తి మహాత్ముడు.

రామకృష్ణ పరమహంస తనకి "దేవుడిని చూపించేడు" అని స్వామీ వివేకానందుడే ఒక చోట చెప్పుకున్నాడు. కనుక మనందరి కండ్లకి కనిపించకపోయినా ఈ జగన్నాటకాన్ని ఆడించటానికి ఒక మహత్తర శక్తి ఏదో ఉండితీరాలని అనిపిస్తుంది.

అనిపించటమేమిటి?

"మయాధ్యక్షేణ ప్రకృతిః సూయతేస చరాచరం, హేతు-

నానేన కౌంతేయ జగద్విపరి-
వర్తతే"

అని అనుమానానికి ఆస్కారం లేని భాషలో అర్జునుడికి కృష్ణుడు చెబుతాడు. ఈ శ్లోకం అర్థం ఏమిటయ్యా అంటే, "ఈ జగద్రచనా వ్యాపారమునకు అధ్యక్షుడను నేనే. నా మాయా శక్తి నా కార్యదర్శి. నన్ను నిమిత్తముగా ఉంచుకొని, ఆమెయే స్థావర జంగమాత్మకమగు ఈ విశ్వమును సృజించి, పోషించి, లయమొందించుచున్నది."

ఇలా సాక్షాత్తు పరమేశ్వరుడే స్వయంగా చెబుతూ ఉంటే ఇంకా ఈ అన్వేషణ ఏమిటని మీలో కొందరు అడగొచ్చు. ఈ అన్వేషణకి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి, విశ్వరూపం చూసే వరకు నారాయణుడి మాటలని నరుడు నమ్మలేదు. అలాంటిది ఏ రూపమూ చూడకుండా, పుస్తకాలలో ఉన్న శ్లోకాలని చదివి మానవమాత్రులమయిన మనం ఎలా నమ్మగలం? రెండు, సృష్టి, స్థితి, లయ, మొదలైన భావాలకి అతీతంగా, పాపం, పుణ్యం, మొదలైన కర్మకాండల ఫలితాలకి అతీతంగా, సృష్టిలో సౌందర్యమే దైవస్వరూపమని నమ్మేవారి దృష్టితో ఇవే ప్రశ్నలకి మరొక కోణం నుండి సమాధానాలు వెతకాలనే ఆకాంక్ష. కనుక ఈ అన్వేషణ ముఖ్యోద్దేశం మోక్ష సాధన కాదు. అపవర్గమనే బ్రహ్మస్థితిని చేరుకోవటం అంతకంటె కాదు. "కారణాలన్నిటికి మూలకారణమయిన ఆదిశక్తిని నేనే!" అనగలిగే ఏకైక మహత్తర శక్తి ఏదయినా ఉంటే దాని ఉనికిని నిర్ణయించటమే ఇక్కడ ధ్యేయం.

## 2. ప్రత్యక్ష దైవం

దేవుడిని సృష్టికారకుడిగా ఊహించుకుంటే మన తల్లిదండ్రులే మన ప్రత్యక్ష దైవాలు. కాని, ఈ ప్రతిపాదనలో కొన్ని చిక్కులు ఉన్నాయి. ఒకటి, తల్లిదండ్రులు సృష్టి, స్థితులకి కారకులు కాగలరు కాని లయకారకులు కాజాలరు. రెండు, పై నిర్వచనం ప్రకారం పిల్లలని కన్నవాళ్లు మాత్రమే దైవత్వానికి అర్హులు. మూడు, పైన చేసిన ప్రతిపాదన ప్రాణులకి మాత్రమే వర్తిస్తుంది. ప్రాణం లేని కొండలని, నదులని, సముద్రాలని ఎవ్వరు సృష్టించారు?

మానవుడి ఉనికికి మూలాధారమైన మాతృమూర్తి ఈ భూదేవి. ఈ భూమే లేకపోతే మనకి కాలుని మోపే స్థావరమే లేదు. నవమాసాలు కాదు, ఈ భూమాత మనని బతికున్నన్నాళ్లూ మోస్తోంది. ఒక్క మోయడమేమిటి? పంటలు పండే అవకాశం కల్పించి పోషిస్తోంది. ఒక్క పోషించటమేమిటి? భూమ్యాకర్షణతో మనందరినీ తన గుండెకి హత్తుకుని, వాతావరణమనే వెచ్చటి పమిట చెంగుతో కప్పి, మనకి హాని కలిగించే కాస్మిక్ కిరణాలు, గామా కిరణాల వంటి వికిరణాల ధాటీ నుండి తప్పించి, రక్షించి, కంటికి రెప్పలా కాపాడుతోంది. ఈ భూదేవే లేకపోతే మన మనుగడకి ఆధారమే లేదు. కనుక ఈ భూలో కవాసులందరికీ ఈ భూమి ప్రత్యక్ష దైవం.

భూమిని మాతృస్థానానికి లేవనెత్తాలంటే మన పితృదేవులెవ్వరో తెలియాలి. భూమి క్షేత్రాన్ని ప్రసాదిస్తున్నది కాని, జీవానికి మూలకారణమైన బీజం సూర్యుడు ఇచ్చే వెలుగు. సూర్యుడు ఇచ్చే వేడి, వెలుగు లేకపోతే ఈ భూమి మీద మొక్కలు మొలవవు, పంటలు పండవు. సూర్యుడు లేకపోతే పోషణ అసంభవం. ఈ భూ, సూర్యుల జంటలో ఏ ఒక్కరు ఉన్నా సరిపోదు. ఇద్దరూ కావాలి. ఈ బాణీలో ఆలోచిస్తే భూమిని తల్లిగాను, సూర్యుడిని తండ్రిగానూ ఊహించుకుని, వీరిరువురిని ప్రత్యక్ష దైవాలుగా గౌరవించవచ్చు.

## 3. ఆదిమధ్యాంతరాహిత్యం

భగవంతుడు ఆదిమధ్యాంత రహితుడు అంటారు. క్షేత్రమాపక (జియొమెట్రికల్, geometrical) దృష్టితో చూస్తే గోళాకారంలో ఉన్న భూ, సూర్యులిద్దరూ ఆదిమధ్యాంతరహితులే. కాని కాలమాపక (టెంపొరల్, temporal) దృష్టితో చూస్తే మాత్రం ఈ గమనిక నిజం కాదు. ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం ఈ భూమితో పాటు సూర్య కుటుంబం ఉరమ-

రగా 5 బిలియను సంవత్సరాల కిందటే పుట్టింది. మనందరికి మల్లే ఈ సౌర కుటుంబానికి కూడ బాల్య, కౌమార, వార్ధక్య దశలు, తదుపరి మరణము తథ్యం. జనన మరణాలు ఉన్న ఈ భూ, సూర్యులు దేవుళ్లు ఎలా అవుతారు?

అంతే కాదు. ఈ భూ, సూర్యులిరువురికీ దైవత్వం అంటకట్టటానికి మరొక అడ్డంకి ఉంది. భూ, సూర్యులు ఈ భూ గ్రహం మీద ఉన్న వాళ్లకే మాతా పితలు. మన పాలపుంతలోనే 200 బిలియను పైబడి నక్షత్రాలు ఉన్నాయని ఒక అంచనా ఉంది. ఈ విశ్వంలో మన పాలపుంత వంటి క్షీరసాగరాలు 150 బిలియన్లు ఉన్నాయని ఒక అంచనా ఉంది. కనుక ఈ విశ్వంలో 60 ట్రిలియన్లు పైబడే ఉన్నాయి నక్షత్రాలు. వీటిలో కనీసం పదింట ఒక నక్షత్రానికైనా గ్రహ కుటుంబం ఉందనుకుంటే ఈ విశ్వంలో 6 ట్రిలియన్లు గ్రహాలు, మన పాలపుంతలో 40 బిలియను గ్రహాలు ఉండొచ్చు అంటున్నారు. (ఇటువంటి గ్రహాలు 2000 పైబడి కెప్లర్ టెలిస్కోపులో 2017 నాటికే కనబడ్డాయని ఋజువయింది). వీటిలో కొన్నింటి మీదనైనా ప్రాణం వెల్లివిరిసి ఉండొచ్చు. ఆయా ప్రాణుల తల్లిదండ్రులు వేరు కదా.

పోనీ భూమ్యేతర గ్రహాల మీద ప్రాణి లేదనుకుందాం. కనీసం ఆయా నక్షత్రాలని, వాటితోపాటు ఉండే గ్రహాలని ఎవ్వరో ఒకరు సృష్టించాలి కదా. ఈ సృష్టిని జరిపినది ఎవ్వరు? ఈ నభోమూర్తులన్నిటిని వాటి వాటి గతులు తప్పకుండా పరిభ్రమింపజేసేది ఎవ్వరు? విశ్వవ్యాప్తమూ, ఆదిమధ్యాంతరహితమూ అయిన ఈ అద్భుత శక్తి ఏమిటి? ఇలాంటి ప్రశ్నలు పుంఖానుపుంఖంగా పుట్టుకురాగా కాబోలు, మందార మకరందాలు చిందిస్తూ, "ఎవ్వనిచే జనించు, జగమెవ్వని లోపల నుండు..." అనే పద్యం రాసి మనకిచ్చేరు, పోతనామాత్యులు. భాగవతపురాణంలో భక్తులకి భక్తి మార్గం ఉంది, వైజ్ఞానిక పరిశోధకులకి విశ్వసత్యం ఉంది.

### 4. గురుత్వాకర్షణ

సూర్య, చంద్ర, గ్రహ, నక్షత్రాదుల పుట్టుకకి కారణభూతమైనదీ, ఈ నభోమూర్తులన్నిటిని గతులు తప్పకుండా వేటి పరిధులలో వాటిని ఉంచగలిగేది, వాటి వాటి కాలాలు తీరిన తరువాత వాటిని తనలో ఐక్యం చేసికొని, మళ్లా సరికొత్త నక్షత్రాదుల జన్మకి కారణభూతం కాగలిగినదీ అయిన శక్తి ఒకటి ఉంది. దానిని గురుత్వాకర్షణ అంటారు. దీనికే నూటన్ "గ్రేవిటీ" అని పేరు పెట్టేడు. ఈ గురుత్వాకర్షణ అదృశ్యమానం, విశ్వవ్యాప్తం, ఆదిమధ్యాంతరహితం.

ఈ గురుత్వాకర్షణ లేకపోతే సూర్యుడు, అతని సంతానం జన్మించి ఉండేవేకాదు. ఈ గురుత్వాకర్షణ ప్రభావం వల్ల కొన్ని కొన్ని సందర్భాలలో కొన్ని తారలు నీలరంధ్రాలు (black holes) గా మారే సావకాశం కూడ ఉంది. అప్పుడు ఆ పరిసరప్రాంతాలలో ఉన్న పదార్థం అంతా ఆ నీలరంధ్రంలో పడిపోతుంది. అదే "లయ" ప్రక్రియ అని కొందరు సిద్ధాంతీకరిస్తున్నారు.

అంటే సృష్టి, స్థితి, లయ కారకురాలయిన ఈ గురుత్వాకర్షణ (gravity) సర్వకాల సర్వావస్థలయందు ఈ విశ్వానికి రూపు రేఖలు దిద్దుతోంది. కనుక దైవత్వానికి ఇది అభ్యర్థే. ఈ గురుత్వాకర్షణ కంటికి కనిపించదు. గణితం లేకుండా వర్ణించి చెప్పటం కొంచెం కష్టమే. అయినా దీని గురించి కొంచెమయినా తెలుసుకుంటే కాని విశ్వరహస్యం బోధపడదు.

ఈ విశ్వంలో ఏ రెండు వస్తువులని తీసుకున్నా వాటి మధ్య ఒక రకం ఆకర్షణ (attraction) ఉంటుందని నూటన్ ఉద్ఘాటించేడు. పండిన పండు చెట్టుని వదలి వినువీధిలోకి రివ్వున ఎగిరి పోకుండా భూమి మీద పడటానికి కారణం పండుకీ, భూమికీ మధ్య ఉన్న పరస్పరమైన ఆకర్షణే.

ఇదే విధమైన ఆకర్షణ భూమికి, చంద్రుడికి మధ్య ఉండటం వల్లనే చంద్రుడు భూమి చుట్టూ తిరుగుతున్నాడు.

(మిగిలినది వచ్చే సంచికలో)

# ఇంద్రగంటి వేంకట సుబ్బారావు



# ప్రేమంటే ఇంతే

(గత సంచిక తరువాయి)

పనులన్నీ సమీక్ష చేసుకున్నాక బంగారం షాప్ నుండి వస్తువులు ఇంకా తీసుకురావాలని అర్థమయ్యింది. ఆ వస్తువులు తీసుకు రావటానికి కృష్ణమోహన్, రుక్మిణి బయలుదేరి వెళ్ళారు. బంగారం షాప్లో పని ముగించుకొని తిరిగి బయలుదేరేటప్పటికి మధ్యాహ్నం ఒంటిగంట దాటింది. స్టీరియోలో కిషోర్కుమార్ పాట 'మేరె సపునోంకి రాణి కబ్ ఆయే గితొ" వింటూ, ఆ పాటని తను కూడా హుషారుగా పాడుతూ కారు నడుపుతున్నాడు కృష్ణమో హన్.

"హలో సార్! మీ కలల రాణి మీ ప్రక్కనే వుంది, ఇంకే రాణి రాదు, వచ్చినా నేనూరుకోను. ఇంకా కుర్రాడిననుకొంటున్నారా! రేపో, మాపో మీకూ అల్లుడు వస్తాడు, కొంచెం హుషారు తగ్గించి జాగ్రత్తగా నడపండి" అంది రుక్మిణి.

"అల్లుడొచ్చినా, మనుమడొచ్చినా, ఐ యాం ఆల్వేజ్ యంగ్ ఎట్ హార్ట్ ఎండ్ ఎవర్గ్రీన్ లైక్ ఏ.ఎన్. ఆర్."

"చాల్లెండి సంబరం"

పెళ్ళివారి ఇంటికి చేరగానే రుక్మిణి కారు దిగి, వస్తువులు తీసుకొని ఇంట్లోకి వెళ్ళింది.

కారు పార్క్ చేసి, లాక్ చేసి, వాక్మేన్ ఆన్ చేసి అందులోంచి వినిపిస్తున్న "కలలోనైన కలగన లేదే నువ్వువస్తావని, మెలకువలోనైన అనుకోలేదే నువ్వువస్తావని" ...పాట వింటూ ఇంట్లోకి వస్తున్నాడు కృష్ణమోహన్.

వైదేహి గుమ్మం దగ్గరే ఆపి "ఒరేయ్ ముందు మేడమీదకి వెళ్ళి భోజనం చెయ్యి, రుక్మిణిని కూడా మేడమీదకు పంపాను, మీ బావగారూ, చంద్రం అందరూ నీ కోసం ఎదురు చూస్తున్నారు" అంది.

"అక్కా నువ్వు తిన్నావా, రుక్కూ ఆ బంగారం వస్తువులు జాగ్రత్తగా దాచిందా?"

"వస్తువులు నాకిచ్చింది, నేను బీరువాలో దాచాను. నేనింకా తిన లేదు, ఐదు నిమషాలలో వస్తాను మీరు మొదలుపెట్టే లోపల నేను కలుస్తాను పద"

అలాగేనని తల ఊపి వాక్మేన్ మళ్ళీ ఆన్ చేసి "ఆ దేముడు కరుణించి.....ఈ దేవత కనిపించి..... ఆనందం కలిగించి....ఈ బంధం కదిలొచ్చి.....ప్రేమ పైన నమ్మకాన్నినాలో పెంచుతున్నది...నను కమ్మనైన అమృతాల నదిలో ముంచుతున్నది" అనే చరణం చాలా లీనమై వింటూ మొదటి వరస మెట్లు ఎక్కి మలుపు తిరిగి రెండో వరస మెట్లు ఎక్కడం మొదలుపెట్టిన కృష్ణమోహన్కి ఎదురుగా ఎవరో మెట్లు దిగుతున్నారని గమనించి తల ఎత్తి చూసాడు.......

ఎదురుగా కనబడిన వ్యక్తిని చూసి ఒక్కసారి ఉలిక్కిపడి, షాక్ తిన్న వాడిలాగ నిశ్చేష్టుడై వుండి పోయాడు కృష్ణమోహన్...ఆ వ్యక్తిని చూసి ఆనందం, భయం, ఆందోళన, ఆశ్చర్యం, ఆవేదన, సంతోషం ఇలా వివిధ రకాల భావాలు కలిగాయి...అవతల వ్యక్తి కూడా ఇదే రకమైన పరిస్థితిలో వున్నాది. కొద్ది సేపు మాటా మంతీ లేకుండా వాళ్ళిద్దరూ ఒకరినొకరు చూస్తూ అలాగే వుండిపోయారు.

కృష్ణమోహన్ ఆ వ్యక్తిని చూస్తున్నపుడు, ఆమె నుదిటిమీద స్టికర్ని (బొట్టు) గమనించి మనసులో "హమ్మయ్య" అనుకున్నాడు... ఎందుకంటే ఆమె నుదిటి మీద బొట్టు లేకుండా ఆమెని ఎక్కడ చూడాలో అని గత పదహారు

సంవత్సరాల బట్టి చూడటానికి వెళ్ళలేదు.

ముందుగా కృష్ణమోహన్ తేరుకొని "బాగున్నావా రాధా" అని అడిగాడు.

"పరవాలేదే, ఇంకా గుర్తున్నానన్న మాట, మెనీ మెనీ థ్యాంక్స్ కృష్ణా ఇంకా గుర్తుంచుకున్నందుకు" చిలిపిగా అంది అనూరాధ.

'కృష్ణా' ఆ పిలుపు వినగానే కృష్ణమోహన్కి తన హృదయవీణలోని చాలా రోజులనుండి ముట్టుకోని ఒక తీగని మీటినట్లనిపించింది. ఎందుకంటే "కృష్ణా" అని తన కన్నతల్లి, అనూరాధ ఈ ఇద్దరే సంభోదిస్తారు. మిగతా వాళ్ళందరూ ఎంత సన్నిహితులు అయినా "మోహన్" అని పిలుస్తారు.

అనూరాధ లావణ్య పెళ్ళికి వస్తుందని కృష్ణమోహన్ ముందుగా ఊహించకపోవటంతో, ఆమెని చూసేసరికి ఎలా స్పందించాలో, ఏమిటి మాట్లాడాలో అర్థం కాక ఒక రకమైన అయోమయ స్థితిలో వున్నాడు. ఏదో ఒకటి మాట్లాడాలి అని "ఎప్పుడు వచ్చావు రాధా" అని అడిగాడు.

"ఇవాళ ఉదయం గోదావరిలో వచ్చాను బావా"

"నేను ఉదయం పది గంటల దాకా ఇక్కడే వున్నాను, బండి ఆలస్యంగా వచ్చిందా"

"లేదు, మా పెద్దన్నయ్య ఇక్కడే వున్నాడు, తను రిసీవ్ చేసుకున్నాడు, వాళ్ళింటికి వెళ్ళి వచ్చాము. ఇంతకీ మా పెద్దన్నయ్య గుర్తున్నాడా?" మళ్ళీ ఇరకాటంలో పెట్టిం పెట్టింది అనూరాధ.

"ఎందుకు గుర్తు లేడు, మొన్ననే నాలుగురోజుల క్రిందట కలిసాం"

"థ్యాంక్స్ బావా తనైనా గుర్తున్నాడు" మళ్ళీ చిలిపిగా సమాధానం ఇచ్చింది అనూరాధ. సమాధానం చిలిపిగా వున్నప్పటికీ, ఆ మాటల వెనుక వున్న భావాన్ని...అంటే ఈ 23 సంవత్సరాలలో ఒక్కసారి కూడా నేను నీకు గుర్తు రాలేదాఅని సూటిగా అడిగినట్లు అనిపించింది కృష్ణమోహన్కి.

"రాధా ఎందుకు నన్నిలా నీ మాటలతో కుమ్మ కడతావు, అప్పటికి, ఇప్పటికి నీలో ఆ చిలిపితనం తగ్గలేదు"

"ఎన్ని వుంటే ఏమిటి బావా, అయిదోతనం లేదుగా" అంటూ తన్నుకొస్తున్న దుఃఖాన్ని ఆపుకోవటానికి ప్రయత్నించింది అనూరాధ. ఆమె కనులలో నీరు కిందికి జారుతూ కనబడేసరికి, కృష్ణమోహన్ తనని తాను నియంత్రించుకోలేక తను కూడా బాధ పడటం మొదలు పెట్టాడు.

ఏడుస్తున్న అనూరాధని చూసి దగ్గరకి తీసుకొని ఓదార్చాలనిపించింది కృష్ణమోహన్కి...

కానీ ఇప్పుడు ఆమె పరస్త్రీ. మనసులో కల్మషం లేకుండా సాటి మనిషిగా సానుభూతి చూపించి, ఓదార్చడానికి అయినా పరస్త్రీని తాకితే ఈ సంఘం హర్షించదు. ఒక ఆడా, మగా కలుసుకున్నా, మాట్లాడుకున్నా, కబుర్లు చెప్పుకున్నా ఈ సంఘం ఒక కోణంలో నుంచే చూస్తుంది, ఈ సంఘం ఆలోచనా దృష్టిలో మార్పు రావడం అసంభవం...ఇలా ఆలోచిస్తూ ఏం చేయాలో, అనూరాధని ఎలా ఓదార్చాలో అర్థంకాక విపరీతమైన మానసిక సంఘర్షణకి లోనవుతున్నాడు. అలాగని ఆత్మీయురాలు బాధ పడుతూ వుంటే చేతులు ముడుచుకుని చూస్తూ వూరుకోలేక పోతున్నాడు.

అవతల అనూరాధ మనసులో అనుకుంటున్నాది...ఇన్నాళ్ళూ తనవాళ్ళు తనని ఎన్ని రకాలుగా ఓదార్చినా, సానుభూతి చూపినా తనకి సాంత్వన లభించలేదు. తను ఎవరి దగ్గర నుండిఓదార్పు సానుభూతి కోరుకుంటున్నదో ఆ వ్యక్తి ఇన్నాళ్ళకి తన ఎదుట వున్నాడు...కృష్ణమోహన్ గుండెల మీద తల పెట్టుకొని తన బాధని చెప్పుకొని సేద తీరాలని అనిపిస్తున్నాది. కానీ అతను ఇప్పుడు పరాయి పురుషుడు అందుకని అది జరిగే పని కాదు కనుక, కనీసం తన బాధనైనా అతనితో పంచుకొని సేద తీరాలనిపించింది అనూరాధకి...

వాళ్ళిద్దరూ కాస్సేపు అలా మౌన రోదన చేసిన తరువాత అనూరాధ ఏడుపుని, బాధని ఇంక చూడ లేక, అనూరాధ చేతిని తన చేతిలోకి తీసుకొని ఓదారుస్తూ "రాధా ఏడవకు, నువ్వు ఏడిస్తే నేను చూడలేను, తట్టుకోలేను. దయచేసి కంట్రోల్ చేసుకో..." అని కృష్ణమోహన్ ఇంకా ఏదో చెప్పబోతూ వుండగా వెనక నుండి వైదేహి గొంతు వినబడింది. వైదేహి గొంతు విని కృష్ణమోహన్, అనూరాధ ఇద్దరూ కళ్ళు తుడుచుకొని మామూలుగా వుండటానికి ప్రయత్నించారు.

"ఏరా, నువ్వు ఇంకా మేడమీదకి వెళ్ళలేదా?" అని అడుగుతున్న

వైదేహికి వీళ్ళిద్దరూ ఒకరినొకరు చూస్తూ నిలబడటం గమనించి..."మా ఆడపడుచు అనూరాధ రా గుర్తు పట్టావా?" అని అడిగింది వైదేహి.
"ఆ ! ఆ! గుర్తుపట్టాను, అదే నేను పలకరించాను, ఈ లోపల నువ్వు వచ్చావు" తడబడుతూ చెప్పాడు కృష్ణమోహన్.
"ఏవమ్మా అనూ, నువ్వు భోజనం చేసావా?" అని అడిగింది వైదేహి.
"లేదు వదినా, నిన్ను పిలుచుకువద్దామనే నేను వస్తున్నాను, ఈ లోపల కృష్ణ ఎదురయ్యాడు" అనూరాధ కూడా తడబడుతూ చెప్పింది.
"సరే పదండి, భోజనం చేద్దాము"
ఆ ఇద్దరి తడబాటుని వైదేహి గమనించింది. చాలా సంవత్సరాల తరువాత వీళ్ళిద్దరూ కలుసుకుంటున్నారు, వీళ్ళు ఎలా స్పందిస్తారో అని అంతవరకూ కాస్త కంగారు పడిన వైదేహికి వాళ్ళిద్దరూ పలకరించుకొని మాట్లాడుకోవడంతో కాస్త ఊరట కలిగింది.
మేడ మీదకి వెళ్ళగానే వైదేహి అనూరాధని 'మా ఆడపడుచు, మా పిన్నత్తగారి అమ్మాయి' అని రుక్మిణికి పరిచయం చేసి అనూరాధ కుటుంబ సభ్యులని పరిచయం చేసింది. కృష్ణమోహన్ని అందరూ పలకరించి కుశల ప్రశ్నలు వేసారు. అందరినీ పలకరించి సమాధానం చెబుతున్నాడు గానీ ఆ అయోమయ పరిస్థితి నుండి ఇంకా తేరుకోలేదు. ఈ పరిచయ కార్యక్రమం జరుగుతున్నపుడు, ఎవరు ఎలా స్పందిస్తారా అని వైదేహికి చాలా ఆందోళనతో వుంది. అయితే అందరూ మర్యాద పూర్వకంగా పలకరించుకోవటంతో వైదేహికి కొండంత బరువు దిగినట్లు అనిపించింది.
ఇదంతా తన కనుల ముందరే జరుగుతున్నా కృష్ణమోహన్ ఏమీ పట్టించుకోవడం లేదు, ఏదో ఆలోచిస్తున్నాడు, ఏదో లోకంలో వున్నాడు. అన్నం కెలుకుతున్నాడుగాని తినడం లేదు, నోట్లో ముద్ద పెట్టుకున్నాడుగాని దిగడంలేదు, ముద్ద ముద్దకీ నీళ్ళు తాగుతున్నాడు. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ వుండే ఈయన ఇలా వున్నరేమిటా? అని రుక్మిణి ఆలోచిస్తున్నాది. కృష్ణమోహన్ పరిస్థితి గమనించిన అనూరాధ అతను తన గురించే ఆలోచిస్తున్నాడని అర్థం చేసుకుంది, అనవసరంగా కృష్ణని తన మాటలతో నొప్పించానేమో అని బాధ పడింది.
వైదేహికి విషయం అర్థం అయింది కానీ, ఆ పరిస్థితిని ఎలా అధిగమించాలా అని ఆలోచిస్తున్నాది. చంద్రానికి విషయం అర్థం కాకపోయినా, అన్నగారు దేనిగురించో కలత చెందినట్లు గ్రహించి అతని దృష్టి మరలించాలని "ఒరేయి మోహన్, భోజనం చేసి కాస్సేపు విశ్రాంతి తీసుకో, మనం నాలుగు గంటలకి బిల్డర్ని కలవాలి" అన్నాడు...కానీ కృష్ణమోహన్లో ఏ విధమైన మార్పు రాలేదు.
ఈ పాటికి రుక్మిణికి విషయం అర్థమయి..."ఏమండీ, ప్రొద్దున్న వంట్లో సరిగా లేదన్నారు, ఇంకా సర్దుకోలేదా? పోనీలెండి హితవుగా లేకపోతే వదిలేయండి! పళ్ళు తిందురుగాని" అంది. నిజంగా తనకు బాగానే వున్నా, సమయస్ఫూర్తితో ఆ ఇబ్బందికర పరిస్థితి నుండి విముక్తి కలిగించినందుకు మనసులోనే ధన్యవాదాలు చెప్పుకొని..."ఆ ఇంకా సర్దుకోలేదు" అంటూ విస్తరి దగ్గరనుండి లేచాడు కృష్ణమోహన్. రుక్మిణి కూడా తొందరగా భోజనం పూర్తి చేసి అతని వెనకాలే వెళ్ళింది.
ఆ దంపతులిద్దరూ అలా అర్థాకలితో లేవటానికి తనే కారణమైనందుకు అనూరాధ చాలా బాధ పడింది. వెంటనే మజ్జిగ కలుపుకొని భోజనం ముగించింది. ప్రక్కనే కూర్చున్న వైదేహి ఇది గమనించి "అదేమిటి అనూ! అప్పుడే మజ్జిగ పోసుకున్నావు?" అని అడిగింది.
"వదినా, నీకు అన్నీ తెలుసు! దయచేసి నన్ను ఇబ్బంది పెట్టకు" అని ఇంకెవరికీ వినపడనంత మెల్లిగా అంది.
ఆ మాటలు విన్న వైదేహికి, ప్రక్కన కూర్చున్న సత్యనారాయణకి అనూరాధ కృష్ణమోహన్ చాలా సంవత్సరాల తరువాత కలవటం వల్ల వాళ్ళ గతం తలచుకొని బాధ పడుతున్నారన్న విషయం అర్థం

అయింది.
కృష్ణమోహన్ గదిలో కూర్చుని తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. రుక్మిణి కాఫీ తీసుకొచ్చి అతనికిచ్చి "ఏమండీ! ఏమిటయింది, ఎందుకు అలా వున్నారు?" అని అడిగింది.
"ఏమీ లేదు రుక్కూ"
"సరేలెండి! నాకు చెప్పటం యిష్టం లేకపోతే మానేయండి ఒక స్నేహితురాలిగా అడుగుతున్నాను చెప్పండి, అనూరాధని చూసి మీరు కలత చెందుతున్నారు కదూ?"
"అవును రుక్కూ, నీకు రాధ గురించి అంతా తెలుసు. చాలా కాలం తరువాత అనుకోకుండా ఇలా కలుసుకోవటం వల్ల, ఒక విచిత్రమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నాను. ఏం మాట్లాడాలో, ఎలా మాట్లాడాలో అర్థం కావటం లేదు" అని మెట్లదగ్గర తనకీ అనూరాధకీ మధ్య జరిగిన సంభాషణ గురించి చెప్పాడు కృష్ణమోహన్. అనూరాధ మాటలవెనక భావాన్ని వివరించాడు..."రాధ జీవితం గురించి తలచుకుంటే నాకు దుఃఖము, బాధ కలుగుతున్నాయి రుక్కూ, అందుకే కలత చెందాను" అని గద్గద స్వరంతో చెబుతూ, కళ్ళ వెంబడి కారుతున్న కన్నీటిని దాచటానికి అటుప్రక్కకి తిరిగాడు.
"ఏమిటండీ ఇది? ఎంతో మందికి ఎన్నో సందర్భాలలో ధైర్యం చెప్పి ఓదార్చిన మీలో ఈ బేలతనం ఏమిటి?" అంటూ అతనిని తన ప్రక్కకి తిప్పుకొని పైట చెంగుతో కన్నీరు తుడిచింది రుక్మిణి.
"ఎదుటి మనిషికి ధైర్యం చెప్పటం సుళువే రుక్కూ! కానీ పరిస్థితిని ఎదుర్కోవటం చాలా కష్టం"
"సరేగాని మీ ఉద్వేగాన్ని నియంత్రించండి, నిజమే ఆవిడకి చాలా అన్యాయం జరిగింది. మీరు ఇలా అదోలా వుండడం వలన ఈ పాటికి అనూరాధకి విషయం అర్థం అయివుంటుంది. చాలాకాలం తరువాత మీరు కనిపించి, ఇలా బాధ పడటం చూసి, తను కూడా గతాన్ని తలచుకుని కుమిలిపోతుంది, దాని వల్ల మీరు ఆవిడని బాధ పెట్టిన వారు అవుతారు. మగవారు మీరే ఇలా వుంటే, ఆవిడ పరిస్థితి ఎలా వుంటుందో ఆలోచించండి, అర్థం చేసుకోండి" అని రుక్మిణి ఓదార్చింది.
మేడమీద భోజనం ముగించి క్రిందకి వచ్చిన అనూరాధ పరిస్థితి కూడా అలాగే వుంది. ఒక గదిలోకి వెళ్ళి తలగడ నేల మీద వేసుకొని పడుకొని ఆలోచిస్తున్నాది. అనవసరంగా ఈ పెళ్ళికి వచ్చి, సాఫీగా సాగుతున్న కృష్ణ జీవితంలో అలజడి సృష్టిస్తున్నానేమో అని బాధ పడుతున్నాది. భోజనం చేసి అనూరాధ గదిలోకి వచ్చిన వైదేహికి అనూరాధ పడుకోలేదని, బాధ పడుతున్నాది అని గ్రహించి దగ్గరికి వచ్చి అనూరాధ తలని తన వొడిలోకి తీసుకొని తల నిమురుతూ..."అనూ ఎందుకు బాధ పడుతున్నావు? గతం గుర్తుకొచ్చిందా?" అని అడిగింది.
"ఈ పెళ్ళికి రాకుండా వుండవలసింది వదినా, కృష్ణకి గతం గుర్తు చేసినట్లయింది. గత 23 సంవత్సరాలలో ఎక్కడా కలవక పోయినా, నీ ద్వారా తన సంగతులు తెలుస్తూ వుండేవి, క్షేమంగా, సుఖంగా వున్నారని తెలిసి ఎంతో హాయి అనిపించేది, కానీ ఇవాళ ఇలా కలిసి గతం తలచుకుని బాధ పడుతున్నాము"
"లేదమ్మా! వాడు గతాన్ని ఎప్పుడో మరచిపోయాడు. ఈ 23 సంవత్సరాలలో వాడెప్పుడూ నీ విషయం నా దగ్గర ప్రస్తావించ లేదు" అని ఓదార్చడానికి ప్రయత్నించింది వైదేహి.
"నా విషయం నీ దగ్గర ప్రస్తావించనంత మాత్రాన కృష్ణ గతాన్ని మరచిపోయాడంటావా వదినా? లేదు వదినా లేదు, నువ్వే చాలా సార్లు నా గురించి అడిగాడని చెప్పావు, నిజంగా తను గతం మరచిపోయి వుంటే నన్ను పలకరించేవాడు కాదు. కృష్ణది చాలా లోతు గుండె, బయటికి తేలడు, బాధని తనలోనే దాచుకుంటాడు, ఎవరితోనూ పంచుకోడు నాకు తెలుసు వదినా, కృష్ణ నా గురించే ఆలోచించి బాధ పడుతున్నాడు" నిజానికి కృష్ణమోహన్ ఎప్పుడూ అనూరాధ గురించి వైదేహితో మాట్లాడకపోయినా, అనూరాధ వైదేహిలు కలిసినప్పుడల్లా కృష్ణమోహన్ క్షేమ సమాచారాలు అనూరాధ అడుగూతూ వుంటే మొహమాటానికి మోహన్ కూడా నీ క్షేమ సమాచారాలు అడుగూతూ వుంటాడని వైదేహి చెబుతూ వుండేది.

**(ఇంకా వుంది)**

# పాలెపు బుచ్చిరాజు



# ముల్లా నస్రుద్దీన్ కథలు - 11

## ముల్లాగారి కోటు

ఆ రోజుల్లో గ్రామంలో ఏ తగువులు, దెబ్బలాటలు వచ్చినా, ఎవరి మధ్య వివాదం వచ్చినా తీర్చడానికి నస్రుద్దీన్ రావలసిందే! ఆయన అయితేనే అందరికీ నచ్చేలా న్యాయం చేస్తాడని, ఎవరినీ నష్ట పెట్టడని గ్రామస్తులందరికీ విశ్వాసం ఉండేది.

ఒకసారి ఆ గ్రామంలో ఇద్దరు దుకాణాదారుల మధ్య తగువు వచ్చింది. ఒకరి గిరాకీని మరొకరు చాడీలు చెప్పి లాగేస్తున్నారని ఒకరి మీద మరొకరు ఆరోపించుకుని దెబ్బలాడుకో సాగారు. ఆ వివాదం పెరిగి పెద్దదై నడిబజారులో ఒకరినొకరు కొట్టుకోవడం వరకు వచ్చింది. ఆ ఖరికి పెద్దలు చెప్పిన మాట విని, నస్రుద్దీన్ చెప్పినట్టు నడుచుకోవడానికి వారు ఒప్పుకున్నారు. ఆ నాడు గ్రామంలో పెద్ద సంత జరుగుతోంది. తగువు ఎలా తీరుతుందో చూడాలని ప్రజలు గుంపులుగుంపులుగా వచ్చి చేరారు. అందరూ రచ్చబండ దగ్గర చేరాక నస్రుద్దీన్ కి కబురు వెళ్ళింది. ఆ ప్రాంతంలో పరువు ప్రతిష్టలు, గౌరవం ఉన్న మనిషి నస్రుద్దీన్. అందువల్ల తన హోదాకి తగినట్టుగా చక్కని చమ్కీ పొదిగిన ఖరీదైన కోటు మేకుని హుందాగా బజారుకి వెళ్ళాడు నస్రుద్దీన్.

ఆయన రాగానే అందరూ ప్రక్కకి జరిగి ఆయనకి కూర్చోవడానికి



చోటు ఇచ్చారు. ఆయన తాపీగా కూర్చుని, తను వేసుకున్న కోటు విప్పి ప్రక్కన పెట్టి, దుకాణాదారుల ఫిర్యాదులు వినసాగాడు. కొంతసేపటికి వరకూ వాదోపవాదాలు సాగాయి. అందరూ అది వింటూ, మైమరచి ఉన్న సమయంలో అక్కడ చేరిన పగటి దొంగ ఒకడు, ముల్లాగారి ఖరీదైన కోటు చంకన పెట్టుకుని, ఎవరికీ తెలియకుండా ఉడాయించాడు.

తగవు పూర్తి అయి తీర్పు చెప్పి, ముల్లాగారు ఇంటికి వెళ్ళడానికి లేచి నుంచున్నారు. కోటు కోసం ప్రక్కన చూశారు. ఇంకేముంది? కోటు గల్లంతు. నస్రుకి చాలా కోపం వచ్చింది. తను కష్టపడి సంపాదించిన డబ్బుతో ఖరీదైన కోటు కుట్టించుకుంటే, దానిని ఎవరో ఎత్తుకు పోయారు. అక్కడి నుంచి అందరూ వెళ్ళిపోయే లోపలే నస్రు అందరికీ విన పడేలా ఇలా అరిచాడు. “ఎవరో నా కోటు దొంగతనం చేశారు. దానిని మర్యాదగా తిరిగి ఇచ్చేస్తారా సరే! లేకపోతే చూసుకోండి ఏం చేస్తానో!” అలా అంటున్నప్పుడు ఆయన కోపం చూసి అక్కడ చేరిన ప్రజలు హడిలిపోయారు. “ఎవడో పనికిమాలిన వెధవ పట్టుకుని పారిపోయి ఉంటాడు. పాపం ముల్లా గారు!” అని పెదవులు విరుస్తూ ఎవరి దారిన వారు వెళ్ళిపోయారు. అయినా ముల్లా శాంతించ లేదు. ఇంటికి వెళ్తూ దారిలో కనిపించిన వారందరితోనూ, అరుగుల మీద కూర్చున్నవారితోను, 'తెల్లారే సరికల్లా నా కోటు నా ఇంటికి చేరితే సరే! లేకపోతే చూడండి ఏం చేస్తానో!'

(20 వ పేజీ చూడండి)

# పోడూరి శ్రీనివాసరావు



## కళాప్రపూర్ణ డా. వింజమూరి అనసూయాదేవి

ప్రఖ్యాత జానపద కళాకారిణి, వాగ్గేయకారి, సంగీతదర్శకురాలు, రచయిత్రి శ్రీమతి వింజమూరి (అవసరాల) అనసూయాదేవి. ఈమె సంగీత కళాకారుల, సాహిత్య కళాకారుల వంశంలో జన్మించింది. ప్రముఖ భావకవి, ఆంధ్రా షెల్లీగా పేరొందిన శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారికి స్వయానా మేనకోడలు. బహుళ ప్రాచుర్యం పొందిన శ్రీ దేవులపల్లి వారి 'జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి' పాటకు బాణీ కట్టింది శ్రీమతి వింజమూరి అనసూయే - అంటే ఆమె ప్రతిభ ఎంతో తెలుస్తుంది. హార్మోనియం వాయించడంలో ఈమె గొప్ప ప్రతిభావంతురాలు.

1920 మే 12 వ తేదీన శ్రీ వింజమూరి వెంకట లక్ష్మీ నరసింహారావు, వేంకటరత్నమ్మ దంపతులకు అనసూయ కాకినాడలో జన్మించింది. వారి తండ్రి గారైన శ్రీ నరసింహారావు గారు గొప్ప కవి. తల్లి వేంకటరత్నమ్మగారు 1914 లోనే అనసూయ అనే పత్రికకు సంపాదకత్వం వహించారు.

అనసూయగారి సోదరి వింజమూరి సీతగారు కూడా



గొప్ప జానపద, లలితా సంగీత కళాకారిణి. వీరి బాల్యం అంటా కాకినాడ లోనూ, పిఠాపురం లోనూ జరిగింది. అనసూయ, సీత గార్లు కర్నాటక సంగీతం శ్రీ మునుగంటి వెంకట్రావు గారి దగ్గర నేర్చుకున్నారు.

అనసూయగారు బాలమేధావి. ఆమె ఎనిమిదేళ్ళ వయసులోనే, వారి పాట రికార్డయింది.

స్వాతంత్ర్యోద్యమ సమయంలో మహామహులైన గాంధీజీ, సుభాస్ చంద్ర బోస్, జవహర్లాల్ నెహ్రూ, సర్వేపల్లి రాధాకృష్ణన్ లాంటి ప్రముఖుల సమక్షంలో దేశభక్తి గీతాలు పాడిన అనుభవం, శ్రీమతి అనసూయ గారికి ఉంది.

శ్రీమతి అనసూయగారు వ్రాసిన భావగీతాలు, జానపద గేయాలు అనే రెండు పుస్తకాలు, ఆమెకు 90 సంవత్సరాలు

నిండిన సందర్భంలో చెన్నైలో ఏప్రిల్ 12 , 2008 న జరిగిన ఒక కార్యక్రమంలో విడుదల చేసారు. వీటితోబాటు జానపద సంగీతంపై ఏడు పుస్తకాలను కూడా ఈ సందర్భంగా విడుదల చేయడం జరిగింది.

ప్రముఖ జర్నలిస్ట్, సంగీతకారుడు శ్రీ మల్లాది సూరిబాబుగారి మాటల్లో - శ్రీమతి వింజమూరి అనసూయగారు - జానపద బృందావనిలో విరిసిన సిరిమల్లె.

వీరి 'కొయ్యోడో..ఓరయ్యో కొయ్యోడా' అనే జానపద గేయం, సినీమాయా ప్రపంచం ప్రాచుర్యంలోకి రాని రోజుల్లోనే, అమిత ప్రజాదరణ పొందింది. ఈ పాట వింటుంటే, అప్రయత్నంగా చేత్తో తాళం వేసేస్తారు. ఆనందం అవధులు దాటుతుంది. ఈ పాట విని, ఆ కాలపు జనాలు ఉర్రూతలూగిపోయేవారు. జాన పద గీతాలు ప్రాచుర్యంలోకి రావ డానికి, శ్రీమతి వింజమూరి సీత, అనసూయల కృషి ఎంతైనా ఉంది. వీరిరువురూ పుట్టింది కాకినాడైనా... పెరిగిందీ, తిరిగిందీ పిఠాపురం లోనే. శుద్ధమైన కర్ణాటక సంగీతం, శ్రీ మునుగంటి వెంకట్రావు గారి వద్ద నేర్చుకున్నా.. జానపద సంగీతం పై మక్కువ పెంచుకోవడం, జానపద సంగీ తం నేర్చుకోవడం మాత్రం శ్రీ వల్లూరి జగన్నాధరావుగారి చలవ వల్లనే.

పాటమీద ఏమాత్రం ఉత్సాహం ఉన్నా అప్రయత్నంగా నోటినుంచి వెలువడి, అమిత ఆనందాన్ని కలిగించేవి మాత్రం జానపద గేయాలే. రచయిత ఎవరన్నది అప్రస్తుతం. కల్మషమన్నది లేకుండా సాగే ఈ గీతాల పదాల కూర్పు, బాణీ, జానపద గేయాలకు బహుళ ప్రాచుర్యాన్ని కలిగించాయి.

కూలికొస్తావంటే పిల్లా, కోలాటం పాట, సిరిసిరి మువ్వ, కాకినాడ సెలగపప్పు, బండెనకబండి కట్టి, బేట్రాయి సామిదేముడా, వల్లారి బాబో కావులోరన్నా, దుక్కులు దుక్కులు దున్నరే .... వంటి వందలాది పాటలు, ఆరోజుల్లో అందరి నోళ్ళలోనూ నానుతుండేవి. పొలం పనులు చేసుకునే కార్మికులు, కర్షకులు, జానపదులు ఇవే పాటలు పాడుకుంటూ కాలక్షేపం చేసే వారు. సమయం తెలిసేది కాదు, అలసట తెలిసేది కాదు.

అలా జానపద గేయాలను క్రమబద్ధం చేసి, పాడి, సంగీత కచేరీలలో సమానమైన సభార్హత కల్పించి కృతకృత్యులయ్యింది - సీత, అనసూయలు మాత్రమే అంటే అతిశయోక్తి కాదు. అంటే శుద్ధి గల జానపద గీతాల గానం వీరితోనే ఆరంభ మయిందన్నమాట. మల్లాది సూరిబాబు గారి మాటల్లోనే, వారు అనసూయాదేవి గార్ని - ఇన్ని పాటలు ఎలా సేకరించ గలిగారని అడుగగా - కాకినాడ నుంచి పిఠాపురం రెండెడ్ల బండి లో ప్రయాణాలు పొలాల్లో పాటలు, అప్పటి జాతరలు, చెక్కభజనలు, తోలుబొమ్మలాటలు - ఇలా ఎన్నో జానపద రూపాలనుంచి, ఆకర్షితురాలై, వారి పాటలను సేకరించగలిగామని తెలిపారుట. ఆమె పుట్టి పెరిగిన వాతావరణం అలాంటిది. వారికున్న జిజ్ఞాస అలాంటిది.

నవ్యసాహిత్య వైతాళికుడు, భావకవుల్లో సార్వభౌముడనదగ్గ 'పద్మభూషణ్' శ్రీ దేవులపల్లి కృష్ణశాస్త్రి గారి మేనకోడలైన అనసూయాదేవి, ఆయన పాటల నెన్నిటినో కంపోజ్ చేసారు. శ్రీ కృష్ణశాస్త్రి గారి పాటల్లో కరుణ, భక్తి, శృంగార రస గీతాలకే కాదు, జానపద గీతాలను సైతం అత్యద్భుతంగా వ్రాశారు. గోదావరి ప్రాంతంలో పడవల్లో రకరకాల చేపలను వర్ణిస్తూ పాడిన పాటలలో, ఆ పాటలకు ప్రాణం పోసిన, జనారంజకంగా పాడిన అనసూయ, సీతలను మరువలేం. ప్రార్ధనా గీతాలు ఆధ్యాత్మికంగానూ, భావగీతాలు సాహితీపరంగానూ, జాతీయ గీలు, ప్రబోధ గీతాలు - వేటికవే సాటి. మల్లీశ్వరి చిత్రంలో పాటల ప్రస్థానంతో అడుగిడిన శ్రీ దేవులపల్లి గారికి, అందులో

వారు వ్రాసిన 'ధీర సమీరే యమునా తీరే'. మనసున మల్లెల మాలలూగెనే పాటలకు వరుస కట్టింది మాత్రం అనసూయగారే. కానీ అనసూయ పేరు ప్రస్తావన లేకుండా, రాజేశ్వరరావు గారికి ఆ కీర్తి దక్కిందట.

'వింజమూరి సిస్టర్స్' గా ఎంతో పేరు సంపాదించారు, సీత అనసూయగార్లు.

1977 లో శ్రీమతి అనసూయగారికి ఆంధ్ర విశ్వవిద్యాలయం వారు 'కళా ప్రపూర్ణ' అనే బిరుదునిచ్చి, గౌరవ డాక్టరేట్ ఇచ్చి సన్మానించింది. అంతే కాదు, అమెరికాలో జీవిత సాఫల్య పురస్కారాన్ని అందుకున్నారు. ప్యారిస్ లో ఈమెకు 'క్వీన్ ఆఫ్ ఫోక్' అనే బిరుదును ప్రదానం చేశారు.

ప్రముఖ క్రిటిక్ శ్రీ వి ఎ కె రంగారావు శ్రీమతి అనసూయగారి గురించి తెలియజేస్తూ, 'జానపద గీతాల రూపకల్పనలో సీత, అనసూయల ప్రస్థానం అనన్య సామాన్యం. ప్రఖ్యాతి గాంచిన, బహుళ జనాదరణ పొందిన రోజులు మారాయి చిత్రంలోని 'ఏరువాకా సాగారో' పాటకు 1932లో సీత అనసూయగార్లు పాడిన ప్రైవేటు గీతం 'చుక్కల చీర కట్టుకుని' అనే పాట ఆధారమని తెలియజేసారు.

అనన్య ప్రతిభావంతురాలు, జానపద గేయ సామ్రాజ్ఞి శ్రీమతి వింజమూరి అనసూయాదేవి గారు అస్వస్థతతో తన 99వ ఏట, అమెరికాలోని హ్యూస్టన్ నగరంలో, తన మనమరాలి ఇంటివద్ద 23-3-2019 న తుదిశ్వాస విడిచారు. (వికీపీడియా, మల్లాది సూరిబాబు గారు, వింజమూరి అనసూయ దేవిగార్ల ఫేస్ బుక్ సౌజన్యంతో - వారికి కృతజ్ఞతలు

---

**ముల్లాగారి కోటు** (17 వ పేజీ తరువాయి)


నో!'అని చూపుడు వ్రేలితో బెదిరిస్తూ పోయాడు. ముల్లాకి రాజుగారి దగ్గర చాలా పలుకుబడి ఉంది. ఈ విషయం అందరికీ తెలుసు. ఆయన తప్పకుండా తన కోటు చోరీ గురించి రాజుగారితో చెప్పుతాడనీ, రాజ భటులు దొంగని ఎలాగైనా పట్టుకుని తీరతారనీ అందరూ భయపడ సాగారు. దీనిని గురించి చిలవలు పలవలుగా కథలు అల్లి, రాజుగారి దండన ఎంత కఠినంగా ఉంటుందో అని ఊరంతా చర్చించుకో సాగారు. ఈ విషయం ఆ నోటా ఆ నోటా నెమ్మదిగా దొంగతనం చేసిన వాడి వరకు వెళ్ళింది. వాడి గుండెల్లో రాయి పడింది. తను పట్టుబడడ మే జరిగితే మరణ శిక్ష ఖాయం. రాజుగారు కర్కోటకుడు. ఏదో చిన్నా చితకాదొంగతనాలు చేసి పొట్ట గడుపుకునే వాడిని నాకీ దుర్బుద్ధి ఎందుకు పుట్టింది? పుట్టేనుబో! ఆ కోటు ముల్లా గారిదే ఎందుకు కావాలి.? ఆయేనుబో! ఆయనకి అంత కోపం ఎందుకు రావాలి? ఇదంతా నా చావుకే వచ్చిందిరా భగవంతుడా! అయ్యబాబోయ్! బతికుంటే బలుసాకు తిని బతకొచ్చు. ఈ పాడు కోటుని నేను వదిలించుకోవడం మంచిది. అని మనసులోనే అనుకుని సగం రాత్రప్పుడు గుట్టు చప్పుడు కాకుండా ముల్లాగారి ఇంటి గుమ్మం ముందు ఆ కోటుని వదిలి పెట్టి, చల్లగా జారుకున్నాడు.

తెల్లారి లేచి తలుపు తీసిన నస్రుద్దీన్ కి తన కోటు చెక్కు చెదరకుండా గుమ్మం ముందు కనబడడంతో చాలా ఆనందం కలిగింది. దాన్ని తీసుకుని ముద్దు పెట్టుకుని మళ్లీ తొడుక్కున్నాడు. మధ్యాహ్నం భోజనం అయ్యాక ఆ కోటునే ధరించి సగర్వంగా బజారుకి వెళ్ళాడు. చూసిన వాళ్లందరూ, ముల్లా గారి కోటు తిరిగి దొరికినందుకు చాలా సంతోషించారు. అభిమానులు ఆయన్ని అభినందించారు. కాని వారందరినీ ఒక అనుమానం పీడించ సాగింది. ఒక పెద్ద మనిషి ఉండబట్ట లేక అడగనే అడిగాడు. " ముల్లాగారూ! ముల్లా గారూ! మీ కోటు దొరికినందుకు సంతోషమే! కాని 'దొరక్కపోతే ఏం చేస్తానో చూడండి!' అందరినీ బెదిరించారు కదా! ఏం చేసి ఉండేవారండీ? "

"ఏం చేస్తాను. ఎవడో ముదనష్టపు వెధవ పట్టుకుపోయాడు. పోతే పోనీలే! అని మరొక మంచి కోటు కొనుక్కుని వేసుకునేవాడిని. అలా అనడంలో అదే నా ఉద్దేశం." అన్నాడు మెల్లగా నవ్వుతూ.

అక్కడున్న వారంతా నోళ్ళు వెళ్ళబెట్టారు. అదీ! నస్రుద్దీన్ ఘనత!

# వేదుల సుబ్రహ్మణ్యం



## ఎన్నికల కందములు (మేఘాలు)

కం. రామాయణమును విని ఆ
రాముడు సీతమ్మ కేమి రకముగ చుట్టం
బో మరి చెప్పుమన న్నొక
డేమని తెలియంగ జెప్పుదికనని యేడ్చెన్ ||

కం. ఎన్నికల సందడిక నా
సన్నము గాబోక ముందె స్వజనుల హితమున్
మన్నింపక వీధుల బడి
"తన్నుకు చావంగ" నేల తలబడి తమలో! ||

కం. ఎన్నికల సందడయ్యెను
సన్నగ వినిపించె గుసగుసలు నలుమూలన్
నిన్నటి విలువలు మారెను
మిన్నకనుండంగ నేడు మేలనిపించున్ ||

కం. అనుభవము నమ్మి యొక్కడు
కనుదోయినికప్పి చేత కైలాసమునే
కనుమని జూపి మరొక్కడు
జనులను ప్రాధేయ పడరె జయ మొనగూర్చన్! ||

కం. మొన్నటి కయ్యము నేడొక
మన్ననయై వియ్యమల్లె మారిన వేళన్
కన్నులు జాలవు రెండును
మిన్నంటిన వేడ్కజూసి మిసమిసలాడన్ ||

కం. భారీ గజిబిజి లెక్కల
నేరంబుల చిక్కి మధ్య నీరసబడియున్
వీరములు పల్కునేర్చు న
పారంబగు నోర్పునుండు వారల్ లేరో! ||

కం. "పాద"ములు సలుపు చున్నను
ఆదరమును జూపు జనుల కండగ నిలువన్
మోదము ముఖమున చిందిన
పేదల పెన్నిధిగ "యాత్ర" పేరిట చెల్లున్! ॥

కం. "హోదా"లేదని రాదని
గోదారిని కుక్కతోక గొని యీదంగన్
నాదారినాదె యని తా
నేదారినొ బోవ శ్రేయమేరికి నబ్బున్? ॥

కం. ఓట్లకు నమ్ముడు పోయెడు
కోట్లాది జనంబు ముందు కూసెడు సూక్తుల్
మేట్లుగ చెట్లకు కాసిన
నోట్లయి చెల్లంగరావు నూటికి నొకటిన్ ॥

కం. భారీ ముడుపుల నోట్లకు
బారలు తెగసాచి యందుబాటుగ జేయన్
నేరమ నెరిగియు నేర్వరెన
బేరములను గూర్చియొరుల ప్రీతిని బడయన్! ॥

కం. తనకొక న్యాయం బితరుల
కొనరగు నింకొక్క న్యాయముండునె ధరణిన్!
వెనుకాడక తా జంకక
జనువాని ప్రవృత్తి చెల్లు జనులకు హితమై॥

కం. న్యాయాన్యాయము లరసియు
మాయోపాయముల నల్లి మనుగడ వెతలన్
బాయంగ జేయు మనుజుల
హేయముతో త్రిప్పిగొట్ట హితమగు ధరణిన్॥

కం.తాబట్టిన కుందేటికి
కైబలమును జూపి యొక్క కాలును త్రుంపన్
"కాబోలు మూడె కాళ్ళని"
బాబులు తలపంగ వెత్రి బాగులు గారే! ॥

కం. బలహీనుడనని దెలిసియు
కలహంబుకు కాలు దువ్వి కవ్వించకనే
తలబడు మూర్ఖుని కెట్లని
తెలివిగ జెప్పంగ నౌనొ తెలియగ రాదే! ॥

# శ్రీనాధుని కాశీ ఖండం

## (వచనానుసరణం)


## పోచినపెద్ది మురళీ కృష్ణ




### ముందు మాట

కాశీ క్షేత్రంతో భారతీయులకు ఎంతో విడదీయరాని అనుబంధం ఉంది.. జన్మించినా, మరణించినా కాశీ క్షేత్రంలోనే జరగాలని భారతీయులు భావిస్తారు. అంతటి పవిత్ర క్షేత్ర వైభవాన్ని వర్ణించని భారతీయ సాహిత్యం లేదు. స్కాంద పురాణంలో వ్యాసుడు కాశీ వైభవాన్ని విస్తృతంగా వర్ణించాడు. తెలుగు సాహిత్యంలో శ్రీనాధుడు ప్రప్రథమంగా ప్రబంధ రీతిలో కాశీ క్షేత్రాన్ని వర్ణించాడు. ఈ కాశీ ఖండాన్ని మా పాఠకులకు పరిచయం చేయడానికి డా. పోచినపెద్ది వెంకట మురళీ కృష్ణ గారిచే సరళ వ్యావహారిక భాషలో, యధా మూలానుసారంగా అనుసరించిన కాశీ ఖండాన్ని, నెలనెలా అందిస్తున్నాము.

ఈ వ్యాస పరంపర ఆధ్యాత్మిక వేత్తలకు భక్తీ తత్వాన్ని, విద్యార్థులకు శ్రీనాధుని తత్వాన్ని అందించగలదని భావిస్తున్నాము.

- సంపాదకురాలు.


(గత సంచిక తరువాయి)


కామధేనువు తన పాలతో శివునికి అభిషేకం చేస్తూ ఉంటాయి. నవ నిధులు శివునికి మణులను అర్పిస్తూ ఉంటాయి. కాశీ పట్టణము శివునికి ఇల్లు. ఈ నగరంలోనికి కలి ప్రవేశించ లేదు. వారణాశి లక్ష్మి నివాసము. అవిముక్త క్షేత్రము ముక్తికి నిలయము. అని వ్యాసుని శిష్యులు బాదరాయణునికి విన్నవించారు.

"శిష్యులారా! మనము బిక్షాటనము మానేద్దాము. ఈ మఠములో కాళ్ళు కడుపులో పెట్టుకొని పడుకుందాము. రేపు బ్రాహ్మణుల ఇళ్ళలోమాత్రము మధూకరము చేద్దామ" అని వ్యాసుడు చెప్పి అరాత్రి విశ్రాంతి తీసుకున్నారు.

వ్యాసుడు ఒక పక్కకి, శిష్యులు మరొక పక్కకి బ్రాహ్మణుల ఇళ్ళకి మధూకరానికి బయయలు దేరారు. శివుని మాయా ప్రభావము వలన ఒక్కర్తి బిక్షను పెట్టలేదు. వ్యాసుడు బాధపడి చేతిలోని బిక్షా పాత్రను పగులగొట్టి కోపావేశముతో" ధనమదము , వేదవిద్యా మదము , మోక్ష లక్ష్మి మదము ఈ నగరములోని ప్రజకు ముదిరిపోయింది. ఇక్కడి బ్రాహ్మణులు నన్ను అవమాన పరిచారు. అందువలన ఇక్కడ నివశించే జనులకు మూడు తరములవరకు విద్య, మోక్షము, ధన లభించ కుండుగాక అని శపించాలని ఆలోచిస్తున్నాడు.

ఇంతలో ఒక బ్రాహ్మణుని ఇంటి ముందటపార్వతి ప్రాకృత స్త్రీవేషాన్ని ధరించి నిలుచుని ఉంది. ఆమె తలలో అటనట తెల్ల వెంట్రుకలతో నువ్వులు బియ్యము కలిసినట్లుగా ఉంది. సన్నినడుము నడయాడుతూ ఉంది. వాలిన కన్నులు కలిగిఉంది. చెలికత్తె చేయి పట్టుకొని వీధిలోకి వచ్చింది. "సంయమివరా! ఇటురా!" అనిచేయి ఎత్తి పిలిచింది. ఆమె చేతి కంకణాలు ఘల్లు, ఘల్లు మంటున్నాయి. " కడుపు నిండా తినడానికి తగినంత బిక్షాన్నం లభించనమదుకు నీవు ఈవిధంగా చింతించుట తగునా?

( ఇంకా వుంది)

ఆర్. శర్మ దంతుర్తి

# తెలుగు పద్య రత్నాలు - 1

తెలుగులో పద్యాలు, కావ్యాలు, రాసినవాళ్ళలో కవిత్రయం, పోతన, కంచెర్ల గోపన్న, వేమన, బద్దెన లాంటి వారు ఎప్పటికీ సాహిత్యంలో చిరస్మరణీయులు. ఆ పద్యాలు పరిచయం చేయడానికిదో చిన్న ప్రయత్నం. ఇందులో మొదటి పద్యం కవిసామ్రాట్ శ్రీ విశ్వనాథ సత్య-న్నారాయణగారు చెప్పినట్టూ 'తెలుగువారి పుణ్యపేటి' అయిన పోతనది.

**శా. శ్రీ కైవల్య పదంబుఁ జేరుటకునై చింతించెదన్ లోక ర**
**క్షైకారంభకు భక్త పాలన కళా సంరంభకున్ దానవో**
**ద్రేకస్తంభకుఁ గేళి లోల విలసదృగ్జాల సంభూత నా**
**నా కంజాత భవాండ కుంభకు మహానందాంగనాడింభకున్.**

శ్రీ మదాంధ్ర మహాభాగవతం మొదలుపెడుతూ పోతన మొదట రాసిన పద్యం ఇది. ఇది భాగవతానికే కాదు మొత్తం తెలుగు సాహిత్యా-నికే మకుటాయమానమైన పద్యం అని కరుణశ్రీ గారు అంటారు. కావ్యాలు రాసేటపు-డు అందరూ మొదలుపెట్టిన-ట్టే పోతన కూడా శుభకరం అని చెప్పడానికి "శ్రీ" తో మొదలుపె-ట్టాడు. కరుణశ్రీగారు అనడం ప్రకారం ఈ పద్యంలో ఆరు దళాలు ఉన్నాయి. మొదటి దళం, "శ్రీ కైవల్య పదంబుఁ జేరుటకునై చింతించెదన్." ఇది భాగవతం శుకమహర్షి దగ్గిరనుంచి వినే పరీక్షిత్తుకీ, "భాగవతం రాస్తే నీ భవబంధా-లు తెగుతాయి, అని రామభ-ద్రుడు చెప్పి రాయమంటే నేను రాస్తున్నాను, కైవల్యపదం అం-దుకోవడానికి" అనే పోతనకీ, భాగవతం ఎందుకు చదవడం అని అడిగేవారికీ సమాధానం. మరి రెండో దళం ఆ కైవల్య-పదంలో ఉండేవాడి గురించి, "లోక రక్షైకారంభకు." ఆయన మొదట లోకాలని రక్షించేవా-డు. మూడోది, "భక్త పాలన కళా సంరంభకున్." ఎప్పుడు ఎలా రక్షిద్దామా తన భక్తు-లని అని కంగారు పడుతూ (సంరంభంతో) చూస్తూ ఉంటా-డుట భగవంతుడు. నాలుగు, "దానవోద్రేకస్తంభకు." మనలో ఉండే దానవ, రాక్షస గుణాలని అణిచేవాడు. గమనించారా? మొదట మన దానవ గుణాలు అణిచేది లేదు. ముందు లోక రక్షణ, భక్తపాలన అప్పుడు ఇంకా కావాలిస్తే దానవోద్రేక స్తంభన. ఆ క్రమంలో ఎప్పుడూ కూడా మంచి గుణాలు ముందు, చెడ్డవి తర్వాత. భగ-వంతుడు మన తల్లో తండ్రో అనుకుంటే, మనకి సహాయం చేయడానికి మన తల్లీ తండ్రీ ఎంత తయారుగా ఉంటారో, భగవంతుడు దానికి పదిరెట్లు

ఎక్కువగా సిద్ధంగా ఉంటాడన్నమాట.

మరి మనని ఎల్లవేళలా రక్షించే, మన దానవోద్రేక స్తంభకుడెలాంటివాడు? అది అయిదో దళం నుంచి చెప్తున్నాడు, "గేళి లోల విలసదృగ్జాల సంభూత నానా కంజాత భవాండ కుంభకు." విలాసంగా కళ్ళు తిప్పుతూ ఈ బ్రహ్మాండాలని ఆడించే మహావిష్ణువు. భగవంతుడెటువంటివాడు? తన ఆటల కోసం (కేళి లోల) విలాసంగా బ్రహ్మాండాలు సృష్టిస్తూ, లయం చేస్తూ ఉంటాడుట ఆయన. "నానాకంజాత భవాండ కుంభకు" అంటే అనేకానేక (పద్మంలోంచి పుట్టిన బ్రహ్మాకి ఆధారమైన అండము- బ్రహ్మాండము) లోకాలకి నాయకుడు. ఈ దళంలో చెప్పే మరో విషయం ఏమిటంటే, ఆయన కళ్ళు సూర్య చంద్రులవంటివి, లోకాలకి కారణమైనటువంటివనీ, ఆ సూర్య చంద్ర వంశాల గురించి బాగవతంలో చెప్పడానికి మున్నుడి.

ఇంక ఆఖరి దళం "మహానందాంగనా డింభకున్," అనేది లీలామానుషుడైన శ్రీహరి మన మధ్యే వినోదంగా నందుడి కొడుకై చక్రం తిప్పడం. ఇది భాగవతంలో వచ్చే కృష్ణావతారానికి ప్రతీక. ఈ పద్యానికి పోతన ఎన్నుకున్న వృత్తం శార్దూలం, వీర రసం సరిపోవడానికీ, భగవంతుడి గుణాలు అన్నీ గొప్పగా విశదీకరించడానికీను.

మరోలా చదివితే ఇది పోతన మనఃస్థితిని కూడా తెలియచెప్తుంది. రామభద్రుడు ధ్యానంలో కనిపించి భాగవతాన్ని తెనిగించమన్నాడు. "ఎందుకు, ఏమిటి, నేను చేయగలనా?" అనేవి అనవసరం. ఆయన చేయమన్నాడంటే ఆయనే చేయిస్తాడనే ధైర్యం, ఆ చేయించేది, భవబంధాలు తెగడానికి, అంటే ఈ జనన మరణ చట్రం లోంచి తప్పుకుని అఖండానందం స్వంతం చేసుకోవడానికి. దానికి తాను రాయడం మొదలుపెడుతున్నాడు. అందువల్ల మొదటి దళంలోనే చెప్తున్నాడు డు, ఈ రాయడం ఎందుకో "శ్రీ కైవల్య పదంబుఁ జేరుటకునై చింతించెదన్." మిగతా దళాలు ఆ రాయమన్న భగవంతుడి గురించి.

భాగవతంలో పోతన చూపించిన కవితా పటిమ అనన్యసామాన్యం. ఏదో పండిత విద్వత్తుతో పోతన అనే మానవుడితో సహా ఎవరూరాయలేరు. భాగవతంలో పద్యాలు పోతన చెప్పుకున్నట్టూ, "పలికించెడు వాడు రామభద్రుడట. "భాగవతం పుస్తకాలకి ముందుమాట రాస్తూ నండూరి కృష్ణమాచార్య గారు (తిరుమల తిరుపతి దేవస్థానం పుస్తక సంపాదకులు) చెప్పిన మాటలు ఇక్కడ గుర్తు చేసుకోవడం చాలా ఆనందకరమైన విషయం.

"పోతన కవితాపటిమ ఇంద్రజాల మహేంద్రజాలాలను మించి కవితాకళ ప్రయోగించగల భువన సమ్మోహనాస్త్రం. ఈ కవితాకళ ప్రయోగించే పోతన అక్షయ సమ్మోహనాస్త్ర తూణీరుడు." ఈ సమ్మోహ నాస్త్రం వల్లే, అక్షర జ్ఞానం లేకపోయినా తెలుగువాళ్లలో కొంతమంది పోతన పద్యాలు నోటికి కంఠతా పట్టి చెప్పగలరు. ద్రాక్షా, కదళీ, నారికేళాపాకంగా విభజించబడిన తెలుగు పద్యాలలో పోతనది అత్యంత సులువైన ద్రాక్షా పాకం. ఆ పద్యాలు చదువుతూంటే తీయని ద్రాక్షపండు నోట్లో వేసుకోగానే ఒళ్ళు పులకరించినట్టూ మనసు ఆనందతరంగాలలో తేలుతుంది. పోతన తెలుగువాడిగా పుట్టి భాగవతం రచించడం, అది చదవడానికి మనకి కలిగిన అవకాశం మనందరం చేసుకున్న పూర్వజన్మ సుకృతం.

(మళ్ళీ వచ్చే నెల కలుద్దాం)

# తుమ్మూరి రాంమోహన్ రావు




## తెలంగాణా మహానుభావులు

### వంటమనిషి నుండి ప్రజల మనిషిగా మారిన వట్టికోట ఆళ్వారు స్వామి

తన అగ్నిధారను అంకితమిస్తూ దాశరథి వట్టికోట ఆళ్వారుస్వామి వ్యక్తిత్వానికి అక్షర రూపమిచ్చారు ఇలా-

"అసలు ఆళ్వార్లు పన్నెండుమందే;
పదమూడో ఆళ్వార్ మా
వట్టికోట ఆళ్వార్‌స్వామి!
నిర్మలహృదయానికి
నిజంగా అతడు ఆళ్వార్;
దేవునిపై భక్తిలేకున్నా
జీవులపై భక్తి ఉన్నవాడు;
తాను తినకుండా
ఇతరులకు అన్నం పెట్టగలవాడు.
జైలుగోడలమధ్య
కేళీవిలాసంగా ఉండగలవాడు.
శరీరంలో ప్రతి అణువూ
అరోగ్యస్నానం చేసే రీతిని
నిష్కల్మషంగా నవ్వగలవాడు.
అతని కలం వజ్రాయుధం,
అతనిది న్యాయపథం;
అతన్ని మృత్యువు ప్రేమించింది
మృత్యువువంటి రాకాసి శూర్పణఖకు
అతడంటే ఇష్టం కలిగింది.
రాముడి తెలివితేటలులేని
అమాయకుడు ఆళ్వార్!
మృత్యువుకు బలియైపోయాడు,
మమ్మల్నివదిలేసిపోయాడు.
అయినా ఎంతదూరం పోతాడతడు?
మన హృదయాల మల్లెపందిళ్లకింద
దోహదక్రియ జరుపుతుంటాడు.
నీడలా వీడక మనవెంట వుండి
వేడివేడి అలోచనల పాయసం అందిస్తాడు.
ఎక్కడ దుఃఖం వున్నా, బుద్ధుడిలా
ఏగి, తోచిన సాయం చేస్తాడు.
అతడు ప్రజల మనిషి;
అతడంటే దుష్టులకు కసి
అబద్ధాసురుని పాలిటి తల్వార్ ఆళ్వార్;
ఆనందరమణికి షల్వార్ ఆళ్వార్.
అతను పోయినప్పటినుంచీ
అమృతహృదయం విచ్చి
నవ్వగలవాడు లేకుండా పోయాడు లోకంలో
ఆళ్వార్ లేని లోకంలో
అంధకారం ఆధిపత్యం చలాయిస్తుంది.
అతడంటే చీకట్లకు భయం,
వెలుతురులకు జయం.
స్వార్థం రాచరికం నెరపే లోకంలో
నిస్స్వార్థి అతడొక్కడంటే
అతిశయోక్తి అలంకారం అడ్డురాదు.
ఆశ్రయింపు లెరుగనివాడు
విశ్రాంతి తెలియనివాడు
స్వసుఖం కోరనివాడు
వారంవారం మారనివాడు
రంగులద్దుకోలేనివాడు
మనిషి మనస్సులో మంచినేగాని
చెడు అనే మాలిన్యాన్ని వెతక తలపెట్టనివాడు.
మిత్రునికోసం కంఠం ఇవ్వగలవాడు
మంచికి పర్యాయపదం ఆళ్వార్.
అతనిదే సార్థకమైన జీవితం
అతనికి అగ్నిధార అంకితం."

దాశరథితో నిజామాబాదులో జైలుజీవితం గడిపి ఆయన రచనలను జైలు గోడలమీద బొగ్గుతో రాసి దెబ్బలుతిన్న వాడు వట్టికోట.అందుకే అంతగా చలించిపోయాడు దాశరథి.



1915 నవంబర్ 1 తేదీన నల్లగొండ జిల్లా నకిరేకల్ సమీపంలోని చెరువు మాదారంలో సింహాద్రమ్మ, రామచంద్రాచార్యులకు జన్మించాడు. తండ్రి చిన్ననాట చనిపోవడంతో సీతారామారావు అనే ఉపాధ్యాయుడికి వండిపెడుతూ విద్యాభ్యాసం, సారస్వతాభ్యాసం చేశాడు.

అలా తన జీవితాన్ని వంటమనిషిగా ప్రారంభించి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ తెలంగాణా గర్వించదగ్గ నవలా రచయితగా ఎదగటం వెనుక నాటి నైజామం పీడిత తెలంగాణా నేపథ్యమున్నది.రజాకార్ల ఆగడాలున్నవి.తాను ఎదగడానికి తోడ్పడిన కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాలున్నవి.

వట్టికోట ఆళ్వారుస్వామి తెలంగాణా తొలితరం ప్రసిద్ధ నవలా రచయితలలోఒకరు. ఆయన ప్రజలమనిషి నవల ఆనాటి నైజాంజమానాలోని తెలంగాణా పరిస్థితుల్ని కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది.

దేశోద్ధారక నాగేశ్వరరావుగారి ప్రేరణ ప్రోద్బలాలతో దేశోద్ధారక గ్రంథమండలి స్థాపించి తెలంగాణాలో గ్రంథాల యోద్యమానికి బాటలువేసిన వైతాళికుడు. జైలు జీవితం అనుభవించినపుడు పొందిన అనుభవాలను కథలుగా రాస్తే అవి నాటి పత్రికలలో ప్రచురించబడినాయి.అవే తరువాత 'జైలు లోపల' అనే కథాసంపుటిగా వెలువడినాయి.

ఆయన జీవితమంతా అస్థిరంగానే గడచింది. పొట్టకూటికోసం కుటుంబపోషణార్థం అనేకమందిని ఆశ్రయించి వంటవాడుగా,పత్రికలో ప్రూఫురీడరుగా, హోటలులో సర్వ రుగా,అనేక అవతారాలు ఎత్తవలసివచ్చింది. తాను నమ్మిన సిద్ధాంతాలకోసం,ఆదర్శాలకోసం అనేకసార్లు జైలుగోడలు లెక్కపెట్టవలసి వచ్చింది.

గ్రంథాలయోద్యమంతో తో మొదలైన ప్రేరణ ఆళ్వారు స్వామిని నిజాం వ్యతిరేకోద్యమం దాకా నడిపించింది. ప్రజల్లో కలిసి ఆయన పనిచేసిన తీరు నిజాంకు కోపం తెప్పించింది. దానితో ఆయన జైలు పాలు అయ్యాడు. వంటపనిలో, ప్రూఫ్ రీడింగ్‌లో, హోటల్ సర్వర్‌గా పనిచేస్తున్నప్పుడు ఆయన పొందిన అనుభవాలు ఆయన ప్రజల మనిషిగా నిలబడేట్టు చేశాయి. నిజాంను గడగడలాడించిన 'ఆంధ్రమహాసభ' నల్లగొండ జిల్లా అధ్యక్షుడిగా, కమ్యూనిస్టు పార్టీ నాయకుడుగా ప్రజాచైతన్యాన్ని కూడగట్టాడు.

కందిబండకు చెందిన నారపరాజు గారి కుటుంబానికి చేరువకావటం,అలా వారితో గల సాన్నిహిత్యంతో తరచు బెజవాడవెళ్లిరావటం అలా బెజవాడలోని వెల్కం హోటల్లో సర్వరుగా పనిచే-

యటం జరిగింది.ఉచిత భోజనం నెలకు అరవై రూపాయల వేతనం దొరకటం అప్పట్టి ఆయన స్థితి-గతులకు పెద్ద ఊరట.అయినా ఆయన లోని పట్టుదల స్వభావం ఆయనను మంచి చదువరిగా మంచి విద్యావంతుడిగా తీర్చి దిద్దింది.ఆయనే రచయితగా మారి ప్రచురణ కర్తగా మారటం అనేది ఆయన సహజ స్వభావా-న్ని తేట పరుస్తుంది.

రెండేళ్లపాటు బెజవాడలో ఉన్న వట్టికోట నారపరాజు కుటుంబ సభ్యులకోసం తన మకాం హై-దరాబాదుకు మార్చారు.వారికి వంట చేసి పెడుతూ తీరిక సమ-యాల్లో వారివద్ద ఆంగ్ల భాషను అభ్యసించారు.

క్రమంగా ప్రజాహిత సంస్థలతో, సాహితీవేత్తలతో పరిచయాలు పెరి గాయి.సికింద్రాబాదు యువకుల ను ఉత్తేజపరచి సామాజిక సేవా రంగం వైపు మళ్లించటం,గ్రంథా లయోద్యమం,ఆంధ్రోద్యమాలతో సంబంధాలు ఏర్పరచుకోవటం వల్ల ఆయనలో ఉద్యమ స్ఫూర్తి కలిగింది.

క్విట్ ఇండియా ఉద్యమం ప్రేరణ తో సత్యాగ్రహంలో పాల్గొనటంతో నైజాము ప్రభుత్వం ఏడాది పాటు జైలులో నిర్బంధించింది.అక్కడ కమ్యూనిస్టు పార్టీ నాయకులతో సాన్నిహిత్యం ఏర్పడి,కమ్యూని-జం ఆదర్శాలు,లక్ష్యాలు, పో-రాటనిబద్ధతలతో ప్రభావితుడై జైలునుండి విడుదలైన తరువాత ఆంధ్రమహా సభ కార్యకర్తగా పని-చేస్తూ హైదరాబాదుశాఖకు అధ్య-క్షుడుగా కూడా ఎన్నిక కావటం వట్టికోట గట్టిమనిషి కావడం వల్లనే.

మీర్ ఇస్మాయిల్ నైజాం ప్రధాన మంత్రి అయిన సమయంలో కమ్యూనిస్టు నేతల పై విరుచుకు పడటంతో వట్టికోట మళ్లీ జైలు పాలయ్యారు. హైదరాబాదు విమోచనం జరిగిన ఏడాది తరువాత విడుదలయ్యారు.జీ-వితమంతా ఒడిదుడుకులతో గడచినా తనలోని రచయితను నిలబెట్టుకొని అనేక రచనలు కావించాడు ఆళ్వారు స్వామి.

వట్టికోట నాటి పరిస్థితులను ప్ర-తిబింబించే పలు కథలు రాసినా ఆయన రాసిన ప్రజలమనిషి నవల ఆయనకు ఎన లేని గు-ర్తింపునిచ్చింది.తొలి తెలంగాణా నవలగా ప్రాచుర్యం లభించ-టమే గాక దాశరథి రంగాచార్య-లాంటివారు చిల్లరదేవుళ్లు వంటి నవలలు రాయడానికి ప్రేరణగా నిలిచింది.ప్రజలమనిషి నవల-లోని కంఠీరవం పాత్ర ఒక రకంగా వట్టికోట స్వీయచిత్రణే.

ఆ పాత్ర ద్వారా ఆయన తన అభి-ప్రాయాలను సూటిగా పాఠకు-డికి అందించారు.మచ్చుకు ఈ మాటలు చూడండి.

“ఇస్లాం అంటే శాంతి . శాంతిని కోరి సత్యానికి పోటీపడే ఏమ-తమైనా నాకు సమ్మతమే ! కాని మీరు , మీ మతాన్ని శాంతికి ద్రోహం చేసేదిగా మార్చినారు “.”కులాల పేర, మతాల పేర ప్రా-రంభమైన అడ్డుగోడలు క్రమంగా బలమైన అడ్డంకులుగా తయా-రైనాయి . దాంతో మనలో ఐక్యత నశించింది”

ఆయన రాసిన కథలు అంతా ఏకమైతే - (ప్రజాసాహితి,)
ఆలు కూలి - (కిన్నెర). గాలి పటం - (అభ్యుదయ)
కాఫిర్లు - (విశాలాంధ్ర) పతితుని హృదయం - (సృజన)
పరిగె -(ప్రజాసాహితి విశాలాంధ్ర)
పరిసరాలు - (స్రవంతి )
బదనిక - (కిన్నెర) నాటి పత్రికల-లో ప్రచురించబడ్డాయి.

ఆయన రాసిన మరో నవల గంగు 1940 -45 మధ్యకాలం-లోని రాజకీయ సామాజిక ఉద్య-మాల చిత్రణతో సాగుతుంది.

తెలంగాణ చైతన్యం కోసం 'దే-శోద్ధారక గ్రంథమాల' స్థాపించి 35 పుస్తకాలు ప్రచురించాడు. తెలంగాణ విశేషాలను కూర్చి, 'తెలంగాణ' పేరుతో సంపుటాలు ప్రచురించాడు కాని ఇవేవీ ఇప్పుడు అందుబాటులో లేవు.

పెదాలపై చెరగని చిరునవ్వు-,మాటల్లో మమకారంచేతల్లో నిజాయితీ నిండిన ఉత్తమ మానవుడు వట్టికోట ఆళ్వారు స్వామి.1961 ఫిబ్రవరి 6 న డిఫ్తీరి-యా వ్యాధితో తనువు చాలించిన వట్టికోట తెలంగాణా వైతాళికుల-లో ఒకరుగా చిరకీర్తిని పొందారు.

# చిలకమర్తి దుర్గా ప్రసాదరావు






# SPOKEN SANSKRIT


+91 9897959425


## (సంభాషణ సంస్కృతం -28)

**Unit:-I** विशेषणविशेष्यभाव: (सर्वविभक्तिषु )

**సంస్కృతభాషలో ఒక నియమం ఉంది . అదేంటంటే విశేషణం ఏ లింగ , వచన , విభక్తులలో ఉంటే, విశేషణం కూడ అదే లింగం , అదే వచన , అదే విభక్తిలో ఉండాలి .**

यल्लिङ्गं यद्वचनं या च विभक्ति : विषेष्यस्य तल्लिङ्गं तद्वचनं सा च विभक्ति: विशेषणस्यापि ||

**Examples:**

1. उत्तम: अध्यापक: योग्याय शिष्याय उत्तमां विद्यां ददाति
2. शिष्या: निपुणम् अध्यापकम् आश्रयन्ते
3. बालक: नूतनेन वस्त्रेण शोभते
4. पिता उत्तमाय वराय पुत्रिकां ददाति
5. अतिथि: दूरात् प्रदेशात् आगतवान्
6. उत्तमस्य आहारस्य सेवनं आरोग्यप्रदं भवति ||
7. उन्नतेषु शिखरेषु जनावास: प्रमादाय भवति ||

१ . अकारान्त पुम्लिंग शब्द: सप्तविभक्तिषु त्रिषु वचनेषु

**Example:** - एकवचनम् - द्विवचनम् - बहु वचनम्

प्रथमा विभक्ति -(रम्य:) बालक: - (रम्यौ ) –बालकौ – (रम्या:) - बालका:

द्वितीया :-- (रम्यं) – बालकं – (रम्यौ )–बालकौ- (रम्यान्)- बालकान्

तृतीया {-- (रम्येण) बालकेन –(रम्याभ्यां) –बालकाभ्यां –(रम्यै:) बालकै:

चतुर्थी :-- (रम्याय ) बालकाय –(रम्याभ्यां ) बालकाभ्यां (रम्येभ्य:) बालकेभ्य:

पञ्चमी :-- (रम्यात् ) बालकात् - (रम्याभ्यां ) बालकाभ्यां (रम्येभ्य:) बालकेभ्य:

षष्ठी: - (रम्यस्य ) बालकस्य –(रम्ययो:) बालकयो: -( रम्याणां)-बालकानाम्
सप्तमी :-- (रम्ये ) बालके -- (रम्ययो:) बालकयो: -- ( रम्येषु ) बालकेषु
संबोधन प्रथमा :-- (हे रम्य) बालक ! –(हे रम्यौ )बालकौ ! (हे रम्या:) बालका: !

२. आकारान्त स्त्रीलिंग शब्द: सप्तविभक्तिषु त्रिषु वचनेषु

एकवचनम् - द्विवचनम् - बहु वचनम्

(रम्या ) बालिका (रम्ये ) –बालिके – (रम्या:) - बालिका:
(रम्यां ) –बालिकां – (रम्ये )–बालिके - (रम्या:) – बालिका:
(रम्यया) बालिकया – (रम्याभ्यां) –बालिकाभ्यां – (रम्याभि: ) बालिकाभि:
(रम्यायै ) बालिकायै –(रम्याभ्यां ) बालिकाभ्यां (रम्याभ्य:) बालिकाभ्य:
(रम्याया: ) बालिकाया: - (रम्याभ्यां ) बालिकाभ्यां (रम्याभ्य:) बालिकाभ्य:
(रम्याया:) बालिकाया: – (रम्ययो: ) बालिकयो: - ( रम्याणां)-बालिकानाम्
(रम्यायाम् ) बालिकायाम् -- (रम्ययो:) बालिकयो: -- ( रम्यासु ) बालिकासु
(हे रम्ये ) बालिके – (हे रम्ये ) बालिके - ( हे रम्या: ) बालिका:

३. अकारान्त नपुंसकलिंगशब्द: सप्तविभक्तिषु त्रिषु वचनेषु
एकवचनम् - द्विवचनम् - बहु वचनम्

(रम्यम् ) पुस्तकम् - (रम्ये ) पुस्तके – (रम्याणि) - पुस्तकानि
(रम्यम् ) पुस्तकम् (रम्ये ) पुस्तके – (रम्याणि) - पुस्तकानि
(रम्येण) पुस्तकेन (रम्याभ्यां) –पुस्तकाभ्याम् –(रम्यै:) पुस्तकै:
(रम्याय ) पुस्तकाय (रम्याभ्यां ) पुस्तकाभ्यां (रम्येभ्य:) पुस्तकेभ्य:
(रम्यात् ) पुस्तकात् - (रम्याभ्यां ) पुस्तकाभ्यां (रम्येभ्य:) पुस्तकेभ्य:
(रम्यस्य ) पुस्तकस्य –(रम्ययो:) पुस्तकयो: -( रम्याणां)-पुस्तकानाम्
(रम्ये ) पुस्तके -- (रम्ययो:) पुस्तकयो: -- ( रम्येषु ) पुस्तकेषु
(हे रम्य) पुस्तक – (हे रम्यौ ) पुस्तकौ (हे रम्याणि) पुस्तकानि

रम्य: राम: -- रम्या –सीता --- रम्यं –वनम्

**Example :** - (रम्य:) राम: (रम्यया ) सीतया सह (रम्यम्) अरण्यं गतवान्

इकारान्त शब्द: सप्तविभक्तिषु त्रिषुवचनेषु ||

| एकवचनम् - | द्विवचनम् - | बहु वचनम् |
|---|---|---|
| हरि: - | हरी – | हरय: |
| हरिम् – | हरी – | हरीन् |
| हरिणा – | हरिभ्याम्- | हरिभि: |
| हरये - | हरिभ्याम् | - हरिभ्य: |
| हरे: -- | हरिभ्याम् - | हरिभ्य: “ |
| हरे: - | हर्यो: --- | हरीणाम् |
| हरौ - | हर्यो: | हरिषु |
| हे हरे – | हे हरी – | हे हरय: |

उकारान्त पुम्लिंग शब्दा: सप्तविभक्तिषु त्रिषुवचनेषु

| एकवचनम् - | द्विवचनम् - | बहु वचनम् |
|---|---|---|
| गुरु: - | गुरू- | गुरव: |
| गुरुम् – | गुरु – | गुरुन् |
| गुरुणा – | गुरुभ्याम् – | गुरुभि: |
| गुरवे | गुरुभ्याम् | गुरुभ्य: |
| गुरो: - | गुरुभ्याम् – | गुरुभ्य: |
| गुरो: - | गुर्वो: | गुरूणाम् |
| गुरौ – | गुर्वो: | गुरुषु |
| हे गुरो – | हे गुरु | हे गुरव: |

संख्यावाचकशब्दा:

**ఇక సంఖ్యా వాచకాల విషయాని కొస్తే ఒకటి , రెండు , మూడు , నాలుగు ఇవి లింగాన్ని బట్టి మార్పు చెందుతాయి . ఐదు నుండి ఆపై సంఖ్యావాచకాలన్ని మూడు లింగాల్లోను ఒకే లాగ ఉంటాయి .**

**ఏక: బాలక: ---- ఏకా బాలికా --- ఏకం పుస్తకం**
**ద్వౌ బాలకౌ – ద్వే బాలికే – ద్వే పుస్తకే**
**త్రయ: బాలకా: --- తిస్ర: బాలికా: - - త్రీణి పుస్తకాని**
**చత్వార: పురుషా: -- చతస్ర: మహిళా: -- చత్వారి పుస్తకాని**

वाक्यरचना

एक: बालक: एका बालिका एकं पुस्तकं स्वीकृत्य पाठशालां गच्छत: ||
द्वौ पुरुषौ द्वे महिले द्वे वाहने अधिरुह्य कलाशालां गच्छन्ति ||

त्रय: क्रीडाकारा:  तिस्र: क्रीडाकारिण्य: त्रीणि कन्दुकानि स्वीकृत्य क्रीडन्ति ||
चत्वार: युवका: चतस्र: युवतय: चत्वारि फलानि स्वीकृत्य देवालयं प्रविशन्ति ||

'तत्' शब्दस्य सप्तविभक्तिषु – त्रिषु वचनेषु-  त्रिषु लिङ्गेषु  रूपाणि

**పుంలింగం  स: అతడు -एष: ఇతడు**

स: **అతడు** -तौ **వారిద్దరు** – ते **వారందరు**
तम् **అతనిని** -तौ **వారిద్దరిని** – तान् **వారందరిని**
तेन **అతని చేత** –ताभ्याम् **వారిద్దరిచేత** - तै: **వారందరి చేత**
तस्मै **అతనికొరకు** – ताभ्याम् **వారిద్దరికొరకు** तेभ्य: **వారందరి కొరకు**
तस्मात्**అతని వలన** - ताभ्याम् **వారిద్దరివలన** - तेभ्य: **వారందరి వలన**
तस्य **అతనియొక్క** – तयो: **వారిద్దరియొక్క** - तेषाम् **వారందరి యొక్క**
तस्मिन् **అతనియందు** - तयो: **వారిద్దరియందు** – तेषु **వారందరి యందు**

**స్త్రీ లింగం** सा **ఆమె** एषा **ఈమె**

सा **ఆమె** –ते **వారిద్దరూ** –ता: **వారందరు**
तां **ఆమెను** – ते **వారిద్దరిని** - ता: **వారందరిని**
तया **ఆమె చేత** – ताभ्याम् **వారిద్దరి చేత** – ताभि: **వారందరి చేత**
तस्यै **ఆమె కొరకు** – ताभ्याम् **వారిద్దరి కొరకు** - ताभ्य: **వారందరి కొరకు**
तस्या: **ఆమె వలన** – ताभ्याम् **వారిద్దరి వలన** - ताभ्य: **వారందరి వలన**
तस्या: **ఆమె యొక్క** - तयो: **వారిద్దరి యొక్క** – तासाम् **వారందరి యొక్క**
तस्यां **ఆమె యందు** – तयो: **వారిద్దరి యందు** - तासु **వారందరి యందు**

**నపుంసక లింగం** तत् **అది** एतत् **ఇది**

तत् **అది** –ते **ఆ రెండు** – तानि **అవి అన్ని**
तत् **దానిని** -ते **అరెంటిని** –तानि **వాటన్నిటిని**
तेन **దాని చేత** –ताभ्याम्- **ఆరెంటి చేత** तै: **వాటన్నిటి చేత**
तस्मै **దాని కొరకు** – ताभ्याम् **ఆ రెండిటి కొరకు** —तेभ्य: **వాటన్నిటి కొరకు**
तस्मात् **దాని వలన** -ताभ्याम् –**ఆ రెంటి వలన** तेभ्य: **వాటన్నిటి వలన**
तस्य **దానియొక్క** – तयो: **ఆ రెంటి యొక్క** -तेषाम् **వాటన్నిటి యొక్క**
तस्मिन् **దాని యందు** - तयो: **ఆరెంటియందు** - तेषु **వాటన్నిటి యందు**

SANSKRIT SLOKA

## తలలు పది - సమాధానం ఒక్కటే

**(Heads are ten but the answer is one)**

ఒకసారి రావణుని భార్య మండోదరి తన భర్తతో " ఏమండి! ఇంద్రాది లోకపాలకులు, విష్ణువు, చంద్రుడు, సూర్యుడు, సర్పరాజులు, విద్యాధరులు మొదలైన మహానుభావులందరు మీకు శత్రువులే. మీకు ఎవరి-తోను పడదు. ఈ సృష్టిలో, మీదృష్టిలో, మీకు ఇష్టుడని చెప్పదగిన గొప్పవ్యక్తి ఒక్కరైనా ఉన్నారా? ఒక వేళ ఉంటే ఆయనెవరో వివరించండి" అని వినయంతో అడిగింది. రావణుడు ఆ ప్రశ్నకు సమాధానం-గా చిరునవ్వు చిందిస్తూ పదితలలతో ఇలా అన్నాడట. ఒక తల శూలి యని , రెండో తల శంభుడని, మూడోతల పినాకి యని, నాల్గోతల శివుడని, ఐదో తల భవుడని, ఆరో తల పశుపతి యని, ఏడో తల శర్వుడని, ఎనిమిదో తల ఈశ్వరుడని, తొమ్మిదోతల భర్గుడని పదో తల పేరుచెప్పకుండ 'చ' అనే పదంతో ఈశ్వరుణ్ణే సూచించాయట. ఈవిధంగా పది తలలు వరుసగా ఈశ్వరునే పేర్కొని అతని శివభక్తి పార-మ్యాన్ని వ్యక్తం చేశాయి.

ఇంద్రాద్యా: లోకపాలా: హరివిధు తపనా: నాగవిద్యాధరాద్యా:
ద్వేష్యా: సర్వేఽపి దేవా: ప్రియ తవ వరద: కోఽపి వంద్యో గరీయాన్?
శ్రుత్వా వాచం ప్రియాయా: ఇతి దశముఖత: ప్రాహ వాక్యం దశాస్య:
శూలీ శంభు: పినాకీ శివ భవ పశుప: శర్వ ఈశశ్చ భర్గ:

**Once Mandodari, the wife of Ravana asked her husband. "Dear Sir, all the Gods like Indra, Vishnu, the Moon, the Sun, the kings of serpents vidyadharas are treated by you as enemies. No one is liked by you in these three worlds. Is there any person in these three worlds who is great, giver of boons and dearest to you? Having been asked by his wife, Ravana, the ten headed demon, replied cheerfully with his ten heads. The first head mentioned the name suli ( Lord Siva), the second one Sambhu ( Lord Siva) , the third one Pinaki ( Lord Siva), the fourth one Siva ( Lord Siva), the fifth one Bhava ( Lord Siva), the sixth one Pasupa ( Lord Siva), the seventh one Sharva ( Lord Siva), the eighth one Isa ( Lord Siva) the ninth one Bharga ( Lord Siva) and the tenth one suggested the same Deity ( Lord Siva) with the word 'cha' with out mentioning His name directly.**

इन्द्राद्या: लोकपाला: हरिविधुतपना: नागविद्याधराद्या:
द्वेष्या: सर्वेऽपि देवा: प्रिय ! तव वरद: कोऽपि वन्द्यो गरीयान्
श्रुत्वा वाचं प्रियाया: इति दशमुखत: प्राह वाक्यं दशास्य:
शूली शंभु: पिनाकी शिव भव पशुप: शर्व ईशश्च भर्ग:

**(SubhashitaRatnaBhandagaram-p-184/v-77)**

# ఆదూరి హైమవతి



## తడబాటు

విద్యాపురి మహారాజు విక్రమకేసరి. ప్రజారంజకుడైన పరిపాలకుడు.మహారాజు షష్టిపూర్తి మహోత్సవం గొప్పగాచేయాలని మహా మంత్రి తలంచి ముఖ్య పరివారంతో సమాలోచన సలిపాడు. ఆ సందర్భంగా రాజ మహలుకు రంగులు దిద్దేపనిని మహామంత్రి ఒక విశ్వాస పాత్రుడైన వానికి అప్ప గించాలని నిర్ణయించాడు. విశ్వాస్ అనే వానిని పిలిచి జాగ్రత్తలన్నీ చెప్పాడు.

అతడితో "అంతఃపురం లోపల రంగులు దిద్దేపనికి నమ్మకస్తులనే పని లోకి తీసుకో. ఏమాత్రం తేడా వచ్చినా తలలు ఎగిరిపోతాయి, తెల్సుకదా ! పని చేసేవారంతా నోటికి గుడ్డలు కట్టుకుని , ఏమీ సద్దు చేయక పనిపూర్తి చేయాలని చెప్పు. " అనిహెచ్చరించాడు.

విశ్వాస్ తనకు నమ్మకస్తులూ, పనిలో మంచి చాకచక్యంగల పనివారిని వందమందిని నియమించు కున్నాడు. రక్షక భటులతో పాటు తానూ జాగ్రత్తగా పర్యవేక్షిస్తూ రోజుకు కొన్నిగదులు పూర్తి చేయిస్తున్నాడు విశ్వాస్.

రాజుగారి పడక గదికి,హంస తూలికా తల్పానికి రంగులు దిద్దే పనిని, పనిలో మంచి నైపుణ్యం గల ,నమ్మకస్తులైన రామప్ప, కృష్ణప్ప, వెంకప్ప, సూరప్పలకు మాత్రమే అప్పగించాడు. వారు నలుగురూ నాల్గు వైపులా మహారాజు నిద్రించే తల్పాన్ని మెత్తని బట్టతో తుడిచి పూర్వపు రంగులు అతి జాగ్రత్తగా దిద్దసాగారు. తల్పం తలవైపున పని చేస్తున్న సూరప్పకు తల్పం క్రింద నేలపైన మహా రాజు వజ్రపుటుంగరం కనిపించింది.

అతడి కళ్ళు జిగేలు మన్నాయి 'అదితన స్వంతం చేసుకుంటే తన దరిద్రమంతా తీరిపోతుందనీ, తన ముసలి తల్లికి కల కాలంగా ఉన్న జబ్బుకు వైద్యం చేయించవచ్చనీ, తనూ భార్యాపిల్లలతో హాయిగా బ్రతకొచ్చనీ, జీవితాంతం రంగులుపూసు కుంటూ బ్రతుకక్కర్లేదనీ, అంతగా ఐతే ఈ రాజ్యం వదలి మరో చోటికి వెళ్ళి మహారాజులా బతకొచ్చనీ' అని అనుకున్నాడు.

దాన్ని ఎలా బయటికి తీసుకెళ్ళాలా అనే ఆలోచనలో పడి రంగులు దిద్ద డంలో కొద్దిగా పొరబాటు చేశాడు. దాన్ని గమనించుకుని స్పృహలో పడి ఏమైతే ఐందని గబుక్కున ఉంగరాన్ని తీసి నోటి గుడ్డ పక్కకు లాక్కుని నోట్లో వేసుకుని చక చకా పనిలో పడ్డాడు. మధ్యాహ్నం భోజనసమయంలో పనివారికి భోజనంపెట్టే చావడిలో 'లఘుశంఖ' మిషతో చాటుకెళ్ళి దాన్ని ఎవ్వరూ చూడకుండా తీసి పంచె కొంగున కట్టుకుని మొలలో దోపుకున్నాడు- సూరప్ప. సాయంకాలం వరకూ పని చేసి ఉంగరాన్ని నోట్లో పెట్టుకుని అందరితో కలసి బయటికెళ్ళాడు.

మహారాజు రాత్రి నిద్రించేసమయంలో అలవాటుగా ఉంగరాన్ని చూసుకుంటూ నిద్రిస్తాడు.ఆరోజు తన చేతికి ఉంగరం లేకపోడాన్ని గమనించి, ఎక్కడో పెట్టి ఉంటానని భావించి, సేవకులను వెతకమని ఆజ్ఞాపించాడు. వారు అంతా వెదికి ఎక్కడా కనపడలేదని చెప్పారు. ఆవిషయం మహామంత్రికి తెలిసి, రాజుగారి శయన మందిరంలో పనిచేసిన నలుగురి గురించీ విశ్వాస్ ను అడిగాడు.

విశ్వాస్ " మంత్రిగారూ! నాకు కొంత సమయం ఇవ్వండి.ఎక్కడ ఎవరి వద్ద ఉన్నాతెలుస్తాను " అని విన్నవించుకుని, ఆ వారమంతా వారిని నలుగురినీ పరిశీలించ సాగాడు. సూరప్ప పనిలో

కాస్త పరధ్యానంగా ఉండటం గమనించాడు. కాని ఋజువుల తో పట్టుకోవాలని తగిన సమయ ముకోసం వేచి ఉన్నాడు.

పదిరోజులయ్యాక మహారాణి అంతః పురంలో రాణీగారి శయన మంది రానికీ, హంసతూలికా తల్పానికీ రంగులు దిద్దను ఆ నలుగురినే నియమించాడు. విశ్వాస్ ఒక నకిలీ నవరత్నాల ఉంగరాన్ని రాణిగారి తల్పం క్రింద ముందుగానే రహస్య ప్రదేశంలో ఉంచి పని జాగ్రత్తగా మొదలెట్ట మని ఆనలుగురికీ చెప్పాడు.

తాను ఉంగరం తీసిన విషయం ఎవ్వరూ గమనించ లేదనే ధీమాతో సూరప్ప తిరిగి తాను రంగులు దిద్దే తూర్పువైపునే మరో ఉంగరం కని పించ గానే ముందువలె దాన్నీ తీసి నోట్లో వేసుకు న్నాడు. మధ్యాహ్న భోజన సమయంలో చాటుగా దాన్ని తీసి వెనుకటిలా పంచకొంగున కట్టి మొలలో దోపుకు న్నాడు. భోజన సమయంలో అక్కడే ఉన్న విశ్వాస్ " ఏం సూరప్పా ! వెంకప్పా! పని జరూరుగా జరుగు తున్నది కదా!" అని పలక రించాడు.ఆసాయం-కాల విశ్వాస్ చాటుగా సూరప్ప ను చాటు చాటుగా అనుసరించి అతడి ఇంటి కెళ్ళాడు.చాటుగా కిటికీ పక్కన మాటేసి గమ నించాడు.

మరునాడు విశ్వాస్ సూరప్ప-ను మహా మంత్రిఎదుట హాజరు పరచాడు.

"మంత్రిగారూ! మన్నించండి, ఏదో చాపల్యంతో చేశాడు, వస్తు వు దొరికింది కనుక క్షమించి వది లేయ మని మనవి, మహారాజుకు తెలిస్తే తల తీస్తారు, మీరే ఇతడిని కాపాడాలి" అని విన్నవించు కున్నాడు.

'సూరప్పా! ఎందుకు చేశావీపని? నీమీది నమ్మకంతోనే కదా నిన్ను అంతఃపురంలో పనికి పెట్టాను?' అని నిలదీయగా, సూరప్ప మహా మంత్రి కాళ్ళుపట్టుకుని "ప్రభూ! తప్పు కాయండి. కన్నుచెదిరి, బుద్ధి గడ్డి తినింది, నాలేమి నా చేత ఈపని చేయించింది" అని ఏడ్చాడు.

మంత్రి "సరే రేపటిలోగా ఈ నగరం విడిచి వెళ్ళు, మరెప్పుడూ ఈ నగర ఛాయలకు రాను సాహ సించకు. నీకిదే శిక్ష , రక్ష కూడా ను.. " అని ఆదే శించాడు.

సూరప్ప వెళ్ళాక "విశ్వాస్ ! ఆ నలుగురిలో సూరప్పను ఎలా పట్టుకో గలిగావు?" అని ప్రశ్నించ గా "ఏముంది ప్రభూ! తప్పుచేసిన వాడు బెదురుతో తన పని సరిగా చేయలేడు, సూరప్ప పనిలో లోపం గమనించాను. ఆతర్వాత మహారాణిగారి అంతఃపురలో ఒక నకిలీ ఉంగరం ఉంచాను. దాన్ని సింధూరంలో అద్ది ఉంచ డంతో కొంగున కట్టుకోగానే ఆ సింధూరం సూరప్ప పంచె కొంగున అతుక్కుంది. అది అత డి చేతులకూ ఐంది. అది తాను అద్దే రంగే అని అతడు భ్రమప డ్డాడు.కంగారులో వాడది అంతగా గమనించలేదు. సూరప్ప ఇంటి వెనక కిటికీ చెంత దాగి గమనిం చగా, సూరప్ప ఇంటి కెళ్ళాక ఉంగరాన్ని ఎండు మిరపకా-యల బానలో దాచినట్లు తెలిసి పోయింది, సూరప్ప మిరపకా-రుకు దగ్గడం విన్నాను. అంతే ప్రభూ!" అని చెప్పిన విశ్వాస్ మాటలకు తృప్తిగా తల ఊపాడు మహామంత్రి.

తప్పు చేసినవాడు తడబడటం సహజం.

## రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంప వలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

- సంపాదకురాలు

చైతన్యం సంకల్ప బలం
Chaitanyam Sankalpabalam,
45058, Janapriya Utopia,
Hyderguda, Attapur
Hyderabad - 500 048

# నందుల ప్రభాకర శాస్త్రి



## మా ఊరి నందుల ఆత్మీయ కథ

(గత సంచిక తరువాయి)

ఏ పంటలు బాగా పండుతాయని పంచాంగంలో వ్రాసివుంటారో ఆ పంటలే రైతులు ఎక్కువ వేస్తారు.

అ తరువాత మొదలౌతాయి కందాయ ఫలితాలు. సామాన్యంగా జన్మ నక్షత్రాన్ని బట్టి కందాయ ఫలితాలు వుంటాయి. ఆ రోజుల్లో చాలామంది చాలామంది ఎప్పుడు పుట్టారో, ఏ రోజు పుట్టారో... ఏ సమయానికి పుట్టారో ... ఎవరూ పట్టించుకునేవారు కాదు. కేవలం కొన్ని కుటుంబాలకు మాత్రమే ఈ జాతకాలు పరిమితమయ్యేవి. అది కూడా సమయం చెప్పటానికి ఆ రోజుల్లో 'గడియారాలు' వుండేవి కావు. అందుకై నామనక్షత్రం, రాశి, గానం, చక్రం ప్రకారం గుణించేవారు.

జన్మనక్షత్రాలు లేనివారు నామనక్షత్రం ప్రకారం కందాయ ఫలాలు చూస్తారు. పేరులోని మొదటి అక్షరాన్ని బట్టి నక్షత్ర పాదము - గణము - దానికి తగిన జంతువు పేరు నిర్ణయిస్తారు. ఈ జంతువు సాదు జంతువా లేక క్రూరజంతువా అని నిర్ణయిస్తారు. ఉదాహరణకు చూ, చే, చో, లా అనే అక్షరాలకు సంబంధించిన అక్షరంతో పేరు మొదలైతే ఆయన లేదా ఆమె నక్షత్రం అశ్విని, పాదం నాలుగవ పాదం, మేషరాశి, దేవగానం, జంతువు గుఱ్ఱం, ఇలా లెక్కిస్తూ పోతారు. ఇలా ఒక మనిషి పేరును బట్టి దేవగానమా రాక్షస గానమా అని నిర్ణయించి, అందుకు సమానమైన జంతువులు గుఱ్ఱం, ఏనుగు, మేక, పాము, కుక్క, పిల్లి, ఎలుక, గోవు, దున్న, లేడి, కోతి, ముంగిస, సింహం మొదలైనవి నిర్ణయిస్తారు.

ఈ పేరు బలాలను బట్టి ఎవరి పేరులో ఎన్ని సున్నలున్నాయో, ఆదాయం ఎంతో, ఖర్చు ఎంతో, అవమానం ఎంతో, రాజ్యపూజ్యం ఎంతో నిర్ణయించి చెపుతారు. ఇవి తెలుసుకోవటానికి అందరూ ఎగబడతారు. చాలా పొద్దుపోయేవరకు తమ రాశి ఫలాలు తెలుసుకుంటూనే వుంటారు. ఈ వివరాలు ఆధారంగా పంటలు వేయటం, పెళ్ళిళ్ళు చేయటం చేస్తారు.

అయితే... మా నాయన మాత్రం 'పూర్తిగా దానిపైనే ఆధారపడవద్దు. ఎవరి కష్టాన్ని వాళ్ళు నమ్ముకోండి' అంటూ సలహా ఇచ్చేవాడు. ఆ రోజుల్లో నీలం సంజీవరెడ్డి, దామోదరం సంజీవయ్య గొప్ప రాజకీయ దురంధరులుగా వెలుగొందుతూ వుండేవారు. మా ఊర్లో కూడా దూదేకుల సంజీవయ్య వుండేవాడు. పేరు బలాలను బట్టి అయితే... 'ఈ సంజీవయ్య' కేంద్రంలోనైనా వుండాలి లేకుంటే .. ఆ ఇద్దరు సంజీవయ్యలు ఈ సంజీవయ్యలాగా దూది ఏకుతూ వుండాలి. అందుకే ఒక్క పేరు బలంతో అంటా జరిగిపోదు అనేవాడు.

(ఇంకా ఉంది)



# ఎలక్ట్రాన్

## ధన్వంతరి కారాగారం



శ్యామశాస్త్రికి వరసగా నలుగురు ఆడపిల్లలు. భార్య శకుంతలకి కత్తెర వేయకుండానే, తప్పనిసరి ప్రసవబాధలతోనే పుట్టేశారు. కొడుకు పుడ్తే వాణ్ణి డాక్టరుగా చేద్దామని శ్యామశాస్త్రి ఎన్నో కలలు కన్నాడు. అయితే ఆఖరి పిల్ల పుట్టినప్పుడు శకుంతల ఓవరీలు దెబ్బతినడం కారణంగా, మరో సంతానం వైపు దృష్టి సారించడం మంచిదికాదని వైద్యులు హెచ్చరించడంతో శ్యామశాస్త్రి ఆపరేషన్ బల్ల ఎక్కి, లభించే తాయిలాలను కూడా దృష్టిలో ఉంచుకొని నరాన్ని కోయించేసుకొన్నాడు. చేసే ఉద్యోగంలో ఒక ఇంక్రిమెంట్, ఆ ఊరి వ్యాపారసంఘం యిచ్చిన అయిదు కిలోల మేలు రకం బియ్యం, లైన్స్ క్లబ్ వారిచ్చిన ఒక కిలో అనిక్ నేతిడబ్బా లభించాయి. కొడుకు లేకుండా చేసినందుకు భగవంతుణ్ణి భర్త ఎదుట కోపగించుకొన్నా, శకుంతల లోలోపల పురిటి బాధలు తప్పాయని సంతోషించింది.

‘మగపురుగులే అన్నీ చదువులూ చదవాలా, అడచిలకలు ఎందుకు చదవకూడద?’ని భర్తతో భేటీ వేసుకొని పిల్లల చదువు విషయమై తగు శ్రద్ధ వహించింది. పిల్లకీ పిల్లకీ మధ్య రెండేళ్ళు అంతరముండడంతో పెద్దదానికి పదేళ్ళు వచ్చేసరికి ఆఖరి పిల్ల నాలుగేళ్ల నడకలు పట్టింది.

కాలమనేది ప్రతిక్షణమూ దాటుకుంటూ నెమ్మది నెమ్మదిగా ముందుకు నడిచినా, గతాన్ని తలుచుకొంటే సుఖదుఃఖాలతో, అనుభవాల పర్వాలతో జీవితకాలమంతా ఎంతో వేగంగా పయనించినట్లనిపిస్తుంది. రేపటికోసం ఎదురుచూసే నేడు



నెమ్మదిగా గడుస్తుంది. పెద్దపిల్ల వనమాల ఇంటర్ పరీక్షలిచ్చేసింది. ఏవిధమైన శిక్షణా పొంద కుండా స్వయం కృషితో ఎమ్సెట్ పరీక్ష కూడా రాసేసింది. ఫలితాలు ఆశాజనకంగా రాలేదు. ర్యాంకు మెరిట్ సీట్ల పరిధులకావలగా మొదటి ఇరవై మందిలో వచ్చింది. బాహాటంగా చెప్పకపోయినా ఆరు లక్షలు సమర్పించుకొంటే వచ్చే సీటు. ఆఫీసు ఋణమ్మీద కొన్న ఫ్లాట్ ని తండ్రి తాకట్టు పెడదామనుకొంటే నియమాలు ఒప్పుకోలేదు. అసలు ఆ విధమైన ఆలోచనకే వనమాల అభ్యంతరం తెలియజేసింది. శకుంతలకి స్త్రీ ధనంగా వచ్చిన ఒక ఎకరం భూమి అమ్మేసి, మెడికల్ సీటుకి డబ్బు కడదామని ఆలోచించినా వనమాల ఒప్పుకోలేదు. చెల్లెళ్ల సంగతికూడా ఆలోచించండి అని తల్లిదండ్రులకు హితోపదేశం చేసింది.

“మీయిద్దరికీ నా పేరు ముందు డాక్టరు హోదా చూడాలని తహతహగా ఉందని తెలుసు. వైద్యవిధానాలెన్నో ఉన్నాయి. అన్నింటికీ సంబధితమైన చదువనేది ఉంది. ఆంగ్లేయుల పరిపాలన రాక ముందు మనదేశంలో ఊన్న

వైద్యవిధానమేమిటి?" వనమాలి తల్లిదండ్రుల్ని మానసిక వ్యథనుంచి దృష్టి మరలించడానికి ఓ చిన్న ప్రయత్నంగా ప్రశ్నించింది. మౌలికంగా తన మూలాన తల్లిదండ్రులు తీర్చలేని అప్పుల పాలు పడకూడదు. ఆశించిన ఫలితం రాలేదని చింతపడకూడదు. తల్లిదండ్రులిద్దరూ మౌనం వహించారు.

"మీకు తెలుసున్నదల్లా లక్షలు సంపాదించే స్పెషలిస్ట్ డాక్టర్లూ, సూపర్ స్పెషాల్టీ హాస్పిటల్సూను. పూర్వకాలంలోలాగా మెడిసిన్ అనేది ఒక్క ఎం.బి.బి.ఎస్ తో టే ఆగిపోయేది కాదు. డాక్టరుగిరీ అనేది డాక్టరేట్ పట్టాతో కానీ ఆగటల్లేదు. ఆ లక్ష్యసాధనకీ డబ్బూ, దస్కమూ ఉండాలి. ఏవిధమైన వివాదాలూ చెలరేగకుండా ఉంటే, ఆరక్షణ విషయమై, లేదా ఇతరత్రా అలజడులు లేవకుండా ఉంటే, డింకీలు కొట్టకుండా ఉంటే కనీసం పదేళ్ళు! ఆ తర్వాత హోదాకి తగ్గట్టుగా, అర్హతలకి తగ్గట్టుగా ఏ డాక్టర్నో పెళ్ళాడాలి. డాక్టరు డిగ్రీ ఉన్న పురుషులతో పదోక్లాసు చదువుకున్న అమ్మాయిలతో పెళ్ళిళ్లు జరుగుతున్నాయి కానీ, బడిపంతుళ్లనీ, సామాన్య ఉద్యోగుల్నీ, వ్యవసాయం చేసుకొనే వారినీ వివాహమాడే స్త్రీ డాక్టర్ల సంఖ్య చెప్పండి."

"డిగ్రీ ఉంటే ఎవరైనా కళ్లకద్దుకొని పోటీలు పడి చేసుకుంటారు!" తల్లి ఆశాభావంతో అంది.



"అమ్మా! డాక్టరు దంపతుల వ్యవస్థకి మౌలికమైన మూల కారణం ధన సంపాదన. వాస్తవానికి ఈ సంస్కృతి ప్రస్తుత కాలంలో అన్ని వృత్తులవారికీ అన్వయించుకోవచ్చు. బ్యాంక్ ఉద్యోగులు, ఐఏఎస్ ఆఫీసర్లు, బడిపంతుళ్లు, శాస్త్రజ్ఞులు, సినీనటులు ఇలా అనేక రంగాల వారిలో ఏకవృత్తి వివాహవ్యవస్థ ఓ సమాజ ధోరణిగా మారిపోయింది.

అధికశాతం వివాహాలు ప్రేమ రూపంలో ముసుగేసుకొన్న ధనాకర్షణ లేదా ధనావసర వివాహాలే కాక కులాంతర, మతాంతర వివాహాలకి దారి తీస్తున్నాయి కూడా. ఆమోదమనేదికూడా ఎంతమంది తల్లిదండ్రుల అంతరంగాలలోంచి వస్తోందీ అంటే, అదీ ప్రశ్నార్థకమే?! సుబ్రహ్మణ్యంగారి డాక్టరమ్మాయి డాక్టర్ జాన్ అబ్రహాంని పెళ్లిచేసుకొన్నప్పుడు మీతో సహా మన వాడ వాడంతా చెవులు కోరుక్కోవడం మీరు మరిచిపోలేదనుకొంటాను."



"నీ మాటలన్నీ పెడసరంగా ఉన్నాయి. మీరు నలుగురూ పెద్దచదువులు చదువుకోవాలనుకోవడం దురాశ కాదు. అయితే మధ్య, దిగువ తరగతుల స్తోమతకి చాలా చదువులు అందుబాటులో లేకుండా పోయాయి. చదువుతున్న కాలేజీలోనే బి.ఎస్సీ. బోటనీకి అప్లై చెయ్యి. సీటుకి ఢోకా ఉండదు!" తండ్రి శ్యామశాస్త్రి అన్నాడు .

"నాన్నగారూ! నా మాట పూర్తిగా వినకుండానే మీరో నిర్ణయానికి వచ్చేశారు. మెడిసిన్ చదవడానికి కావల్సిన మెరిట్ ర్యాంక్ రాలేనందుకు నాకు విచారం లేదు."

(మిగిలినది వచ్చే సంచికలో)

# భువనచంద్ర



## చర్చ

ఈ లోకానికి నువ్వు పరిచయం చెయ్యబడ్డావు, 'ఫలానా వారికి కొడుకు/కూతురు పుట్టాడు/ పుట్టింది' అని. అలాగే ఈ లోకమూ నీకు పరిచయం చెయ్యబడ్డది.చీ...చీ.. ఇదిగో అమ్మ... అదుగో నాన్న..అదిగో అక్క.. ఇదిగో చెల్లి... అది ఆవు ...ఇది పిల్లి.. అక్కడిది పుస్తకం...... ఇది నీ నోరు... ఇది నీ ముక్కు... etc..etc... అని" తీరిగ్గా అన్నారు గడుసు మాస్టారు.

"అవును... అంతే కదా మరీ!" అన్నాడో మామూల్రావు.

"కాదు మరీ.. ఎవరో ఒకరు పరిచయం చెయ్యకపోతే యీ జీవులూ బంధువులూ వస్తువులూ ప్రకృతీ ఎలా పరిచయమవుతుందీ!" విశ్లేషించాడు సామాన్యమూర్తి.

"అవునవును. ఫలానా వాళ్ళే మన తల్లిదండ్రులని పుట్టంగానే తెలీదుగా!" తలవూపి అన్నది సౌందర్యలహరి గారు.

సభ అంతా ఉత్సాహంగా వుంది. కళకళలాడుతోంది. రోజూ పదిమందికి మించి రాని వాళ్ళు అవ్వాళ వంద మందికి పైగా వున్నారు. కారణం అక్కడికి వచ్చే శ్రీకృష్ణ దేవరాయల పుట్టినరోజు. ఆ సెలెబ్రేషన్ ఆశ్రమం ఆవరణలో జరుగుతోంది.

"అంతే కాదు... దేవుళ్ళనీ, దెయ్యాలనీ, స్వర్గాల్నీ, నరకాల్నీ కూడా మనకి పరిచయం చేయబడ్డవే" నవ్వుతూ అన్నారు గడుసుమాస్టారు.

"అంతేగా మరీ! ఓ అడవిలో పుట్టి, అక్కడే పెరిగిన వాడికి ఏం తెలుస్తుందీ, దెయ్యాల గురించీ, దేవతల గురించీ", 'మోగ్లె' కథలు బాగా చదివే శర్మగారన్నాడు.

"అవునూ, నరకాలు ఎన్నున్నా స్వర్గం ఒక్కటే గదా, మీరు 'స్వర్గాలు' అన్నారు", లా పాయింటు లాగాడు చిదంబరం. వృత్తి లాయరే.

"మామూలుగా అన్నాను లెండి. స్వర్గం ఒకటే అయినా స్వర్గ సుఖాలు వేరు వేరు గదా!" తేలిగ్గా నవ్వేశారు మాస్టారు.

"ఇంతకీ మీరు చెప్పదలచుకున్నది ఏమిటీ?" సూటిగా అడిగారు అల్లంశెట్టి సత్యనారాయణ. ఆయన మంచి వ్యవహర్త... ముక్కుసూటి మనిషి.

"నేను చెప్పదలచుకోలేదు. ఒక ప్రశ్నగాని ప్రశ్నని సమాధానం కాని సమాధానంగా మీ ముందు వుంచాను. మీరు అడిగారు కనక మీకు వివరిస్తూ నేను 'తెలుసుకునే' ప్రయత్నం చేస్తాను. ఈ లోకం మనకి పరిచయం చెయ్యబడ్డది. మనమూ లోకానికి పరిచయం కాబడ్డవాళ్ళం. పరిచయం అనేది ఎలాగోలా జరక్క తప్పదు. అయితే, మనిషి అసలు నేర్చుకోవలసింది ఏదా అని ఆలోచిస్తున్నాను" ఆగారు మాస్టారు.

"ఇదేదో చాలా బాగుంది. దేవుళ్ళు - దెయ్యాలూ కూడా పుట్టిన తరవాత పరిచయం కాబడ్డ వాళ్ళే. శాస్త్రాలూ, వేదాలూ, మతాలు మతగ్రంధాలు, పూజలు వ్రతాలు, ఉపవాసాలూ దీక్షలూ, చదువులూ చట్టుబండలూ అన్నీ పుట్టాకే గదా వచ్చాయి. ఇవన్నీ మనం బ్రతికున్నంత కాలం మన మనసుల్ని కొరుక్కుతింటూనే వుంటాయి. 'ఏది సత్యం ఏదసత్యం' అనే సంశయంలో మనల్ని ముంచితేలుస్తూనే వుంటాయి. ప్రాణంతో పాటు యీ ప్రశ్నలూ టప్పున ఎగిరిపోతాయి. మొదటా లేవు...చివరా లేవు. మధ్యలో వచ్చినవి మధ్యలోనే పోతాయి" గాఢంగా నిట్టూర్చి అన్నారు శాంతకుమారి.

అప్పటిదాకా పెద్దగా పట్టించుకోని కుర్రవాళ్ళు కూడా కొంచెం శ్రద్ధగా మాస్టారి దగ్గరకి చేరారు. అనవసరంగా, ఆడంబరంగా మైకు సిస్టం పెట్టినందుకు ఒకరిద్దరు శ్రీకృష్ణ దేవరాయల్ని మెచ్చుకున్నారు, ఆ క్షణంలో. మైకు వల్ల పదిమందికి వినబడటం లాభం అయితే, ఆ శబ్దం వల్ల కాన్సంట్రేషన్ దెబ్బతినడం నష్టం.

"అసలు మనిషి తెలుసుకోవలసింది ఏమిటీ, నేర్చుకోవలసింది ఏమిటీ? కోటీశ్వరుడికీ సామాన్యుడికీ, కూలివాడికీ వేదాంతికీ కూడా కష్టాలు, నష్టాలు, సమస్యలు, చికాకులు వుంటూనే వుంటాయి. ఎంత వేదాంతి అయినా నాస్తికుడైనా, మహాభక్తుడైనా చచ్చినట్టు కాలకృత్యాలు తీర్చుకోనక తప్పదు గదా. తిండి తినకా నిద్రపోకా తప్పదు గదా. పట్టుబట్టలు కట్టుకుని పూలమాలలు వేసుకుని ప్రవచనాలు చెప్పే మహానుభావుడైనా, ఎండనకా వాననకా చెప్పుల్లేని కాళ్ళలో స్వేదం ఇగిరిపోయేలా సేద్యం చేసి పదిమందికి ఆహారాన్ని పండించే రైతుకైనా రేయింబవళ్ళూ ఋతువులూ సూర్యచంద్రులూ ఒకరే గదా! వారి విజ్ఞానం వారికేం ఒరగబెట్టిందీ, వీరి అజ్ఞానం వీరినేం పడదోసిందీ? మృత్యువు ముందర ఇద్దరూ సమానమే!" మళ్ళీ ఆగారు గడుసుమాస్టారు.

ఓ నిశ్శబ్దం సభలో అలుముకొన్నది. అందరికీ రామగోవిందంగారు జ్ఞాపకం వచ్చారు. అజాత శతృవు ఆయన.

"చావు ఎక్కడినించో రాదు బాబూ.. మనం పుట్టిన క్షణం నించీ అది మనతోనే వుంది. మన 'శ్వాసలు' ఎన్నో లెక్కపెడుతూనే వుంటుంది. శ్వాసలు చెల్లగానే ఈ శరీరాన్ని ఇక్కడే వదిలించి, మరో కొత్త శరీరంలోకి అదే తీసుకుపోతుంది. భయం ఎందుకూ? కొత్తవాళ్ళు అయితే భయపడాలి. నిత్యం మనతోనే వుంటున్నదాని గురించి భయమెందుకూ?" అని చెప్పేవారు. అలాగే విశ్రాంతిగా, నిశ్చింతగా వెళ్ళిపోయారు.

"అవును, పుట్టుకా చావూ రెండూ ఒకటే. ప్రతి మృత్యువూ మరో జన్మకి బీజం వంటిదే!" నిర్లిప్తంగా అన్నాడు సామాన్యరావు.

"అసలు విషయం పక్కన పెడుతున్నాం" హెచ్చరించాడు అల్లంశెట్టి సత్యనారాయణ.

"ఈ కుతూహలం వుంది చూశారూ, ఇదో విచిత్రమైనది. ఇది సృష్టించినంత విజ్ఞానాన్ని ఏదీ సృష్టించలేదు. పక్షిని చూసి ఇది ఎలా ఎగురుతుందీ అని కుతూహలంతో విమానాన్ని కనిపెట్టాడు మనిషి. ఆ కుతూహలమే ఎన్నెన్నో కనిపెట్టడానికీ, మరెన్నెన్నో రహస్యాల్ని వెలికి తీసుకురావడానికీ ఉపయోగపడింది.

కానీ అయ్యా, ఈ కుతూహలమే అనంతమైన పనికిరాని పరిజ్ఞానాన్ని కూడా లోకానికి అందించింది. సరే. మనం పక్కకే వెడుతున్నాం. అసలు మనం వెతుకుతున్నది ఏదీ, అనేది మన మాటల్లోనించే బయటపడాలి. అంటే, మంచిదో చెడ్డదో ఏదో చర్చ జరుగుతూ వుండాలి. అది పక్కనున్న వాళ్ళతో కావచ్చు... లేక మనతో మనకే కావచ్చు" చిన్నగా నవ్వి అన్నారు మాస్టారు.

"మనలో మనకా? అంటే?" అడిగారు అల్లంశెట్టి.

"మన మనసుతోటే మనం చర్చించాలని నా ఉద్దేశ్యం. ఓ పాట వ్రాయాలంటే రచయిత తనలోనే మథనం సాగించాలి. ఓ బిల్డింగ్ ని డిజైన్ చెయ్యాలంటే, ఆ బిల్డింగ్ ని ఇంజనీర్ తన మనసులోనే మొదట ఊహించి నిర్మించుకోవాలి. అసలు ఏది కార్యరూపం దాల్చాలన్నా దాని మోడల్ ముందు మనసులో తయారు కావాలి" వివరించారు గడుసు మాస్టారు.

"సార్ .. నమస్తే. నా పేరు కుంచితపాదం... మద్రాసులో పొట్టి శ్రీరాములు గారు ఆమరణ నిరాహారదీక్ష చేసింది మా ఇంట్లోనే. మా తాతగారి ఇల్లది. ఆయన పేరూ కుంచితపాదమే. ఆ ఇంట్లోనే మహర్షి బులుసు సాంబమూర్తిగారు వుండేవారు. పొట్టి శ్రీరాములు గారు నిరాహారదీక్ష చేస్తానంటే, ఎవరూ ఆయనకి చోటు ఇవ్వలేదట. అప్పుడు సాంబమూర్తిగారు తను అద్దెకుంటున్న మా ఇంట్లోనే నిరాహారదీక్ష చెయ్యడానికి చోటిచ్చారట. 58 రోజులు నిరాహారదీక్ష చేసి ఆయన ఆత్మబలిదానం చేసుకున్నాకే ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. ఆయన ఆత్మార్పణ చేసింది మద్రాస్ సహిత ఆంధ్రప్రదేశ్ కోసం. స్వార్థం విచక్షణను విస్మరించింది. మద్రాస్ తమిళుల పాలైంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రెండు ముక్కలయింది" వివరించాడా కొత్త వ్యక్తి.

"మీకు నేనెలా తెలుసూ?" అడిగారు మాస్టారు.

"కొంతకాలం మీరు మద్రాస్ మైలాపూర్ లో వుండేవారు కదా... అప్పుడు మిమ్మల్ని చూసేవాడ్ని", చెప్పాడతను.

"మీరు చెప్పింది నిజమే. ఆ బిల్డింగునే ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటు

కొని, పొట్టి శ్రీరాములు మెమోరియల్ గా మార్చింది. అక్కడే పొట్టి శ్రీరాములు గారు పరమపదించిన చోటుంది. ఓ గొప్ప లైబ్రరీ కూడా వుంది", సాదరంగా అతన్ని కూర్చోబెట్టి అన్నారు మాస్టారు.

"సారీ, మీరేదో డిస్కషన్లో వున్నారు", కొంచెం సిగ్గుపడి అన్నారు కుంచితపాదం.

"లేదు లేదు. ఒక విధంగా నాకు ఓ జవాబు దొరికింది. ఇన్ని కోట్లమంది తెలుగువారుండగా ఆయన మాత్రమే ఆంధ్రా కోసం ఆత్మబలిదానం ఎందుకు చెయ్యాలి? సరే చేశారు. ఫలితం? రౌడీలు, గూండాలు, అవినీతి నాయకుల విగ్రహాలు ఎక్కడబడితే అక్కడ వెలుస్తున్నాయి. మరి శ్రీరాములుగారి విగ్రహం ఎక్కడా కనపడదేం? అంతేగాదు, ఆయన త్యాగఫలంతో ఏర్పడ్డ ఆంధ్రప్రదేశ్ కూడా నిన్నగాక మొన్న రెండు ముక్కలెందుకయిందీ? అయ్యా వీటికి కారణం మనుషుల స్వార్ధం అనాలా, విధివిలాసం అనాలా? మనిషి బుద్ధిజీవి. ఆ బుద్ధికి ప్రతిక్షణం 'మాయ' అనే గ్రహణం ఎందుకు పడుతోందీ? మనిషి దేనికి బానిస అవుతున్నాడూ? అసలు మనిషి తనని తాను సంస్కరించుకుంటున్నాడా లేక తను కట్టుకున్న గూట్లో తానే చిక్కు పడుతున్నాడా?", సాలోచనగా అన్నారు మాస్టారు.

"ఓవిధంగా ఓ ఆదర్శవంతమైన కుటుంబం ఎలా ఉండాలో రామాయణం చెప్పింది. అన్న అంటే రాముడిలాగా, తమ్ముడంటే లక్ష్మణుడిలాగా, బంటు అంటే ఆంజనేయుడిలాగా, భార్య అంటే సీతలాగా ఇలా కుటుంబంలోని వ్యక్తుల స్వభావాలు ఎలా ఉండాలో చెప్పింది రామాయణం. అలాగే అన్నదమ్ములంటే రామలక్ష్మణుల్లా ఉండాలిగానీ, వాలిసుగ్రీవుల్లా ఉండకూడదనీ, సేవకుడంటే హనుమంతుడిలా వుండాలి గానీ, మంధరలా ఉండకూడదనీ కూడా బోధించింది, బలాన్నీ జ్ఞానాన్నీ ఎంత పెంపొందించుకున్నా, ఎన్ని అస్త్రశాస్త్రాల్ని లభింపజేసుకున్నా... రావణాసురుడిలా సర్వాన్నీ ఒక్క బలహీనత కోసం సర్వనాశనం చేసుకోకూడదనీ రామాయణమే బోధించింది. అంతేకాదు, మనిషి ఎటువంటివాడైనా కష్టనష్టాలూ, సమస్యలూ తప్పవనీ, వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవాలనీ రామాయణమే బోధించింది. ఒకవిధంగా ఆలోచిస్తే మానవుడు ఎవరివల్ల, లేక ఏ చైతన్యం వల్ల జీవిస్తున్నాడో ఆ చైతన్యానికి కృతజ్ఞులుగా వుండమనే చెప్పింది కానీ, ఆ చైతన్యానికి లక్షా తొంభై పేర్లు పెట్టి వ్యక్తిపూజ చెయ్యమని ఏనాడూ చెప్పలేదు. అయ్యా, ఎక్కడో మొదలెట్టాం... ఎక్కడికో వచ్చాం. మన ప్రశ్నకి సమాధానం స్ఫురిస్తుందనే ఆశతో ఇప్పటికి చాలించి భోజనానికి లేద్దాం", అంటూ లేచారు మాస్టారు.

మళ్ళీ కలుద్దాం,

భువనచంద్ర

## రచయితలకు విజ్ఞప్తి

రచనలు పంపువారు తమ స్వీయ రచన అని ధృవీకరణ పత్రం వ్రాసి, ఫోటోలు జతచేసి పంప వలెను. అనువాదాలు స్వీకరించ బడవు. ప్రచురణకు ఎన్నిక కానివి తిరిగి వెనక్కి పంప బడవు. సామాజిక రచనలకు ప్రాధాన్యత ఇవ్వ బడును.

- సంపాదకురాలు


చైతన్యం సంకల్ప బలం

**చందా రేట్లు**

| | |
|---|---|
| విడిప్రతి | రూ. 20.00 |
| సంవత్సరానికి | రూ. 200.00 |
| పోస్ట్ ద్వారా | రూ. 230.00 |

Please deposit your subscription in favour of
**CHAITANYAM SANKALPABALAM**
**A/c No. 1626201002070 - Canara Bank**
Kundanbagh Branch, Hyderabad

చందాలు పంపాల్సిన చిరునామా:

Chaitanyam Sankalpabalam,
45058, Janapriya Utopia,
Hyderguda, Attapur
Hyderabad - 500 048

Email: teega51@gmail.com
visit: www.chaitanyam.net

# ప్రహేళిక

## జవాబు చెప్పగలరా?

ఈ క్రింది వాక్యములలోని ప్రతి అక్షరము, అసలు అక్షరమునకు బదులు వేరే అక్షరము వాడబడినది. ఉదాహరణకు, 'క' అనే అసలు అక్షరం బదులు 'ర' అనే అక్షరం వాడారని మీరు అనుకుంటే, ఈ వాక్యములలో ఎక్కడ 'ర' వచ్చినా దాని అసలు అక్షరం 'క' మాత్రమే అవుతుంది. వత్తులు, గుణింతాలు అన్నీ అన్వయిస్తాయి.

మీరు చెయ్యవలసినదల్లా అసలు వాక్యాన్ని కనుక్కోవడమే. ప్రయత్నించండి.

( ఆధారం : ట = అసలు అక్షరం 'న' )

మండజే దొద్దిడి వాటి - మయబు వాటట్టైడి
రిండన ష్యక్షయి టీగే - రిను చరలూతగే.

1. బాండ దటువొంతజు - బతబు టెబ్బిడివాటి
రెండైటా సోహణు సెన్లు - రెబ్బజేట్టైడి,
ఇండన లగ్గటసటే - ఇతగి దొద్దిడివాటి
మండడ క్షయి ఖబ్డటే - మంలీగి వాటట్టైడి.

(మీ జవాబు teega51@ gmail. com కి పంపించండి.)

**గతనెల జవాబు :**

ఊరకే దొరకునా - ఉన్నతోన్నత సుఖము
సారంబు దెలిసి కా - జయము చేకొనుట
1. తలపు లోపలి చింత - దాటినప్పుడు గదా!
అలరి దైవంబు ప్ర - త్యక్ష మౌట
కలుషంపు దుర్మదము - గడచినప్పుడు గదా !
తలకొన్న మోక్షంబు - తనకు జే పడుట

మార్చి నెల ప్రహేళికకు సరియైన జవాబు పంపినవారు: శ్రీ కె రత్నబాబు, ఏలూరు

# కొత్త రామానందం



## తెలుగువారి అయోధ్య - భద్రాచలం

భూమిపై ధర్మహాని జరిగినపుడు, అన్యాయం, అత్యాచారం, దురాచారం పెరిగినప్పుడు, దుర్మార్గులను సంహరించి, సన్మార్గులనూ, భక్తులనూ సంరక్షించడానికి భగవంతుడు అవతార పురుషుడుగా జన్మిస్తానని భగవద్గీతలో చెప్పబడినది.



శ్రీ మహావిష్ణువు రావణ సంహారం కోసం ఈ భూమిపై అయోధ్యాపతి దశరధ పుత్రునిగా అవతరించాడు. వైకుంఠవాసుడు రామావతారంలో మానవుడిగా అవతరించాడు. తనకు నరవానరుల చేత తప్ప మిగిలిన ప్రాణుల చేత మరణం లేకుండా వరాన్ని పొందిన రావణుని సంహరించటానికి, ఒక నరుడిగా జన్మించాడు. శ్రీరాముడు ఏకపత్నీ వ్రతుడగుట చేతనే, పరస్త్రీ వ్యామోహితుడైన రావణుని చంపగలిగాడు. ఈ అవతారంలో మహాలక్ష్మి కూడా పాత్ర వహించింది.

గోస్వామి తులసీదాసు 'రామ' శబ్దం సృష్టి, స్థితి, లయ కారకులైన బ్రహ్మ విష్ణు మహేశ్వరులుగా వివరించాడు. రామనామమందలి రామ అనే రెండు అక్షరములు మధురములు, మనోహరములు. రా మ అనే అక్షరాలలో ఒకటి ఛత్రము, రెండవది మకుటము. భవసాగర తరణానికి తారకం రామ శబ్దమని పెద్దల నమ్మిక. సహస్ర సంఖ్య గల విష్ణునామాలను చదివే అవకాశం లేనపుడు 'రామ' నామమొక్కసారి స్మరిస్తే చాలునని భగవాన్

శంకరుల ఉవాచ. శ్రీరాముడు కళ్యాణ గుణధాముడు, పావన చరితుడు, ఏక పత్నీవ్రతుడు, పితృవాక్య పరిపాలకుడు, జననీ జనకులను, పెద్దలను గౌరవించేవాడు, భ్రాతృ ప్రేమ, స్నేహ శీలత్వం కలిగిన ధర్మాత్ముడు, సత్యవ్రతుడు, విద్వాంసుడు, భూతదయ కలవాడు, సమర్థుడు, ధృతిమంతుడు, అనసూయుడు, ప్రియదర్శనుడు, ఇలాంటి లక్షణాలు కలవాడు. సీతారాముల దాంపత్యం లోకానికి ఆదర్శవంతమైనది.




భారతీయ పౌరాణికరాజమైన రామాయణం, విశ్వానికి ఆధారం ధర్మం. ఆ ధర్మాన్ని ప్రతిష్ఠించినది వేదం. వేదవేద్యుడగు పరమ పురుషుడు శ్రీరాముడు, నీలమేఘుడు కోదండరాముడు ప్రపం చమంతా పవిత్ర కావ్యంగా పుణ్యప్రదమయినది. తెలుగు భాషలో అనేక రామాయణ గ్రంథాలు వెలువడినవి. శ్రీరామచంద్రుడు మనిషిగా పుట్టి చక్రవర్తి కుమారునిగా పెరిగి కష్ట సుఖాలను రుచి చూసినవాడు. సాక్షాత్తు ధర్మమే రామునిగా పోత పోసుకుని, యుగాలుగా మానవ జాతికి ఆదర్శంగా నిలిచాడు. మన తెలుగువారికి ఆరాధ్యమయ్యాడు. ఆ స్వామికి మన తెలుగునాట ఊరు ఊరునా కోవెలలే. రామభద్రుడు యదార్థము గల పరమాత్మ, జానకి నర చిత్తము, దశ శిరస్సులు గల రావణుడింద్రయ దశకము. శ్రీరామముద్ర తారక మంత్రము, రామ దండయాత్ర పరబ్రహ్మ కృపా ప్రాప్తి. ఇది రామాయణమునకు వేదాంతార్థము.

వశిష్ఠ మహర్షి సలహానుసరించి దశరథ మహారాజు ఋష్యశృంగుని సారథ్యంలో పుత్రకామేష్టి యాగం చేశాడు. పన్నెండు నెలల తరువాత శ్రీ మహావిష్ణువు అంశతో శ్రీరాముడు కౌసల్య గర్భంలో, చైత్ర శుద్ధ నవమి తిథిలో పునర్వసు నక్షత్రం నాలుగవ పాదంలో గురువు, చంద్రుడు కలిసియున్న కర్కాటక లగ్నంలో అవతరించాడు. రాముడు ఒక బాలుడిగా ముగ్గురమ్మల ప్రేమను చూరగొన్నాడు. దశరథుడు రాముని అమితంగా ప్రేమించి తన ప్రాణసమానంగా పెంచాడు.

శ్రీరాముడు బాలునిగా ఉన్నప్పుడే, విశ్వామిత్రుడు దశరథుని దగ్గరకు వచ్చి తాను చేయనున్న యాగాన్ని రక్షించడానికి అతడిని పంపమని కోరతాడు. విశ్వామిత్రుడు రామలక్ష్మణులను తన వెంట తీసుకొని అనేక విద్యలు, రాజకీయ సూక్ష్మాలు చెప్పి అనేక అస్త్ర శాస్త్రాలు బహుకరించాడు. అతి బల మంత్రములు ఉపదేశించాడు. విశ్వామిత్రుని యాగ సంరక్షణ పూర్తి అయిన పిమ్మట విశ్వామిత్రునితో కలసి సీతా స్వయంవరంలో పాల్గొన్నాడు. విశ్వామిత్రుని ఆశీస్సులతో రాముడు ధనుస్సు విరిచాడు. సీత రాముని వరించింది. రామునికి సీత స్వయంవర కానుక. అంతరంగా చూసినప్పుడు పరమాత్మ పరమ చైతన్య శక్తుల కలయిక. సాధ్య

సాధకముల చేరికయే సీతా-రాముల కల్యాణం. రాముని వివాహం శాస్త్రోక్తంగా పెద్దల సమ-క్షంలో జరిగింది. జనక మహారాజు తన చిన్న కూతురు ఊర్మిళను లక్ష్మణుని భార్యగా అర్పించాడు. జనకుని సోదరుడు కుశధ్వజుడు. అతని కుమార్తెలు మాండవి, శ్రు-తకీర్తి అన్న మాటపై వారిని భరత శత్రుఘ్నులకు భార్యలుగా చేసి ధన్యుడయ్యాడు.

జనకుని గారాల బిడ్డ అయిన మహాసాధ్వి. శివ ధనుర్భంగం గావించిన శ్రీరాముని మెడలో వరమాల వేసి, రామపత్నియై, అత్తమామల ఇంట అందరి ప్రేమకు పాత్రురాలైన వనితా శిరోమణి.

దైవ కోరిక ప్రకారం, పితృవాక్య పరిపాలన కోసం వనవాసం చేసి 'మాతృ దేవో భవ, పితృ దేవో భవ' అనే వేదవాక్కులకు ఖచ్చితమైన భాష్యం చెప్పినవాడు శ్రీరాము-డు. ఇలా రామాయణంలో అడు-గడుగునా ఒకే సతి, ఒకే మాట, ఒకే బాణమనే శ్రీరాముని సద్గుణ సంపద, స్నేహానురక్తి, ప్రతిజ్ఞా పాలన, శిష్ట రక్షణ, ఔదార్యం చాటి చెబుతాయి. నేటికీ అవి ఆదర్శ ప్రాయాలే.

సీతారామ లక్ష్మణులు వనవాసా-నికేగారు. సీతారామ లక్ష్మణులను అయోధ్యకు తిరిగి తీసుకురా-వాలని భరతుడు గంగా తీరానికి వచ్చి, రమ్మనమని అర్థించగా, అతని కోరికను తృణప్రాయంగా నిరాకరించి, అతనిని తృప్తి పర-చేందుకు తన పాదుకలనిచ్చి, అనుగ్రహించాడు. ఆ పాదు-కలను సింహాసనంపై ఉంచిన భరతుడు శ్రీరాముని ప్రతినిధి-గా పదునాలుగు సంవత్సరాలు అయోధ్యను పరిపాలించాడు.

గోదావరీ నదీతీరాన పంచవటి సుందర ప్రాంతమందు సీతారా-ములు పర్ణశాలను నిర్మించుకు-ని ఉన్న సమయంలో, రావణుని సోదరి శూర్పణఖ సలహాపై రాముని పత్నియైన సీతను చెర-పట్టుటకు నిశ్చయించి సాధువు రూపంలో వచ్చి, ఆమెను అప-హరించి లంకకు తోడ్కొని పోయి అశోకవనంలో ఉంచి తనను వివాహం చేసుకోమంటాడు. ఆమె అతని కోరికను నిరాకరిం-చింది.

రామలక్ష్మణులు సీతాన్వే-షణలో పలు ప్రదేశాలు సం-దర్శిస్తూ కిష్కింద పర్వత ప్రాంతానికి చేరుకోగా అచ్చట వా-యునందనుడైన హనుమంతు-డు తారసపడటం, అతని ద్వారా సుగ్రీవునితో మిత్రత్వం పొందటం జరిగింది. సుగ్రీవునితో జరిగిన మైత్రి ఒప్పందంమేరకు వాలిని సంహరించి, వాలి చెరబట్టిన సుగ్రీవుని భార్యను అప్పగిస్తాడు శ్రీరాముడు. సుగ్రీవుడు కూడా తన మిత్రుడు ఆంజనేయుని సీతాన్వేషణ నిమిత్తం లంకాన-గారానికి పంపిస్తాడు. సముద్రాన్ని లంఘిస్తాడు. సీత జాడను తెలు-సుకుంటాడు. ఆమెకు రామచం-ద్రమూర్తి ఇచ్చిన చూడామణిని వినమ్రంగా అందజేశాడు. తిరిగి వచ్చిన హనుమంతుని దగ్గరకు తీసుకుని ఆలింగనం చేసుకు-న్నాడు శ్రీరాముడు.

ఆ పిమ్మట జరిగిన రామ-రావణ యుద్ధంలో రావణుడు హతమయ్యాడు. లంకానగరానికి విభీషణుని రాజ్యాభిషిక్తుని చేసి, అయోధ్య జేరి పట్టాభిషిక్తుడైనా-డు. రాముని అవతార లక్ష్యం నె-రవేరింది.

**అభయ ప్రదానమే భద్రాద్రి రామ తత్త్వం**

సీతారామలక్ష్మణ సమేతుడైన రాముడు తన వనవాస కాలంలో ఒక శిలాతలంపై విశ్రమించాడు. ఎంతో ప్రీతితో ఆ శిలాతలాన్ని ఆశీర్వదించాడు. ఆ శిలాతలం మరుజన్మలో మేరు దంపతులకు బ్రహ్మ వర ప్రసాదంతో పుత్రునిగా జన్మించడం జరిగింది. భద్రుడ-నే పేరుతో రామభక్తిపరుడై రామ సందర్శనాకాంక్షతో ఘోర తపస్సు చేశాడు. ఆ భక్తుని తపస్సుకి మెచ్చి శ్రీమన్నారాయణుడు శేష పాన్పు వీడి, శంఖ చక్రములు, శ్రీరాముని రూపంలో, సీతాదేవి లక్ష్మణ సమేతుడై భద్రుని ఎదుట ప్రత్యక్షమయ్యాడు. శ్రీరామచం-ద్రుని దర్శించిన భద్రుడు పు-లకాంతుడయ్యాడు. అప్పుడు భద్రుడు 'శ్రీరామచంద్రా! జా-నకీపతీ! నీ దర్శనం చేత నేను తరించాను. నిన్ను నా శిరస్సున

దాల్చే భాగ్యాన్ని అనుగ్రహించు అదే చాలు!" అని మనసారా ప్రార్థించాడు. శ్రీరామచంద్రుడు 'అట్లే అగుకాక!' సీతాలక్ష్మణ సమేతంగా నేను ఆచంద్రార్కంగా నీ శిరస్సు పైనే నిలిచియుంటాను. నిన్ను 'భద్ర' అని ముందు పిలిచాను గనక, నీకు అ పేరే స్థిరమై 'భద్రాచల' మనే పేరు పొందుతావు. దివ్య స్థలాలలో నీకు అగ్రస్థానం లభిస్తుంది' అని వరమిచ్చాడు. అంత భద్రుడు 'స్వామీ! మీరు చెప్పినవి ఎప్పుడో జరిగేవరకు నేను నిరీక్షించజాలను. తక్షణమే నన్ను వధించి ముక్తినివ్వ గోరుతున్నాను' అని ప్రార్థించాడు. రామభద్రుడు వెంటనే తన అస్త్రముతో భద్రుని శిరసు ఖండిస్తూ, పర్వతమై వెలయు నీకు భద్రాచలమనే పేరు రాగలదని వరమిచ్చాడు.

భద్రాచలమునకు రెండు మైళ్ళ దూరంలోని ఒక గ్రామంలో పోకల దమ్మక్క అనే భక్తురాలు ఉండేది. నిత్యం శ్రీరామ నామ పారాయణంతో గడుపుతున్న ఆమెకు కలలో శ్రీమన్నారాయణుడు సాక్షాత్కరించి, 'నేను శ్రీరాముడనై సీతా లక్ష్మణులతో భద్రాద్రిలో కొలువై ఉన్నాను. కొంత కాలం తరువాత ఒక భక్తుడు వచ్చి నాకు ఆలయాన్ని నిర్మించే వరకు, నువ్వు నిత్యం ధూప దీప నైవేద్యాలను సమర్పిస్తూ నన్ను సేవించు' అని ఆనతినిచ్చాడు. దమ్మక్క అమిత సంతోషం పొంది గ్రామస్తులకు ఈ వార్త తెలియజేసింది. వారందరూ ఆనందంతో మేళతాళాలతో స్వామి విగ్రహాలను కనుగొని, వాటికి సంప్రోక్షణ చేయించి రామ భజన చేస్తూ కొండపైన చిన్న తాటాకు గుడిసె నిర్మించి అందు విగ్రహాలను ఉంచి నిత్యపూజలు, నివేదనలు దమ్మక్క చేయసాగింది.

తానీషా నవాబు పాలవంచ తాలూకాకు తహసీల్దారుగా కంచర్ల గోపన్నను నియమించారు. అప్పటికి భద్రాద్రి పాలవంచ పరగణాలపై ఆరు లక్షల పైకం బాకీ వుంది. దాన్ని ఎవ్వరూ వసూలు చేయలేకపోయారు. యీ గోపన్న సులువుగా ఆ బకాయి ఆరు లక్షలను వసూలు చేసాడు. అలా వసూలైన సొమ్ముతో శ్రీ రామాలయం నిర్మాణం గావించారు. భరతునికి పచ్చల పతకము, శత్రుఘ్నునికి మొలత్రాడు, లక్ష్మణునికి ముత్యాల పతకము, సీతమ్మ వారికి చింతాకు పతకము, శ్రీరాములవారికి కలికి తురాయి మున్నగు ఆభరణాలను చేయించాడు. తానీషా అనుమతి లేకుండా ఆలయాన్ని నిర్మించుటచే గోపన్నపై రాజద్రోహ నేరం మోపబడి చెరసాలలో ఉంచి చాలా బాధించారు. గోపన్న రామచంద్రుని పలువిధాలుగా ప్రార్థించాడు. అభ్యర్థించాడు. చివరకు దూషించి, సీతమ్మ తల్లితో తన కష్టాలను మొరపెట్టుకున్నాడు. ఈ పరిస్థితుల్లో శ్రీరామలక్ష్మణులు తానీషాకు కలలో కనిపించి గోపన్న కట్టినట్టుగా 'రామ మాడ' రూపంలో బంగారు నాణేల రసీదు చూపించారట. వెంటనే విడిపించమని చెప్పి అదృశ్యమైపోయారు. ఉదయాన్నే తానీషా స్వయంగా గోపన్న బందిఖానాకు వచ్చి విడిపించాడు. ఆయనకు లెక్కలేనన్ని బహుమతులను ఇచ్చి సత్కరించి తిరిగి తహసీల్దారుగా నియమించారట. రాముని మీద ఉన్న భక్తే గోపన్నను రామదాసుగా మార్చింది. కబీర్ దాస్ ఇక్కడికి వచ్చి శ్రీరాముని దర్శనం చేసుకున్నారట. భద్రాచలమంటే మనకు రామదాసే గుర్తుకొస్తుంటాడు.

## అపురూప ఆలయం

మెట్లెక్కి ప్రధాన ఆలయానికి చేరుకోగానే ఉన్నతమైన గోపురం దర్శనమిస్తుంది. ప్రధాన ఆలయానికి ముందు భాగంలో శ్రీఆంజనేయస్వామి వారి ఆలయం ఉంది. ఆలయానికి ఉత్తరాన చతుర్భుజాలతో శ్రీ కనకవల్లి (లక్ష్మి) తాయారు కొలువై ఉంటుంది. దక్షిణ భాగాన క్షేత్ర పాలకుడైన కాశీ విశ్వనాథస్వామి వారు దర్శనమిస్తారు. ఆలయానికి వెనుక ఉన్న భద్రాలయం లోని బండను భద్రుని తలగా, ఆ తలపై ఉన్న పాదముద్రలు శ్రీరామునివిగా కనిపిస్తూ నాటి దృశ్యాన్ని మన కళ్ళ ముందుంచుతు-

న్నాయి.

ఇక్కడ దేవదేవుడైన శ్రీ రఘు-రాముడు సీత లక్ష్మణ సమేతుడై, తన వైభవ వైకుంఠ సహజ సుందర రూపంలో భాగమైన చతుర్భుజాలతో, అపసవ్య శస్త్ర ధారణలతో, అనగా పై కుడి చేతిలో శంఖం, ఎడమ చేతిలో చక్రం, క్రింద కుడి చేతిలో అభ-యముద్ర,ఎడమ చేతిలో ధనువు ధరించి - పర్వత రూపంలో ఉన్న తన ఆప్త భక్తుడైన భద్రునికి దర్శనమీయడం, దేశంలో వే-రెక్కడా లేని విధంగా భద్రాచలం ఆలయంలో కొలువు తీరిన చతు-ర్భుజ రాముని దివ్య మంగళ వి-గ్రహాన్ని మనమందరం తిలకిం-చవచ్చును. ఇచ్చట రాములవారి ఎడమ కాలు తొడపై సీతమ్మవా-రు కూర్చుని ఉంటుంది. చెంతనే లక్ష్మణ స్వామివారు నిలబడి ఉన్న భంగిమలో కానవస్తారు. ఈ ఆల-యానికి శ్రీరామ భక్తాగ్రేశ్వరుడైన రామదాసు ఆలయ నిర్మాణం కోసం జీవిత సర్వస్వాన్ని అర్పిం-చారు.

అటువంటి భద్రాచల క్షేత్ర మహిమ ఎంత చెప్పినా తరుగని-ది. శతకోటి ప్రవిస్తరమైనది. శ్రీరా-ముని పునీత చరిత్ర - అందులో ఒక్క అక్షరం చదివినా మహా-పాతకములు నాశనం కాగలవు. ఇక్కడున్న పశుపక్ష్యాదులు, వృక్షాలు, గిరులు కూడా శ్రీరామ-చంద్రుని సేవలో తమ జన్మలను చరితార్థం చేసుకుంటాయనేది నిజం. అంత దాకా ఎందుకు, గోదావరి నది సైతం స్వామి కొలువై ఉన్న భద్రచాలాన్ని ప్రద-క్షిణ చేస్తూ పునీతము అయింది.

ఈ ఆలయంలో సంవత్సరం పొడుగునా ఉత్సవాలు జరుగు-తూనే ఉంటాయి. శ్రీరామనవ-మి నాడు శ్రీసీతారామ కల్యాణం, వైకుంఠ ఏకాదశి నాడు వైకుంఠ ద్వార దర్శనం, దశావతార అలం-కరణలు, తెప్పోత్సవం, దసరా ఉత్సవాలు, స్వామివారికి నిత్యక-ల్యాణ ఉత్సవములు అత్యద్భు-తంగా నిర్వహిస్తారు.

## సీతారామ కల్యాణం

భద్రాద్రి లోని సీతారామ కల్యాణం శ్రీరామనవమి పర్వ-దినాన జరుగుతుంది. అష్టమి తిథితో కూడిన నవమి తిథినాడు మాత్రమే శ్రీరామనవమిని ఆచ-రించడం సంప్రదాయం. త్రేతా-యుగంలోని శ్రీరామ జన్మదినమే భద్రాద్రి రాముడు ఆవిర్భవించిన దినంగా పరిగణించి శ్రీరామ నవమి నాడే సీతారామ కల్యాణం జరగాలని నిర్ణయించారు. భద్రా-చలంలో సీతారామకల్యాణం జరిపే రోజునే ఉభయ తెలుగు రాష్ట్ర దేవాలయాలలో కళ్యాణ వేడుకలు నిర్వహిస్తారు.

భద్రాద్రిలో వసంత నవరాత్రి ప్రయుక్తంగా శ్రీరామనవని ఉత్స-వాలు అనుసంధానం చేస్తారు. భద్రాద్రి మిథిలా నగరంగా మారి-పోతుంది. కళ్యాణ మండపంలో నేత్రోత్సవంగా లక్షలాది భక్తుల సమక్షంలో వేసవిలో కడు కమ-నీయంగా కల్యాణం రెండు గం-టలపాటు అర్చక స్వాములు కడు శాస్త్రీయంగా నిర్వహిస్తారు. అమ్మ సీతమ్మ వారిని పట్టు వస్త్రాలతో మల్లెపూల జడ మరింత అం-దాన్నిస్తుంది. పరిణయ మహో-త్సవములో అమ్మవారికి మూడు మంగళసూత్రాలను అలంకరి-స్తారు. తిరుమల తిరుపతి దే-వస్థానం వారు నూతన వస్త్రాలు, ముత్యాలు సమర్పిస్తారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ముత్యాల తలం-బ్రాలను, పట్టు వస్త్రాలను శిరస్సు-పై ఓ ప్రత్యేక పళ్ళెంలో ఉంచుకుని కళ్యాణ రామునికి సభక్తికంగా సమర్పిస్తారు. వివిధ ప్రాంతా-లకు చెందిన భక్తులు వరిగిం-జలను ఒలిపి బియ్యాన్ని ఈ వివాహంలో తలంబ్రాలుగా పం-పిస్తారు. కల్యాణం తిలకించుట-కు విచ్చేసిన భక్తులకు తలంబ్రా-లను ప్రసాదంగా అందజేస్తారు. రామదాసు చేయించిన నగలు వధూవరులకు అలంకరిస్తారు. శ్రీరాముడు తెలుగువారి ఇలవే-లుపు. సీతమ్మ తెలుగింటి ఆడప-డుచు. సీతారామ కల్యాణం తిల-కించడం జయకరం, శుభకరం, సకల సన్మంగళ దాయకం.

*ది. 14-4-2019 శ్రీరామనవమి.*

# జనార్ధన ఠాకూర్



## రాశి ఫలాలు

ఏప్రిల్ నెలలో: రవి మాసారంభంలో మీన రాశిలో, తదుపరి 14 వ తేదీన మేషరాశిలో ప్రవేశం;
కుజుడు వృషభ రాశిలో సంచారం; బుధుడు ప్రారంభంలో కుంభరాశిలో సంచారం, ఏప్రిల్ 10 న మీన-రాశిలో ప్రవేశం; శుక్రుడు మాస ప్రారంభంలో కుంభరాశిలో, తదుపరి ఏప్రిల్ 14 న మీనరాశిలో ప్రవేశం;
గురువు ధనస్సులో వక్ర సంచారం; శని ధనస్సులో సంచారం;
రాహువు మిథునంలో; కేతువు ధనురాశిలో సంచారం

**మేష రాశి:** ఈమాసంలో ఆర్థికంగా బాగున్నా సరియైన ఆర్థిక ప్రణాళిక రచించవలెను. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. కుటుంబసభ్యులతో మనస్పర్ధలు వచ్చును. దానివలన గృహంలో అశాంతి నెలకొనును. ఉద్యోగస్తులకు ఆనందదాయకంగా ఉండును. వాణిజ్య రంగంలో ఉన్నవారు కడు జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలి. విద్యార్థులకు ఉత్తమ సమయం. 21-23 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోండి. వైదిక సూచన: 1. గణపతి ఆరాధన శ్రేయస్కరం.

**వృషభరాశి:** ఈమాసంలో ఆర్థికవిషయాలలో జాగ్రత్త వహించాలి. ఆరోగ్య విషయంలో కూడా జాగ్రత్త అవసరం. వాహనం నడుపుటలో జాగ్రత్త వహించాలి. గృహంలో అశాంతికి చోటివ్వద్దు. ఉద్యోగస్తులు అదనపు బాధ్యతలు స్వీకరించే అవకాశం కలదు. ప్రయాణములవలన లాభం. వాణిజ్య రంగంలో గట్టిపోటీ ఎదుర్కొంటారు. న్యాయపరమైన విషయాలలో అనుకూలంగా వుండదు. అధిక శ్రమ చేసినచో విద్యార్థులు రాణిస్తారు. 23-26 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. శివారాధన శ్రేయస్కరం.

**మిథున రాశి:** ఈమాసంలో ఆర్థికంగా అనుకూలంగా వుంటుంది. నూతన వస్తువుల సేకరణ చేస్తారు. కుటుంబ సభ్యుల మధ్య భేదాభిప్రాయాలు ఉండుటచే మనఃశాంతి ఉండదు. సంఘసేవ చేసేవారికి తగిన గుర్తింపు లభించును. ఉద్యోగంలో ఉన్నవారికి మంచి గుర్తింపు లభించును. వాణిజ్యరంగంలో ఉన్నవారికి మంచి ఆదాయం ఉండును. విద్యార్థులకు అనుకూలసమయం. 26-28 తేదీల మధ్యముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1.దుర్గాస్తోత్ర పారాయణ శ్రేయస్కరం.

**కర్కాటక రాశి :** ఈమాసంలో ఆదాయంకి మించిన ఖర్చులు ఉండును. స్పెక్యులేషన్ కి దూరంగా ఉండవలెను. ఆరోగ్య విషయంలో చిన్న చిన్న జాగ్రత్తలు అవసరం. బంధుజనులతో ఆనందంగా గడుపుతారు. ఉద్యోగస్తులకు అనుకూల సమయం. పదోన్నతి లేదా స్థానంమార్పుకి అవకాశం కలదు. ప్రయాణాల వలన లాభం. వాణిజ్య వర్గం వారు తమ కార్యకలాపాలు విస్తరించు అవకాశం కలదు. నిరుద్యోగులకు ఉద్యోగావకాశము కలదు. 3 న మరియు 28-30 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.
వైదిక సూచన: 1. శ్రీ మహాలక్ష్మి స్తోత్ర పారాయణ శ్రేయస్కరం

**సింహ రాశి:** ఈమాసంలో ఆర్థిక నియంత్రణ అవసరం. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరం. ఉద్యోగస్తులకు అనుకూలం కాదు. పై అధికారుల వలన సమస్యలు ఉండును. ఆకస్మిక ప్రయాణాల వలన లాభం ఉండును. సంతానం కొరకు ఎదురు చూచువారికి శుభవార్త. వాణిజ్య వర్గం వారికి అనుకూలం. విద్యార్థులకు పై చదువులకు మంచి అవకాశం. 3-6 తేదీల మధ్య ముఖ్యమయిన కార్య

క్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. దత్తాత్రేయ స్తోత్ర పారాయణ శ్రేయస్కరం.

**కన్యారాశి:** ఈమాసంలో ఆర్థిక విషయాలలో బాగుండును. ఆరోగ్య విషయంలో, ముఖ్యంగా తిండి విషయంలో జాగ్రత్త అవసరం. గృహంలో ఆనంద వాతావరణం ఉండును. ఉద్యోగస్తులకు అనుకూల సమయం. ప్రయాణాలు హెచ్చుగా ఉంటాయి. వ్యాపారంలో ఉన్నవారు తమ వ్యాపార విస్తరణ చేస్తారు. విద్యార్థులకు అభివృద్ధి సూచితం. 6-8 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. నిత్యం ఇష్టదేవతా ప్రార్థన చేయవలెను.

**తులా రాశి:** ఈమాసంలో ఆర్థిక అనుకూలత ఉండును. అనవసర విషయాల జోలికి పోకండి. గృహంలో ఆనంద వాతావరణం ఉండును. దూరప్రయాణాలకు అవకాశం ఉంది. వ్యాపారస్తులకు అనుకూలసమయం. 8-10 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి. వైదిక సూచన: 1. ఆదిత్య హృదయ పారాయణ శ్రేయస్కరం.

**వృశ్చిక రాశి :** ఈమాసంలో ఆర్థికంగా బాగుండును. మానసిక ఉల్లాసం మరియు గృహ వాతావరణం ఆనందకరం. ఉద్యోగ రంగంలో ఉన్నవారికి మంచి గుర్తింపు లభించును. సేవారంగంలో ఉన్నవారికి మంచి సమయం. వాణిజ్య రంగం వారికి అభివృద్ధి. అవివాహితలకు వివాహం జరుగును. విద్యార్థులకు చదువుయందు శ్రద్ధ అవసరం. గురువుల యొక్క సూచనలు పాటించవలెను. 10-13 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి

వైదిక సూచన: 1. కులదేవతారాధన శ్రేయస్కరం.

**ధను రాశి :** ఈమాసంలో ఆర్థిక నియంత్రణ అవసరం. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరం. మానసిక అశాంతి ఉండును. విలువైన వస్తువులు ఖరీదు చేస్తారు. వ్యాపారస్తులకు కొంత కష్టకాలం. విద్యార్థులకు చదువుయందు అత్యంత శ్రద్ధ అవసరం.13-15 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.

వైదిక సూచన: 1. కనకధారా స్తోత్ర పారాయణ వలన మేలుజలుగును.

**మకర రాశి:** ఈమాసంలో ఆర్థిక అభివృద్ధి ఉండును. ఆరోగ్య సమస్యలు ఉన్నా త్వరగా కోలుకుంటారు. శుభ కార్యక్రమాల్లో పాల్గొంటారు. నూతన పరిచయాలు ఏర్పడతాయి. తీర్థయాత్రలు చేస్తారు. ఉద్యోగవర్గం వారికి శుభ సూచన. వ్యాపారస్తులకు మంచి అభివృద్ధి కానీ భూ సంబంధ వ్యాపారంలో ఉన్నవారికి జాగ్రత్తలు అవసరం. విద్యార్థులు మంచి కాలంను వినియోగించవలెను. 16-17 తేదీల మధ్య ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.

వైదిక సూచన: 1. శివారాధన శ్రేయస్కరం.

**కుంభ రాశి:** ఈమాసంలో ఆర్థికంగా బాగున్నా ఆర్థిక నియంత్రణ చాలా అవసరం. ఆరోగ్యము బాగుండును. గృహములో నూతన వస్తువులు ఖరీదు చేస్తారు. శుభ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉద్యోగస్తులు కొత్త బాధ్యతలు స్వీకరిస్తారు. వాణిజ్య వర్గం వారికి తమ వ్యాపార విస్తరణకు మంచి సమయం. స్థిరాస్తి విషయంలో లాభం పొందుదురు. ప్రయాణాలు కలసివచ్చును. విద్యార్థులకు మంచి అవకాశాలు వచ్చు సమయం. అంది పుచ్చుకోవలెను. పోటీ పరీక్షలలో విజయం. 17-19 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.

వైదిక సూచన: 1. శ్రీ దుర్గాస్తోత్ర పారాయణ శ్రేయస్కరం

**మీన రాశి :** ఈ రాశివారికి అధిక వ్యయం వలన చిక్కులు. దగ్గర వ్యక్తులతో కలహం మరియు గృహంలో అశాంతి. శుభ కార్యక్రమాలలో పాలుపంచుకుంటారు. ఉద్యోగ వర్గం వారికి స్థాన చలన సూచనలు. వాణిజ్య వర్గం వారు లావాదేవీలలో జాగ్రత్త వహించవలెను. 19-21 తేదీల మధ్య ముఖ్యమయిన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాలి.

వైదిక సూచన: 1. శ్రీరామ రక్షా స్తోత్ర పారాయణ శ్రేయస్కరం.

**సర్వే జనాః సుఖినో భవంతు**

పమ్మి భారతీ శర్మ



# వేసవిలో మలయమారుతం

పాఠకులూ, మీ అందరికీ వేసవి శుభాకాంక్షలు.

గ్రీష్మ తాపంతో, చమటలతో, వేడి వేడి వాతావరణానికి శుభాకాంక్షలు చెపుతున్నారేంటి అనుకుంటున్నారా! ఏడాది పొడవునా ఒక బిజీ జీవితాన్ని గడుపుతున్న మనం...ఈ వేసవి శెలవుల్లో విహారయాత్రాలకి ఎక్కడికి వెళ్ళాలి అని ముందుగానే ఓ ప్రణాళికను సిద్ధం చేసుకుంటాం.... పిల్లలకి శెలవులు కాబట్టి ఓ 2, 3 వారాలు వారితో గడిపేలా ముందు నుండి ప్లాను చేసుకుంటారు.... పిల్లల ఆలనా పాలనా కోసం అమ్మమ్మ తాతయ్యలను దగ్గరకి రప్పించుకుంటారు.......

ఇక ఊరగాయలు పెట్టుకోవడానికి అనువైన మాసాలు... ఏప్రిల్, మే నెలలే... ఇన్ని రకాల పనులు ఆనందంగా, ఆహ్లాదంగా చేసుకోవాలి అంటే ముందునుండే మన మైండ్ ను దానికి అనుగుణంగా సంసిద్ధం చేసుకోవాలి. ఇంటిలో కూలర్లు, ఎ. సి లు మంచి కండిషన్ లో పెట్టుకోవాలి... ముదురు రంగు కర్టెన్లు గదులకు, గుమ్మాలకు వేసుకోవాలి.. నీటి ఎద్దడి లేకపోతే కొన్ని ఇండోర్ ప్లాంట్స్ తో ఇంటిని అలంకరించుకోవాలి. చక్కని కుండను ..... మంచినీళ్ళ కోసం వంట గదిలో స్టాండుపై అమర్చి..దానికి రంగులు, స్టిక్కర్లు అంటించి ఆకర్షణీయంగా అలంకరిస్తే .... పిల్లలు కుండ నీళ్ళు త్రాగడానికి ఇష్టపడతారు.

చక్కని, మెత్తని కాటన్ దుస్తులు ధరిస్తూ ... ఎన్నో రకాల పానీయాలు ఇంట్లో తయారు చేసుకుంటే వడదెబ్బ తగలకుండా ఉంటుంది. సులువుగా బయటకి వెళ్ళినపుడు ఈ పానీయాలను తీసుకుని వెడితే ఖర్చు తగ్గుతుంది.

పానీయాలలో విరివిగా మనకు దొరికేది మామిడికాయలతో చేసిన అమ్ పన్నా ... నిమ్మకాయలతో చేసిన నిమ్మనీళ్ళు. సబ్జా గింజలు నానబెట్టి పలుచని మజ్జిగలో వేసి... ఉప్పు జీలకర్ర పొడి వేసుకుంటే చాలా బావుంటుంది.

పుదీనా, కొత్తిమీర, జీలకర్ర నూరి, ఉప్పు కలిపి నిమ్మరసంలో కలిపి షరబత్ చేసుకోవచ్చు. ఆ ముద్దని అల్లం ముక్కలు జోడించి మజ్జిగలో కలుపుకోవచ్చు. ఈ పై పానీయాలు బయటకి వెళ్ళేటపుడు ఓ బాటిల్ లో పోసుకుని పట్టుకుని వెళ్ళచ్చు.

ఇంట్లో ఉంటే... ఫ్రెష్ గా జ్యూసులు తయారు చేసుకోవచ్చు. కీరాలు, మొలకలు, నిమ్మరసం పిండి పిల్లలలకు, పెద్దలకు అందించచ్చు. కాస్త బలహీనంగా ఉన్న పిల్లలకు, షుగర్ వ్యాధి లేని పెద్దలకు పాలల్లో, అరటి పండు, డ్రై ఫ్రూట్స్ వేసి బనానా మిల్క్ షేక్, విధంగా ఆపిల్, మ్యాంగో, ఖర్బూజా, మాదీ ఫలాలతో, ఖర్జూరాలతో ఈ షేకులు తయారు చేసుకోవచ్చు. చల్లని పాలల్లో బాదం పిస్తా పప్పుల పొడిని వేసి, కుంకుమ పువ్వు వేసి, బాదం పాలు తయారు చేసుకోవచ్చు. ఎప్పుడూ ఇంట్లో పాలు, పెరుగు, పండ్లు, నిమ్మకాయలు ఉండేలా చూసుకుంటూ... నూనె పదార్థాలు, బజారు లోని బేకరీ పదార్థాలు చాలా తక్కువగా లేదా పూర్తిగా ఈ 6 వారాలు మానేసి.. పెరుగు పచ్చళ్ళు..వాటిపై దానిమ్మ గింజలను అలంకరించి, ఫ్రూట్ కస్టర్డ్ లను... కంటికి ఇంపుగా తయారు చేసుకుంటూ....పిల్లల్ని ఆ ప్రాసెస్ లో ఇన్వాల్వ్ చేస్తే వారూ ఇష్టంగా తింటారు. ఏ పూటకాపూట వండుకుంటూ, ఈ పానీయాలు తాగుతూ, వేసవిలో అయినవాళ్ళందరినీ తీరికగా కలుస్తూ.. కొత్త ఊరగాయల్ని పెట్టుకుని, తిని, దగ్గరివారికి రుచి చూపిస్తూ ఆరోగ్యంగా, ఆహ్లాదంగా గడిపితే మలయమారుతాలు వీస్తాయి. అందుకే వేసవిని ఆనందంగా ఆహ్వానిద్దాం. ఈ కాలం తాపాన్ని అధిగమిద్దాం. నీటిని జాగ్రత్తగా వాడుతూ పర్యావరణాన్ని కాపాడుకుంటూ.... వేసవి కోసం ఎర్ర తివాచీని పరచి స్వాగతం పలుకుతూ.......




మనమే ఎక్కువ
సాధించాం

RNI No. APTEL/2011/39497 APRIL 2019 Postal No. HSE/1043/2017-19

Date of Publishing: 1st April Date of Posting: 8th April



# శ్రీరామనవమి శుభాకాంక్షలు

Published, Edited and Printed by T.Shanti at Flat no. 45058, Janapriya Utopia, Hyderguda, Attapur, Hyderabad - 500 048, Phone: 94905 71297 / 94401 47993 email: teega51@gmail.com (www.chaitanyam.net) Printed at Planographers, 5-8-300, Chirag Ali lane, Abide, Hyderabad-50000